1 KLVA 102 M 305

> మానవుని సాంఘిక జీవన పరిస్థితులే అతని ఆలోచనా విధానాన్ని నిర్ణయించుతాయి. పురోగామి వర్గం యొక్క భావాలను ప్రజలు జీర్ణం చేసుకోగలిగితే, ఆ భావాలు భౌతికశక్తిగా రూపొందుతాయి; ఈ భౌతికశక్తి సమాజాన్ని మార్చుతుంది; ప్రపంచాన్ని మార్చుతుంది.
>
> \- మావో

ప్రజాపంథా

సి.పి.ఐ (ఎం.ఎల్ - న్యూడెమోక్రసీ) పక్షపత్రిక

సంపుటి : 25 సంచిక : 6 15-7-2008 పేజీలు : 16 ప్రచురణస్థలం : హైదరాబాద్ ఎడిటర్ : మాదాల నారాయణస్వామి వెల : 8

ఆగస్టు 20 దేశవ్యాపిత సాధారణ సమ్మెను విజయవంతం చేయండి

2008 మే 13న ఢిల్లీలో జరిగిన ట్రేడ్ యూనియనుల జాతీయ సదస్సు ఆగస్టు 20న ఒక రోజు దేశవ్యాపిత సాధారణసమ్మెకు పిలుపు నిచ్చింది. వివిధ కేంద్ర ట్రేడ్ యూనియనులు, బ్యాంకులు, జీవిత భీమా సంస్థ, రైల్వే, రక్షణశాఖ, టెలికాం, ఎయిర్‌లైన్స్, ఎయిర్ పోర్టుల వుద్యోగ సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలతో కూడిన స్పాన్సరింగ్ కమిటీ ఈ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సు గత 4 సంవత్సరాలుగా కేంద్రంలోని యు.పి.ఏ. ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చిన కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక నయా వుదారవాద విధానాలను ఖండించింది. ఈ విధానాల పర్యవసానంగానే దేశంలో ధరలు హద్దు లేకుండా పెరిగిపోయి ప్రజల, ముఖ్యంగా కార్మికవర్గం, పేద ప్రజల జీవితాలను దుర్భరంగా మార్చివేశాయని విమర్శించింది. యుపిఏ తాను ప్రకటించుకున్న జాతీయ కనీస వుమ్మడి కార్యక్రమంలోని అంశాలను కూడా తుంగలో తొక్కుతున్నదని విమర్శించింది. దీని పర్యవసానంగానే దేశంలో వ్యవసాయ సంక్షోభం యేర్పడి కొనసాగుతున్నదని, చట్టా వ్యాపారులు సరుకుల మార్కెట్టుపై రాజ్యం చెలాయిస్తున్నారని, ప్రజా పంపిణీ వ్యవస్థ కుప్పకూలిపోయిందని జాతీయ సదస్సు ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు. ప్రజలు కోరుతున్నట్లుగా ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయటంలో కాని, ధరలను అదుపు చేయటంలో కాని ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని, జాతీయాభివృద్ధి రేటు పెరుగుదల వల్ల కలిగిన లాభాన్నంతటినీ పిడికెడు మంది ధనికులే హక్కు భుక్తం చేసుకుంటున్నారని విమర్శించింది.

జాతీయ సదస్సు ఈ క్రింది దశలవారీ కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. ఈ పోరాట కార్యక్రమం ఆగస్టు 20 నాటి దేశవ్యాపిత సమ్మెతో వున్నత స్థాయికి చేరుతుంది. ఈ సమ్మె డిమాండ్లు ఈ క్రింది విధంగా వుంటాయి.

1) ధరలను అదుపు చేయటానికి ఈ క్రింది తక్షణచర్యలు తీసుకోవాలి.

(ఎ) ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులన్నిటినీ దేశంలోని ప్రజలందరికీ నియమిత ధరలకు ప్రభుత్వం సరఫరా చేయాలి. (బి) నిత్యావసర సరుకుల వ్యాపారంలో ఫ్యూచర్స్, ఫార్వర్డు ట్రేడింగును నిషేధించాలి. (సి) పెట్రోలు, డీజిల్‌పైన పన్నులను తగ్గించాలి. (డి) సరుకులను దాచే వారి మీదా, దొంగ వ్యాపారం చేసే వారి మీదా కఠిన చర్యలు తీసుకోవాలి.

2) అన్ని కార్మిక చట్టాలను, ముఖ్యంగా కనీస వేతనాల చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. పని గంటలను, సాంఘిక భద్రతా పథకాలను ఖచ్చితంగా అమలు జరపాలి. వీటిని వుల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కంట్రాక్టీకరణను, ఔట్ సోర్సింగును నిలిపివేయాలి.

3) దారిద్ర్యరేఖకు దిగువనున్నారా? ఎగువనున్నారా? అనే దానితో నిమిత్తం లేకుండా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులందరినీ ప్రస్తుతం పార్లమెంటులో పెండింగులో వున్న అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రతా బిల్లు పరిధిలోకి తీసుకురావాలి. ఆ విధంగా, అసంఘటితరంగ సంస్థల జాతీయ కమీషను (NCEUS) మరియు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు చేసిన ఏకగ్రీవ సిఫారసుల ప్రకారం జాతీయ కనీస సాంఘిక భద్రతా ప్రయోజనాన్ని అసంఘటిత రంగ కార్మికులందరకూ ప్రభుత్వ నిధులతో అమలు జరిగేలా చూడాలి.

4) రైతుల రుణమాఫీ పథకాన్ని, రైతాంగం ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుండి తీసుకున్న రుణాలకు కూడా వర్తింప చేయాలి. జాతీయ బ్యాంకులు తక్కువ వడ్డీ రేటుకు రైతులకు రుణాలను యివ్వాలి.

5) ప్రభుత్వోద్యోగాలలో నియామకాలపై నిషేధాన్ని తొలగించాలి. 6వ వేతన సంఘం సిఫారసులలోని వ్యతిరేక, వివక్షా పూర్వక అంశాలను తొలగించాలి. అలా సవరించిన సిఫారసులను ఉద్యోగ సంఘాలతో సంప్రదించి అమలు జరపాలి. గ్రామీణడాక్ సేవకుల, కంటింజెంట్, వర్కు చార్జుడు ఉద్యోగుల సర్వీసులను సత్వరం క్రమబద్ధం చేయాలి. వారికి పెన్షను సౌకర్యాన్ని కల్గించాలి. నూతన పెన్షన్ పథకాన్ని, PF RDA బిల్లును రద్దు చేయాలి.

6) కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల, కంట్రాక్టు కార్మికుల వేతన చర్చలను వేగవంతం చేయాలి. ఇందుకు యెలాంటి షరతులను విధించకూడదు.

పై డిమాండ్ల సాధనకు అఖిల భారత సదస్సు ఈ క్రింది దశలవారీ కార్యక్రమానికి పిలుపు నిచ్చింది.

★ రాష్ట్ర, జిల్లా కేంద్రాలలోనూ, పారిశ్రామిక కేంద్రాలలోనూ సంయుక్త సదస్సులను 2008 జూలై 15 నాటికి పూర్తి చేయాలి

★ రాష్ట్ర కేంద్రాలలోనూ, పారిశ్రామిక కేంద్రాలలోనూ జూలై 30న భారీ యెత్తున ప్రదర్శనలు/సమీకరణలు / ధర్నాలు

★ 2008 ఆగస్టు 4న ప్రదర్శనల ద్వారా వెళ్లి సమ్మె నోటీసులను అధికారులకు/యజమాన్యాలకు రావ్వాలి

★ 2008 ఆగస్టు 20న దేశవ్యాపిత సాధారణసమ్మె

ఈ సంయుక్త పోరాట కార్యక్రమాలలో పెద్ద యెత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కార్మిక వర్గానికంతటికీ, కార్మిక సంఘాలన్నిటికి ట్రేడ్ యూనియనుల స్పాన్సరింగ్ కమిటీ పిలుపిచ్చింది.

సమ్మెకు సన్నాహంగా జరిగే దశలవారీ కార్యక్రమాలలోనూ, దేశ వ్యాపిత సాధారణసమ్మెలోనూ ఐ.యఫ్.టి.యం శాఖలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలి.

సంపాదకీయం

కొత్త సీసాలో పాత సారా

చిరంజీవి రాజకీయపార్టీని పెట్టటం ఖాయమైపోయింది. ఒక సినీ కళాకారుడు రాజకీయ పార్టీ పెట్టవచ్చునా? రాజకీయాల్లో భాగం పంచుకోవచ్చునా? అనే చర్చ కొంత సాగింది. ఒక పౌరుడిగా ఒక సినీ కళాకారుడికైనా, మరే వృత్తి ననుసరించే వాడికైనా - యితర పౌరులకు రాజకీయాల్లో పాల్గొనే హక్కు యెంత వుంటుందో వారికీ అంతే వుంటుంది. అయితే సినీ కళాకారుడిగా వచ్చిన పేరు ప్రతిష్టలతోనే రాజకీయ నాయకుడిగా లబ్ది పొందాలనుకోవటం కానీ, రాజకీయ పార్టీని పెట్టి అధికారాన్ని పొందాలనుకోవటం కానీ సమంజసం కాదు. రాజకీయ రంగంలో సాగించిన కృషి, చరిత్ర, అనుభవమే రాజకీయాల్లో స్థానానికి ప్రాతిపదిక కావాలి. అయితే యివాళ కళాకారుడిగా పొందిన గుర్తింపును కానీ, క్రీడాకారుడిగా పొందిన గుర్తింపును కానీ, రాజకీయ రంగంలో ఆధిక్యత సంపాదించుకోవటానికే వుపయోగించుకుంటున్నారు. ఇది నైతిక భ్రష్టతే.

ఇవాళ సినిమా రంగమూ, రాజకీయ రంగమూ - రెండూ వారసత్వ రాజకీయాలకు కేంద్రాలయ్యాయి. సినిమా హీరోలూ, దర్శకులూ, నిర్మాతలూ తమ ప్రతిష్ట, పలుకుబడుల నుపయోగించి తమ కుటుంబ సభ్యులను అర్హతలున్నా, లేక పోయినా కళాకారులుగా నిలబెట్టటానికి ప్రయత్నిస్తున్నారు. అన్ని పార్టీల రాజకీయ నాయకులూ తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లో తమ వారసులుగా చేయటానికి అంతులేకుండా పాకులాడుతున్నారు.

షష్టిపూర్తి దశ వచ్చే వరకూ చిరంజీవి యెన్నడూ రాజకీయాల పట్ల ఆసక్తి చూపలేదు. రాజకీయాల్లో యెలాంటి భాగస్వామ్యం వహించలేదు. హీరోగా పదవీ విరమణచేయవలసిన దశ వచ్చిన తర్వాత, తన కొడుకును, యితర కుటుంబ సభ్యులను ఆ రంగంలో ప్రమోట్ చేసి, తాను రాజకీయ రంగంలోకి మారాలనుకోవటం అవసరానుగుణంగా వ్యాపారాలను మార్చటం లాంటిది. ప్రజా సేవ కోసం రాజకీయాలలోకి వస్తున్నానని చెప్పటం పచ్చి దగా మాత్రమే. చిరంజీవి రాజకీయాల్లోకి వస్తున్న తీరు కూడా వింత కొలిపేదిగా వుంది. అతడు తాను పెట్టబోయే పార్టీ సిద్ధాంత దృక్పథాన్ని, కార్యక్రమాన్ని, రాజకీయ విధానాలను మొదట ప్రకటించాలి. దానిని మొదట ప్రచారంలో పెట్టాలి. అలా చేస్తే ప్రజలు ఆ పార్టీ పట్ల తమ వైఖరులను నిర్ణయించుకోవటానికి తోడ్పడుతుంది. కానీ, చిరంజీవి అలా చేయలేదు. పార్టీ పెడుతున్నదీ, లేనిదీ కొన్నాళ్లు ప్రకటించలేదు. ఇప్పడు పార్టీ త్వరలో పెట్టబోతున్నామని ప్రకటించారు. కానీ ఆ పార్టీ విధానాలేమిటో యింత వరకు ప్రకటించలేదు. రాష్ట్ర వ్యాపితంగా అభిమానుల సమావేశాలు చేసి, వారితో చిరంజీవి రాజకీయ పార్టీ పెట్టాలనే డిమాండు చేయించుకున్నారు. కార్మిక ప్రతినిధులు, హైటెక్ వుద్యోగ ప్రతినిధుల, విద్యార్థుల, మహిళల ప్రతినిధుల పేరిట సమావేశాలు నిర్వహించి యిలాంటి డిమాండునే చేయించారు. కుటుంబ సభ్యులే ఈ కర్మకాండకంతా నాయకత్వం వహించారు.

ఒక కొత్త వ్యాపార సరుకును మార్కెట్టులోకి ప్రవేశపెట్టేటప్పడు ఆధునిక వ్యాపారస్తులనుసరించే విధానాన్నే చిరంజీవి బృందం రాజకీయ పార్టీని పెట్టటానికీ అనుసరించింది. ప్రత్యేక కన్సల్టెన్సీల ద్వారా, ఏ కార్యక్రమాన్ని, ఏ విధానాలను, ఏ నినాదాలను యిస్తే ప్రజలను ఆకర్షించగలుగుతారో సర్వేలు జరిపించారు. (ప్రజల బాధలకు స్పందించి, వాటి పరిష్కారం కోసం తాపత్రయ పడి, తగిన అధ్యయనం, పరిశీలన చేసి సిద్ధాంతాన్ని, కార్యక్రమాన్ని, విధానాలను రూపొందించుకోవటం కాదు.) ఉద్ధండులైన జ్యోతిష్కులను సంప్రదించి ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. ప్రసిద్ధ దేవాలయాల్లో పూజలు జరిపించి దైవానుగ్రహాన్ని పొందటానికి ప్రయత్నించారు. చివరికి విధానాల చుట్టూ కాకుండా చిరంజీవి చుట్టూ పార్టీని నిర్మించటానికి పూనుకుంటున్నారు.

(మిగతా 3వ పేజీలో)

లోపలి పేజీల్లో...

★ ప్రథమ జూట్ రాష్ట్ర మహాసభ	2	★ డిగ్గర్లనేత జెరార్డ్ విన్‌స్టాన్లీ	9
★ ఇండో అమెరికన్ అణు వప్పందం	3	★ ద్రవ్యోల్బణం - ఆహార భద్రత	10
★ విద్యారంగం మీద ప్రభుత్వ దాడి	4	★ సోషలిస్టు విప్లవం అంటే?	11
★ జింబాబ్వేలో పురోగమిస్తున్న...	5	★ కష్టజీవుల పోరుజెండా	12
★ డబ్ల్యూ.టి.వో నుండి వైదొలగాలి!	6	★ పొట్టిలంక దాడిపై నిరసన	13
★ దేశంలో ఆదివాసీల స్థితిగతులు	7	★ ఉపాధి హామీ పథకంపై సర్వే	14
★ నేపాల్ విజయంపై కలకత్తాలో సభ	8	★ శ్రీకాకుళం జిల్లాలో సదస్సు	16

ఉత్సాహ పూరితంగా జరిగిన ప్రథమ రాష్ట్ర జూట్ కార్మిక మహాసభ





సుమారు పాతికేండ్ల క్రితం ఏలూరు జూట్ మిల్లులో ఇఫ్టూ నాటిన విత్తనం మొలకై, మొక్కై, వృక్షంగా ఎదిగింది. బీజ రూపం నుండి వటవృక్షం స్థాయి చేరుకున్నది. పిండ దశ నుండి పురుడు పోసుకొని సమగ్ర రూపంగా తీసుకున్నది. తప్పటడుగుల నుండి నడక నేర్చుకొని సక్రమంగా పరుగు పెట్టగల స్థాయికి చేరుకున్నది. బీజ రూపంలోనే అంతమొందించాలని యజమాన్యాలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మొగ్గలోనే తుంచెయ్యాలనే వారి లక్ష్యం నెరవేరలేదు. ఫలదీకరణచెందకుండా పిండదశలోనే తుదముట్టించాలనే యాజమాన్యాల కలలు కల్లలయ్యాయి. జూట్ రంగంలో ఇఫ్టూను లేకుండా చెయ్యాలని వారు ఆశిస్తే, దానికి 180 డిగ్రీల వ్యతిరేక దిశలో ఇఫ్టూ ప్రయాణం సాగింది. కార్మికులకు ఇఫ్టూను దూరం చెయ్యాలని మేనేజ్‌మెంట్లు కలిస్తే అందుకు భిన్నంగా ఇఫ్టూ కార్మికులు హృదయాల్లో స్థానం సంపాదించింది. ఇఫ్టూ పట్ల వ్యతిరేకత తేవాలని వారు ప్రయత్నిస్తే కార్మికులు మాత్రం ఇఫ్టూను తమ గుండెలకు హత్తుకున్నారు. నిర్బంధాల ద్వారా ఇఫ్టూను దెబ్బతీయాలనే మార్గం వారు ఎంచుకుంటే లారీచార్జీలు, అరెస్టులు, కిడ్నాప్‌లు, జైళ్ళు వగైరాలను ఇఫ్టూ విరిమాలగా స్వీకరించింది. ప్రాణాలు తీయడం ద్వారా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చెయ్యాలని వారు ప్రయత్నిస్తే రక్త తర్పణలు, ప్రాణార్పణల ద్వారా ఇఫ్టూ త్యాగపూరిత చరిత్రను సృష్టించింది. నిరంతరం సమస్యలు సృష్టించి నాయకత్వాన్ని అస్థిర పర్చాలని యాజమాన్యాలు ఎత్తులు వేస్తే, వాటికి ధీటుగా ఎత్తుగడలు రూపొందించి ఇఫ్టూ వారి ఎత్తులు చిత్తు చేసింది. కార్మికులను చెల్లాచెదురు చెయాలని వారు భావిస్తే ఇఫ్టూ సమర రంగంలోకి దూకించింది. నిత్యం చికాకులు కలిగించడం ద్వారా కార్మికులను చీల్చాలని వారు యత్నిస్తే ఓపికగా, సహనంతో కృషి సాగించడం ద్వారా ఇఫ్టూ కార్మికులను మనసులను గెలుచుకుంది. నాయకత్వం పట్ల అపోహలు సృష్టించి, అంతరం పెంచి లబ్ధి పొందాలని మేనేజ్‌మెంట్లు పన్నాగాలు పన్నితే నీతి నిజాయితిలతో కూడిన కార్యాచరణద్వారా ఇఫ్టూ కార్మికుల్లో సుస్థిర స్థానం సంపాదించింది. అబద్దాలతో నాయకత్వాన్ని అగ్ని పరీక్షలకు గురిచేస్తే కార్మికులతో సజీవ సంబంధాలు కొనసాగిస్తూ వారి జీవితాల్లో భాగమై, వారితో మమేకమై ఇఫ్టూ కార్మికులను గెలుచుకున్నది. అనేక ఆటుపోట్ల నడుమ భారీ ఉప్పెనలను, పెను తుఫానులను చాకచక్యంగా దాటుకుంటూ ముందుకు సాగిన ఇఫ్టూ కార్యాచరణే నేడు జూట్ రంగంలో సుస్థిరమైన చరిత్రను లిఖించుకోవడానికి ప్రాతిపదికగా మారింది. రాష్ట్రంలోని 40 వేల మంది జూట్ కార్మికుల్లో ఇఫ్టూ 25 వేల మందికి నాయకత్వం వహిస్తున్నది.

ఏలూరు జూట్ మిల్లులో ప్రారంభమైన ఇఫ్టూ ప్రస్థానం నెల్లిమర్లకు విస్తరించింది. అది అంతటితో ఆగకుండా విజయనగరంలోని అనేక మిల్లులకు ఎగబాకింది. విశాఖ జిల్లాలో వెళ్ళూనుకున్నది. కొత్తగా పెట్టిన కొత్తూరు మిల్లులో జండా ఎగరేసింది. నేడు శ్రీకాకుళం జిల్లాలోకి తన ప్రయాణం కొనసాగించింది. గుంటూరు, వీరవల్లిలలో ప్రచారం కొనసాగిస్తున్నది. ఆంధ్రా నుండి బెంగాల్‌కు పాకి అక్కడ ప్రభావం చూపిస్తున్నది. ఎక్కడికక్కడే పరిమితంగాకుండా రాష్ట్ర, ఆలిండియా సమన్వయ కమిటీలు ఏర్పడటానికి దోహదకారి అయ్యింది. ఇది ఆంధ్ర జూట్ కార్మిక వర్గానికే గర్వకారణం. త్యాగాలు వృధా కాలేదనీ అది పుష్పించి, ఫలించి, శాఖోపశాఖలుగా విస్తరించడానికి మార్గదర్శకం అయ్యిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ క్రమంలో మరింత సంఘటిత ఉద్యమ నిర్మాణానికి, మొత్తం కార్మిక వర్గాన్ని ఏకత్రాటి పైకి తేవడానికి ఆలిండియా స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ జూట్ ఫెడరేషన్ ఏర్పాటు చెయ్యాలని ఇఫ్టూ కమిటీలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ నిర్ణయాలలో భాగంగా జూలై 27న కలకత్తాలో జరిగే ప్రథమ అఖిల భారత జూట్ మహాసభకు ముందు మన రాష్ట్ర ప్రథమ జూట్ మహాసభ విజయవంతంగా జరిగింది.

ఈ మహాసభకు రాష్ట్రంలోని విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాలలోని 11 జూట్ మిల్లుల నుండి 14 వేల మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా నుండి జూట్ ప్రతినిధులు హాజరుకాక పోయినా అక్కడి ఇఫ్టూ బాధ్యులు హాజరయ్యారు. మహాసభకు ముందు సుమారు 18 జూట్ మిల్లుల్లో 10 వేల కరపత్రాలు 1000 పోస్టర్లతో ప్రచారం చేశారు.

22.06.2008 ఆదివారం విజయనగరంలో నెల్లిమర్ల అమరవీరుల నగర్ (ఆనందగజపతి ఆడిటోరియం)లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రథమ రాష్ట్ర జూట్ మహాసభ జరిగింది. సభ ప్రారంభానికి ముందు నెల్లిమర్ల అమరవీరులను స్మరించేందుకు నిర్మించిన తాత్కాలిక స్థూపం వద్ద ప్రతినిధుల విప్లవ నినాదాల మధ్య ఇఫ్టూ జండాను రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అరుణోదయ కళాకారులు ఆలపించిన విప్లవగేయాల సాక్షిగా అరుణపతాకం రెపరెపలాడింది.

రాష్ట్ర జూట్ సమన్వయ కమిటీ కన్వీనర్ కా॥ పి. ప్రసాద్ అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. అమరవీరులను స్మరిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

యాజమాన్యదాడులపై సమైక్యంగా ఉద్యమించండి!

- ఇఫ్టూ ఆలిండియా అధ్యక్షులు పల్టూసేన్ పిలుపు

ఈ మహాసభలో ఇఫ్టూ ఆలిండియా అధ్యక్షులు, ఆలిండియా జూట్ సమన్వయ కమిటీ కన్వీనర్ కామ్రేడ్ పల్టూసేన్ ప్రారంభోపన్యాసం చేశారు. జూట్ యాజమాన్యాలు సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. జూట్ పరిశ్రమ సంక్షోభంలో వుందని నమ్మిస్తూ యాజమాన్యాలు కార్మికులను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. కార్మికులు సరైన ఉత్పత్తి ఇవ్వడం లేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయనీ, ఇది ఎంత మాత్రం నిజం కాదని ఆయన కొట్టి వేశారు. ఏటా 60 లక్షల టన్నుల ఉత్పత్తిని సృష్టిస్తున్న కార్మికులపై నిందలు మోపడాన్ని పల్టూసేన్ తీవ్రంగా ఖండించారు. కృత్రిమ కొరతను సృష్టిస్తూ కార్మికుల జీతభత్యాలను హరిస్తూ, కరువు భత్యాన్ని స్తంభింపజేస్తూ, బోనస్‌ల ఎగవేతకు పూనుకుంటున్నాయని విమర్శించారు. మౌలిక సదుపాయాలను కుదిస్తూ హక్కుల కాలరాతకు యాజమాన్యాలు పాల్పడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. లాకౌట్లు, పనిని నిలుపుదల చేయడం, కార్మికులను తొలగించడం లాంటి చర్యల ద్వారా ఇబ్బందులు సృష్టిస్తున్నాయని చెప్పారు. పి.ఎఫ్, ఇ.యస్.ఐ సంస్థలకు చెల్లించాల్సిన సొమ్మును జమ చేయకుండా ఎగవేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బ్రిటీష్ కాలంలోనే జూట్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ప్రారంభమయ్యాయనీ, సుదీర్ఘ చరిత్రవున్న జూట్ పరిశ్రమ ప్రస్తుతం ఆటుపోట్లను ఎదుర్కొంటున్నదని ఆయన అన్నారు. ఇందుకు కారణం యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరేనని ఆయన దుయ్యబట్టారు. కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ, పని భారాన్ని పెంచుతూ కార్మికులను శారీరక, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు కూడా యాజమాన్యాల కొమ్ముకాస్తున్నాయనీ, చివరకు న్యాయస్థానాలు కూడా కార్మికులకు వ్యతిరేకంగా తీర్పునిస్తున్నాయనీ ఆయన విచారం వ్యక్తం చేశారు. పాలిథిన్, సింథటిక్ సంచులను మార్కెట్‌లోకి ప్రవేశ పెడ్తూ సాంప్రదాయక, ఆరోగ్యకరమైన జూట్ ఉత్పత్తులను దెబ్బతీసే ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పల్టూసేన్ పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీయంగానీ, వాటి అనుబంధ సంస్థలు ఏఐటీయూసీ, సీఐటీయూలు గానీ కార్మికులకు ఒరగబెటేది ఏమీ లేదనీ, వారి చర్యలు కార్మిక విద్రోహపూరితమని విమర్శించారు. వారి వెనుక వున్న కార్మికవర్గాన్ని కూడా సమీకరించి, సమరశీల ఉద్యమాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.

దేశీయ మార్కెట్ అభివృద్ధి జూట్ రంగాన్ని రక్షిస్తుంది!

- ఇఫ్టూ ఆలిండియా జనరల్ సెక్రటరీ బి. ప్రదీప్

విదేశీ ఎగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ మార్కెట్‌ను అభివృద్ధి చేసినప్పుడే జూట్ పరిశ్రమ నిలదొక్కుకుంటుందని ఇఫ్టూ ఆలిండియా జనరల్ సెక్రటరీ బి. ప్రదీప్ అన్నారు. ఈ మహాసభల్లో ఆయన ప్రసంగిస్తూ జూట్ పరిశ్రమ సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఎగుమతులను పెంచాలని చెప్పడం హాస్యాస్పదంగా వుందని ఆయన అన్నారు. ఎగుమతులనేవి ఆయా దేశాల రాజకీయ లక్ష్యాలు, పాలకవర్గాల విధానాల మీద ఆధారపడతాయని, అందుకే దేశీయ మార్కెట్‌ను విస్తరించుకోవటానికి పూనుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశం అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నదని పాలకులు గప్పాలు కొట్టుకుంటున్నారనీ ద్రవ్యోల్బణం 11.05 శాతం పెరిగితే అభివృద్ధి సాధించినట్లు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. వృద్ధిరేటు వుండే ఉద్యోగాలు పెరగాలనీ, కానీ అటువంటి పరిస్థితి లేదనీ అన్నారు. దేశీయ కార్మికవర్గం తీవ్రమైన ఎదురు దెబ్బలు తింటున్నదనీ అందులో జూట్ కార్మికవర్గం కూడా వుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గంపై దుష్ప్రభావం చూపిస్తున్న ప్రపంచీకరణ,

ఇండో అమెరికన్ అణు వప్పందం - రివిజనిస్టు రాజకీయాల దివాళాకోరుతనం

చివరికి యు.పి.ఏ ప్రభుత్వం వామపక్షాల మద్దతును వదులుకొని భారత్-అమెరికా అణు వప్పందాన్ని ముందుకు తీసుకుపోవటానికే నిర్ణయించుకుంది. వామపక్షాలు కూడా చివరాఖరికి యు.పి.ఏ ప్రభుత్వానికి మద్దతు వుపసంహరించుకోవటానికే నిర్ణయించుకున్నాయి. యూపీఏ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గుకు వస్తుందా? లేదా? యూపీఏ ప్రభుత్వం ఓడిపోయి, మరో సంకీర్ణ ప్రభుత్వం యేర్పడుతుందా? లేక మధ్యంతర ఎన్నికలే మార్గాంతరమవుతాయా? ఇవన్నీ దేశంలో వేడిగా చర్చించబడ్తున్న విషయాలు.

అయితే, 2004లో యూపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు యిచ్చినప్పడు కాంగ్రెసు పార్టీ ప్రభుత్వాలు అనుసరిస్తూ వచ్చిన అమెరికా అనుకూల విదేశాంగ విధాన చరిత్ర వారికి తెలియదా? అనేది ప్రశ్న. ప్రపంచ బ్యాంకు, ఐ.యం.యఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థల ఆదేశాలకు లోబడి వ్యవహరించే దాని దేశీయ మౌలిక ఆర్థిక విధానాల గురించి వారికి తెలియదా? అయినా 2004లో యూపీఏకు యెందుకు మద్దతు యిచ్చారు? మతోన్మాద బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవటమే ఏకైక లక్ష్యమని వారు ఆనాడు చెప్పారు. మరి ఈనాడు అదే మతోన్మాద బీజేపీతో కలిసి యూపీఏ ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి పూనుకోవలసివస్తున్నది కదా! యూపీఏ స్థానంలో మతోన్మాద బీజేపీ అధికారంలోకి రావటానికి మార్గం వేయాల్సి వస్తున్నది కదా! గత నాలుగు సంవత్సరాలకు పైబడిన కాలంలో యూపీఏ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలకు వామపక్షాలు కూడా బాధ్యత వహించకుండా తప్పకోలేవు కదా! దీనికి వామపక్షాలు ఏమి జవాబు చెబుతాయి? యుపీఏకి మద్దతు యిస్తూనే మూడవ ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తామని వారు చేసిన ప్రగల్భాలు గాలి మాటలుగా మిగిలి పోవటానికి వారి సంజాయిషీ ఏమిటి? మూడవ ప్రత్యామ్నాయమలా వుంచి అవకాశ వాద మూడవ ఫ్రంటు ప్రయత్నాలు కూడా అడుగు ముందుకు వేయక పోవటానికి వారేమి జవాబు చెబుతారు? అది వట్టికప్పల తక్కెడ అని రుజువయింది కదా! మళ్లీ, వాళ్ల పార్లమెంటరీ రాజకీయ పంథా ప్రకారం 2009 ఎన్నికలలో ఎవరితోనో ఒకరితో ఫ్రంటు కట్టి ఒకరిని అధికారంలోకి రాకుండా నిరోధించటం, ఒకరిని అధికారంలో కూర్చో బెట్టటం వామపక్షాల అనివార్య విద్యుక్తధర్మం కదా! ఈసారి కాంగ్రెసుకు వ్యతిరేకంగా బీజెపీ కూటమితో కలుస్తారా? బీజెపీకి వ్యతిరేకంగా యిప్పడు కూలగొట్టిన కాంగ్రెసు కూటమినే అధికారంలోకి తెస్తారా? ఏం చేస్తారో వారే చెప్పాలి.

వాస్తవానికి, పార్లమెంటరీ రాజకీయాలలో ఎప్పడూ ఎవరో ఒకరిని బలపరచాలనే వైఖరి తీసుకుంటే, యిలాంటి సంకట పరిస్థితే యెదురవుతుంది? ఇలాంటి విపరిణామాలే తలెత్తుతాయి.

సంపాదకీయం

కమ్యూనిస్టు లేక విప్లవపార్టీ అని చెప్పకునే ఏ పార్టీ అయినా విప్లవానికి ప్రధాన శత్రువుతో ఫ్రంటు కట్టటం, దానిని అధికారంలోకి తీసుకురావటం, దాని అధికారాన్ని కాపాడటం పూర్తిగా సూత్ర విరుద్ధం. సీపీఐ (యం), సీపీఐ పార్టీల కార్యక్రమాలు కాంగ్రెసు, బీజేపీలు - రెండిటినీ భారత ప్రజలకు ప్రధాన శత్రువులుగా పరిగణిస్తాయి. ప్రత్యేక, అసాధారణపరిస్థితులలో తప్ప, ఇలాంటి పార్టీల మధ్య ఒకరికి వ్యతిరేకంగా మరొకరితో ఫ్రంటు కట్టి అధికారంలోకి తీసుకురావటం ప్రజలకు, వర్గ పోరాటానికి ద్రోహం చేయటమే. ఇలాంటి విధానం ప్రజలు ఆ పార్టీల పట్ల భ్రమలు పెంచుకోవటానికి దారి తీస్తుంది. ఇలాంటి పార్టీలకు మద్దతిచ్చే 'కమ్యూనిస్టు', 'వామపక్ష' పార్టీలు వీరి తోకలుగా తయారై, వారిలో కలిసి పోవటానికి దారితీస్తుంది.

'మేము కనీస వుమ్మడి కార్యక్రమం మీద ఆధారపడి యూపీఏను బలపరిచాం. యూపీఏతో కొన్ని ప్రజానుకూల కార్యక్రమాలు అమలు జరిపించగల్గాం. యూపీఏ ప్రభుత్వం కొన్ని ప్రజావ్యతిరేక విధానాలు అనుసరించకుండా అడ్డుకోగల్గాం లేక వాటి తీవ్రతను తగ్గించగల్గాం' అని 'వామ పక్షాలు' తమను తాము సమర్థించుకోవచ్చు. కాని యూపీఏ ప్రభుత్వం అనుసరించిన జాతి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక జాతీయ, అంతర్జాతీయ విధానాలకు వీరు బాధ్యత వహించవలసిందే. అందుకు వారు తోడ్పడ్డారు కదా! ఈ విధంగా యూపీఏ ప్రభుత్వం మీద ప్రజలకు భ్రమలు కల్గించటానికి, అది విఫలమవుతున్న పరిస్థితిలో బీజేపీపై ప్రజలకు భ్రమలు కల్గించటానికి వీరి విధానం తోడ్పడలేదా? అని మేము ప్రశ్నిస్తున్నాం.

అధికారంలో వున్న పాలకవర్గ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను పెద్దయెత్తున పోరాటాల్లోకి సమీకరించటం ద్వారా ప్రభుత్వం నుండి మనం అనేక మినహాయింపులను పొందగల్గుతాం. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టగల్గుతాం. కనీసం కొంత వెనకడుగులు వేసేలా చేయగల్గుతాం. అదే సమయంలో అన్ని సెక్షన్ల పాలకవర్గాల పట్ల ప్రజలకు భ్రమలు తొలగించగల్గుతాం. విప్లవ ప్రత్యామ్నాయాల వైపు ప్రజలను సమీకరించగల్గుతాం.

భారత్-అమెరికా అణు వప్పందానికి వ్యతిరేకంగా వామపక్షాలు యూపీఏ ప్రభుత్వానికి మద్దతు వుపసంహరించుకోవటం హర్షణీయమే. అయితే ఏదో ఒక పాలకవర్గ పార్టీని ఓడించి మరో పాలక వర్గ పార్టీని గద్దెనెక్కించే క్రీడను 'వామపక్షాలు' కొనసాగిస్తే ప్రస్తుత మద్దతు వుపసంహరణకు అర్థం వుండదు. వామపక్షాలు తమ గత తప్పడు కార్యాచరణనుండి గుణపాఠం తీసుకుని పార్లమెంటరీ రొచ్చుకుంట రాజకీయాల పరిధి నుండి బయట పడ్తాయా? వర్గ పోరాటాల బాటను చేపడ్తాయా? జవాబు చరిత్రే చెప్పాలి.

సరళీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని కా॥ ప్రదీప్ పిలుపునిచ్చారు.

ఈ మహాసభకు మరో అతిధిగా హాజరైన ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల సంఖ్యలో తెల్లకార్డులు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారనీ, అంటే పేదరికం పెరుగుతున్నదనడానికి ఇది సూచన అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డి.ఎ. పెరగడం లేదని ఆయన చెప్పారు. పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ మహాసభలో నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్షులు కా॥ జె.వి. చలపతిరావు ప్రసంగించారు. ప్రభుత్వాలు, యాజమాన్యాలు కార్మికవర్గంపై సాగించే దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ప్రతినిధుల సభ

అనంతరం రాష్ట్ర జూట్ సమన్వయ కమిటీ సభ్యులు కామ్రేడ్స్ కె. పోలారి, ఎం. గోపాలం, ఎం. వెంకటేశ్వర్లు అధ్యక్షవర్గంగా ప్రతినిధుల మహాసభ జరిగింది. జూట్ రంగంపై ఆలిండియా కమిటీ విడుదల చేసిన "విధాన ప్రకటన"ను పి. ప్రసాద్ వివరించగా ప్రతినిధులు దీనిపై చర్చించారు. పలు సూచనలు, సలహాలు యిచ్చారు. అనంతరం సభ "విధాన ప్రకటనను" ఆమోదించింది.

"ప్రస్తుతం జూట్ కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలు - చేపట్టవలసిన కర్తవ్యాలు" అనే నివేదికను కె. పోలారి ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతినిధులు వివరంగా చర్చించారు. అనేక సలహాలు, సూచనలు యిచ్చారు. ఆ నివేదికలో పొందుపర్చవలసిన అంశాలను మరికొన్నింటిని తెలియజేశారు. చర్చల అనంతరం మహాసభ ఈ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది.

నూతన కార్యవర్గం

అనంతరం మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నది. రాష్ట్ర అధ్యక్షులుగా పి. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా యు. వెంకటేశ్వరరావు (యు.వి.), ప్రధాన కార్యదర్శిగా కె. పోలారి, సహాయ కార్యదర్శిగా ఎం. క్రాంతి, కోశాధికారిగా ఎం. గోపాలంతోపాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. భవిష్యత్తు అవసరాల రీత్యా మరో రెండు కోఆప్షన్ కూడా మహాసభ అవకాశం యిచ్చింది.

అమరవీరుల కుటుంబాల పరిచయం

నెల్లిమర్ల అమరవీరులు కాళ్ళ అప్పల సత్యనారాయణ, నల్లిముత్యాల నాయుడు, దువ్వారపు చిన్న, కోల అచ్చప్పడు, కల్లూరి రాంబాబు కుటుంబ సభ్యులను మహాసభ ప్రతినిధులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా పి. ప్రసాద్ మాట్లాడుతూ 1994 జనవరి 29 నాటి ఘటనలను వివరించారు. గద్గద స్వరంతో ప్రసాద్ ఆనాటి ఘట్టాలను వివరించినప్పుడు ప్రతినిధులు కన్నీరు తుడుచుకున్నారు "ఒత్తుకుంటూంకంటతడిని - ఎత్తుకుంటాం ఎర్రజెండాను" అంటూ నినదించారు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. వారి ఆశయాలను సాధిస్తామంటూ ప్రతిన బూనారు.

ఆలరించిన అరుణోదయ కళారూపాలు

మహాసభ ప్రారంభం నుండి ముగింపు వరకూ అరుణోదయ కళాకారులు విప్లవగేయాలు ఆలపిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు యిస్తూ సభికులను ఆలరించారు. వివిధ పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ రామారావు నేతృత్వంలో కళాకారులు కె. నిర్మల, దుర్గ, సుజాత, వెంకటలక్ష్మి, పావని, పెంటయ్య తదితరులు అనేక కళారూపాలు ప్రదర్శించారు.

తీర్మానాలు

చివరిలో మహాసభ పలు తీర్మానాలు ఆమోదించింది. 1) రాష్ట్రంలో జూట్ కార్మికుల వేతనాలకు సంబంధించి ప్రభుత్వం వేజ్ బోర్డు ఏర్పాటు చెయ్యాలనీ, 2) సింథటిక్, పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించాలనీ, 3) హుగ్లీ కార్మికులను బదిలీ వేతన ఒప్పందం వెంటనే చేయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలనీ 4) నెల్లిమర్ల మిల్లులోని సమస్యలు పరిష్కరించాలనీ, 5) గోగునార రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనీ 6) అధిక ధరలను అరికట్టాలనీ, 7) శ్రీకాకుళం జిల్లాలోని మిల్లుల్లో సమస్యలు పరిష్కరించాలనీ తీర్మానించారు.

(1వ పేజీ తరువాయి)

తన ప్రాపంచిక దృక్పథమేమిటో చిరంజీవి యింత వరకూ ప్రకటించలేదు. తద్వారా, వునికిలో వున్న భూస్వాముల, పెట్టుబడిదారుల పార్టీల దృక్పథమే తన దృక్పథమని ప్రకటించిన వాడయ్యాడు. విదేశీ సామ్రాజ్యవాదుల ఆధిపత్య, దోపిడి విధానాలకు తన వ్యతిరేకతను అతడు ప్రకటించలేదు. కోకోకోలాకు చిరంజీవి, పెప్సీకోలాకు పవన్ కళ్యాణ్ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించి బహుళజాతి కంపెనీలకు తమ అనుకూలతను బయటపెట్టుకున్నారు. దేశంలో అమలు జరుగుతున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల పట్ల చిరంజీవి తన వ్యతిరేకతను వ్యక్తం చేయలేదు. భూసంస్కరణల అమలు పట్ల, సెజుల పట్ల, వ్యవసాయరంగ దుస్థితి పట్ల అతడు యింత వరకు నోరెత్తలేదు. ఠాగూర్ సినిమాలో 'అవినీతికి వ్యతిరేక పోరాట యోధుడిగా పేరు తెచ్చుకున్నాడు కనుక, చిరంజీవి అవినీతిని సహించడు' అని ప్రచారాన్ని అతడి అనుచరులు సాగిస్తున్నారు. అవినీతిని నిరోధించటానికి అతడు యెలాంటి విధానాన్ని అనుసరించేదీ యెవరూ చెప్పటం లేదు. ప్రజల అమాయకత్వాన్ని, వెనుకబాటు తనాన్ని వుపయోగించుకొని వారిలో భ్రమలు కల్పించి లబ్ధి పొందాలనేది లక్ష్యంగా కన్పిస్తున్నది.

వివిధ పార్టీలలో పదవులు దొరకని, ప్రాముఖ్యత లభించని, భవిష్యత్తు వుండదని భావించిన రాజకీయ నాయకులు పెద్ద యెత్తున యింతా పేరు కూడా ప్రకటించని చిరంజీవి పార్టీలోకి వలసలు పోతున్నారు. స్వంత బలం లేని వారు చిరంజీవికి గల పేరుతో ఎన్నికలు గెలవవచ్చునని, పదవులు పొందవచ్చునని భావించి పోతున్నారు. కొందరు కొత్త వారు ముందుకు వస్తున్నప్పటికీ కాలం తీరిన, ప్రతిష్ఠ వుడిగిన పాత నాయకులే చిరంజీవి పార్టీలో ప్రధాన స్థానాలు ఆక్రమించే సూచనలు కన్పిస్తున్నాయి. చిరంజీవి, అతడి అనుచరులు ఏ ఒక్క వివాదాంశం మీద తమ వైఖరులను స్పష్టం చేయకుండా గోడ మీద పిల్లుల్లా అవకాశవాద వైఖరులను చేపడుతున్నారు. ప్రత్యేక తెలంగాణా విషయంలో కానీ, ప్రపంచ వాణిజ్య సంస్థలో చర్చల విషయంలో కానీ, భారత్-అమెరికా అణు వప్పందం విషయంలో కానీ, సెజుల బాధిత నిర్వాసితుల విషయంలో కానీ, ధరల పెరుగుదల విషయంలో కానీ చిరంజీవి బృందం తమ వైఖరిని స్పష్టం చేయక పోవటం వింతల్లోకెల్లా వింత.

ఎన్నికల నాటికి రాష్ట్రంలో, దేశంలో రాజకీయ సమీకరణాలెలా వుంటాయి? రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో చిరంజీవి పార్టీ మెజారిటీ సంపాదించి, చిరంజీవి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠిస్తాడా? లేక ఎవరికీ మెజారిటీ రాని పరిస్థితుల్లో తాను గెలుచుకునే మైనారిటీ స్థానాలతో చక్రం తిప్పతాడా? లేక నామమాత్రపు ప్రదర్శన చేసి ఆశాభంగం చెందుతాడా! చూడవలసిందే. అయితే, పుట్టబోయే చిరంజీవి పార్టీ భౌతిక వాస్తవాల రీత్యా రాష్ట్ర రాజకీయరంగంలో కానీ, రాష్ట్ర ప్రజానీకం జీవితాల్లో కానీ యెలాంటి గుణాత్మకమైన మార్పును తీసుకురాజాలదు. అది 'కొత్త సీసాలో పాత సారా' గానే మిగిలిపోతుందనటంలో సందేహం లేదు.

విద్యారంగం మీద రాష్ట్ర ప్రభుత్వ తాజా దాడి

(గత సంచిక తరువాయి)

సీబీయస్ఇ సిలబస్:

జీవో 76 ద్వారా ప్రభుత్వం సక్సెస్ పథకం కొరకు ఎంపిక చేసిన 6,500 ఉన్నత పాఠశాలలలో ఆంగ్లమాధ్యమంతోపాటు సీబీయస్ఇ సిలబస్‌ను కూడా ప్రవేశపెడుతుంది. ముందుగా చెప్పినట్లు అత్యధిక ప్రజా సంఘాలు ఈ చర్యను వ్యతిరేకిస్తున్నాయి. సీబీయస్ఇ సిలబస్‌ను వ్యతిరేకించేవారు అనేక రకాల వాదనలను ముందుకు తీసుకువస్తున్నారు. కేంద్ర సిలబస్ కంటే రాష్ట్ర సిలబస్‌లో చదివిన వారే అధికంగా ఐ.టి.ఐ లలో, ఐ.ఎ.ఎస్‌లలో ఎంపిక అవుతున్నారనేది ఒక వాదన. అది వాస్తవం కావచ్చు. కాని ఐ.టి.ఐలకు, ఐ.ఎ.ఎస్‌లకు సెలక్ట్ కావడం విద్యా విధానం పరమావధి కాజాలదు. సీబీయస్ఇ సిలబస్‌ను వ్యతిరేకించడానికి ఈ కారణాన్ని ఆశ్రయించరాదు. ఇక సీబీఎస్ఇ సిలబస్‌ను వ్యతిరేకించేవారు సీబీఎస్ఇ సిలబస్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భారంగా ఉంటుందనే కారణాన్ని ముందుకు పెడుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక ప్రైవేట్ పాఠశాలలలో సీబీయస్ఇ సిలబస్ బోధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలలో బోధించే టీచర్ల కంటే ప్రభుత్వ పాఠశాలలలో బోధించే టీచర్లు తక్కువ విద్యార్హతలు కలవారు కాదు. తగినంత సాధన (ప్రాక్టీస్) లేక ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఇ సిలబస్ ప్రారంభంలో కష్టం అనిపించవచ్చు. ఒక సంవత్సరం సాధన చేసిన తరువాత రెండవ సంవత్సరానికి ఉపాధ్యాయులకు సులభం అవుతుంది. అయితే విద్యార్థుల సమస్య వేరు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు వెనుకబడిన ఆర్థిక, సామాజిక, విద్యా విషయక నేపధ్యం నుంచి వస్తున్నారు. వారికి ఇంటిలో హోం వర్క్ చేయించే వారుండరు. వారికి సీబీఎస్ఇ సిలబస్, ఆంగ్ల మాధ్యమం రెండూ కష్టం కావచ్చు. ఏదేమైనా ఉపాధ్యాయులకు కష్టం అన్న వాదనపై సీబీఎస్ఇ సిలబస్‌ను ఆహ్వానించేవారు చెప్తుతున్న కారణాలు వేరు. ప్రస్తుత సీబీఎస్ఇ సిలబస్ శాస్త్రీయంగా ఉందని, ప్రజాస్వామికయుతంగా ఉందని వారు చెప్తున్నారు. ఆ విషయం వాస్తవం కావచ్చు. అయితే సీబీఎస్ఇ సిలబస్‌ను, రాష్ట్ర సిలబస్‌ను తులనాత్మకంగా పరిశీలించిన ప్రచురణలు యింత వరకు ఏమీ లేవు. వాదన కొరకు ప్రస్తుత సీబీఎస్ఇ సిలబస్ రాష్ట్ర సిలబస్ కంటే శాస్త్రీయుతలోనూ, ప్రజాస్వామిక లక్షణాలలోనూ మెరుగైనదని భావించినా అందు కొరకు రాష్ట్ర సిలబస్‌ను తొలగించి సీబీఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టనవసరం లేదు. సీబీఎస్ఇ సిలబస్‌లో ఉన్న మెరుగైన అంశాలతో రాష్ట్ర సిలబస్‌ను అభివృద్ధి చేసి అమలు చేసుకోవచ్చు. అందుకే సీబీఎస్ఇ సిలబస్ ఎడల అనుకూలతలు, వ్యతిరేకతలు వ్యక్తం చేస్తున్న యిటువంటి ద్వితీయ కారణాలను ప్రక్కన పెట్టి మనం మౌలిక విషయాలను పరిశీలించాలి.

భారతదేశంలో వివిధ రాష్ట్రాలు తమ రాష్ట్ర సిలబస్ స్థానంలో సీబీఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టడం సబబా, కాదా అన్నది భారత దేశ సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలో ఉంది. భారతదేశం బి.జె.పి. వాళ్ళు చెప్పినట్లు ఏకశిలా సదృశమైన సాంస్కృతిక వ్యవస్థనా లేక బహుళజాతుల సమ్మిశ్రమైన వ్యవస్థనా అన్నది ప్రధానమైన సమస్య. సరే సంస్కరణల అనంతర కాలంలో విద్యారంగానికి వచ్చేసరికి బి.జె.పి హిందీ, హిందూ, హిందూస్థాన్ అనే నినాదం ఇంగ్లీషు, కార్పొరేటు యాజమాన్యం, సీబీఎస్ఇ సిలబస్‌గా మారిపోయింది. ఆ విషయం ప్రక్కన పెడితే, భారతదేశాన్ని బహుళజాతుల సమాఖ్యగా అంగీకరిస్తే ప్రతి జాతికి తన విద్యా విధానాన్ని రూపొందించుకునే హక్కు ఉండాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాలేర్పడినందున విద్యా విధానాన్ని రూపొందించుకునే హక్కు ఆయా రాష్ట్రాలకే ఉండాలి. యిప్పుడు సీబీఎస్ఇ సిలబస్ శాస్త్రీయంగానూ, ప్రజాస్వామికంగానూ ఉండవచ్చు. కాని 2009 ఎన్నికలలో బి.జె.పి కూటమి అధికారానికి వస్తే వారు గుజరాత్ సిలబస్‌నే సీబీఎస్ఇ సిలబస్‌గా ప్రకటిస్తారనడంలో సందేహం లేదు. ఎన్.డి.ఏ ప్రభుత్వ కాలంలో ఎన్.సి.ఇ.ఆర్.టి రూపొందించిన పాఠ్య ప్రణాళిక చట్టం ఎంత ఫాసిస్ట్‌గా ఉండిందో మనం మరువరాదు. ప్రస్తుతం సీబీఎస్ఇ సిలబస్ బాగుందని దానిని స్వీకరిస్తే తరువాత దాని నుండి బయట పడడం అంత సులభం కాదు. అందుకే విద్యావిధానాన్ని, రాష్ట్ర సిలబస్‌ను రూపొందించుకునే చొరవ, స్వేచ్ఛలు రాష్ట్ర ప్రజల, ప్రభుత్వాల చేతులలోనే ఉండాలి. ఒకే సంస్కృతి రూపంలో ముందుకు వస్తున్న ఫాసిస్టు ప్రమాదం ఎడల కమ్యూనిస్టులు, మైనారిటీలు, దళితులు, స్త్రీలు అప్రమత్తంగా ఉండాలి. నిజానికి ప్రాంతీయ సంస్కృతి గురించి మాట్లాడుతున్న వారు సీబీఎస్ఇ సిలబస్ విషయంలో మౌనంగా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఒకే రాష్ట్రంగా కొనసాగినా, రెండు రాష్ట్రాలుగా విడిపోయినా విద్యా విధానాన్ని రూపొందించుకునే హక్కు, చొరవ రాష్ట్రం చేతిలోనే ఉండడం అవసరం. ప్రాంతీయ సంస్కృతులకు వ్యక్తీకరణఅప్పుడు మాత్రమే లభ్యం అవుతుంది. ఒక వైపు ఫాసిస్టు ప్రమాదం, మరొకవైపు గ్లోబల్ ప్రమాదం పొంచివున్న నేటి పరిస్థితులలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు కేంద్రీకృత విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలి. సీబీఎస్ఇ సిలబస్‌ను సమర్థిస్తున్నవారు తాము అంతిమంగా కాషాయ మరియు గ్లోబల్ సంస్కృతులకు మార్గం వేస్తున్నామన్న విషయం గ్రహించాలి.

పైన చర్చించిన పద్ధతిలో మౌలిక విషయాలపై ఆధారపడి సీబీఎస్ఇ సిలబస్‌ను వ్యతిరేకించాల్సిన అవసరాన్ని అంగీకరిస్తే కేంద్ర నిధుల వంటి విషయాలు అంత పెద్దవేమీ కావు. సీబీఎస్ఇ సిలబస్‌ను ఆమోదిస్తేనే కేంద్రం నిధులిస్తుందనే వాదన అంత బలమైనదేమి కాదు. రాష్ట్ర సిలబస్‌ను అమలుచేస్తూ సక్సెస్ పథకం క్రింద నిధులు సంపాదించడానికి అవకాశాలుంటాయి. ఆ మాట అలా వుంచినా కేంద్రం యివ్వజూపే నిధుల కొరకు రాష్ట్ర సిలబస్‌ను తొలగించి కేంద్ర సిలబస్‌ను ప్రవేశ పెట్టడం సరియైనది కాదు. అసలు కేంద్రం యిటువంటి నిబంధనలను పెట్టడం ఆధిపత్య ధోరణిని సూచిస్తుంది. నిధులు ఇవ్వడం కేంద్రం బాధ్యత. విద్యావిధానాన్ని రూపొందించుకోవడం రాష్ట్ర ప్రజల హక్కు. నిధులు కేటాయించిన వారే విధానాలు నిర్దేశించాలనేది ప్రజాస్వామిక సంస్కృతి కాదు. నిధులు కేంద్రం యివ్వాలి. రాష్ట్ర అవసరాలకు, రాష్ట్ర సంస్కృతికి, రాష్ట్ర చరిత్రకు, రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా విద్యా విధానాలు, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకునే హక్కు రాష్ట్రాలకుండాలి. ఆధిపత్య సంస్కృతికి అలవాటు పడడం ప్రజలకు, దేశానికి మంచిది కాదు.

మూసివేతలు:

జీవో నెం. 76లో ప్రజల దృష్టిలో అత్యంత ప్రధానమైన సమస్య పాఠశాలల నిర్లక్ష్యం, కుదింపు, మూసివేతలు. ఈ జీవో ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 9,155 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 6,500 ఉన్నత పాఠశాలలనే 'సక్సెస్' పథకంలో చేర్చింది. మిగిలిన 2655 ఉన్నత పాఠశాలలను నిర్లక్ష్యం చేసింది. ఈ మిగిలిన పాఠశాలల నుంచి రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయులను, వనరులను 'సక్సెస్' పాఠశాలలకు తరలించినా ఆశ్చర్య పోనవసరం లేదు. మిగిలిన పాఠశాలలను వాటి సహజ మరణానికి విడిచి పెట్టవచ్చు. లేదా యింకా చెప్పాలంటే వాటి త్వరితగతి మరణానికి పరిస్థితులను కల్పించవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వం ఈ 2655 ఉన్నత పాఠశాలలను

రమేశ్ పట్నాయక్

ఫెయిల్యూర్ పాఠశాలలుగా మార్చివేసి మూసి వేయనుంది. లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలను మూసివేస్తే ఆ బాలికల విద్యా హక్కు మాటేమిటి. 'సక్సెస్' పథకంలో అన్ని అంశాలతో అంగీకారం లేకున్నా ఈ మిగిలిన పాఠశాలలను కూడా 'సక్సెస్' పథకంలో చేర్చాలని డిమాండ్ చేయాల్సిన స్థితికి విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాన్ని ప్రభుత్వం నెట్టివేసింది.

జీవో నెం. 76 ద్వారా ప్రాథమికోన్నత పాఠశాలల మీద పెద్ద ఎత్తున దాడి జరుగుతుంది. 12,515 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలలో 4,090 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా కుదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పాఠశాలలలో ఉన్న 6, 7 తరగతులను దగ్గరలోవున్న 'సక్సెస్' ఉన్నత పాఠశాలలలో విలీనం చేస్తామని ప్రభుత్వం చెప్తుంది. సదరు ప్రాథమికోన్నత పాఠశాలలలో నున్న 6, 7 తరగతుల విద్యార్థులను, ఆ తరగతుల కొరకు నియమించిన ఉపాధ్యాయులను దగ్గరలో ఉన్న 'సక్సెస్' పాఠశాలలకు పంపిస్తున్నారు. ఉపాధ్యాయులను తరలించడం అయితే రూఢిగా జరుగుతుంది. దీని ఫలితంగా సదరు పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 100 కంటే తగ్గిపోతే ఉపాధ్యాయుల సంఖ్య రెండుకు పరిమితమవుతుంది. ఫలితంగా విద్యా ప్రమాణాలు మరింతగా పడిపోతాయి. 'సక్సెస్' పాఠశాలలు విజయవంతమవుతాయో లేదోగాని, 6, 7 తరగతులు రద్దు చేయబడిన పాఠశాలలు మాత్రం విఫలమవుతాయి. అదలా ఉండగా ఉపాధ్యాయులను తరలించినంత సులభంగా విద్యార్థులను తరలించలేము. కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులు వారికి అడ్డు వస్తాయి. గ్రామంలో పాఠశాల ఉన్నప్పుడు చదువుకున్న అమ్మాయిలందరూ పొరుగూరికి వెళ్ళవలసి వస్తే వెళ్ళరు. ఈ పాఠశాలలకు వచ్చే బాలబాలికలలో అత్యధికులు పాఠశాల తరువాత గృహనిర్వహణపనులలోనూ, తల్లిదండ్రుల వృత్తి పనులలోనూ పాలుపంచుకుంటారు. పాఠశాల వేరే ఊరిలో ఉన్నప్పుడు అలా సాధ్యం కాదు. ఆ కారణంగా బడిమానివేసే వారు ఉంటారు. యింకా 'సక్సెస్' పాఠశాలలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటిని విచక్షణా రహితంగా కుదించడం వలన రోడ్లు, వాహన సదుపాయం లేక రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న 'సక్సెస్' పాఠశాలలకు పోలేక చాలా మంది బాలబాలికలు చదువు మానివేస్తారు. ఈ విధంగా బాలబాలికల విలీనం ఆచరణలో సాధ్యం కాదు. కనీసం 50 శాతం మంది బాలబాలికలు చదువు మానివేసే ప్రమాదం ఉంది. ఒక లెక్క ప్రకారం వీరు సుమారు ఒక లక్ష మంది ఉండవచ్చు. అందుకే వీటిని విలీనాలు అనడం కంటే మూసివేతలు అనడమే సరిగా ఉంటుంది. ప్రగతిశీల విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలు ఈ విలీనాలను వ్యతిరేకించాలి. బలమైన ఉద్యమంతో నిలువరించాలి. భాషా సమస్య కంటే, సీబీఎస్ఇ సిలబస్ సమస్య కంటే ఈ సమస్య మీద ప్రజలు పెద్ద ఎత్తున కదిలే అవకాశం ఉంది. ఉద్యమాలలోనికి వచ్చిన ప్రజలు ఆలోచిస్తారు. ఆలోచించిన ప్రజలు మాతృభాషను ప్రేమిస్తారు. సాంస్కృతిక దాడులను నిరశిస్తారు. అందుకే ఉద్యమం మూసివేతలకు వ్యతిరేకంగా ప్రారంభం కావాలి. అసలు ఈ 4,090 ప్రాథమికోన్నత పాఠశాలలలో సహా మొత్తం 12,515 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని విద్యాపరిరక్షణఉద్యమం చేస్తున్న డిమాండ్‌ను ఈ ప్రభుత్వం పెడచెవిని పెడుతున్నది. బాలబాలికలు లేరు లేదా తక్కువుగా ఉన్నారన్న సమస్య ప్రధానంగా ప్రతి సంవత్సరం సుమారు నాలుగైదు లక్షల మంది బాలబాలికలు మధ్యలో బడిమానివేయవలసి వస్తుంది. ఈ డ్రాప్-అవుట్ సమస్యను వెంటనే పరిష్కరించడానికి బదులు ప్రభుత్వం తాను నిర్మించబోయే గ్లోబల్ నాగరికతకు పొరుగున చెత్త కాగితాలను ఏరుకొనే పిల్లలను తయారుచేస్తుంది. అసమానతలపై నాగరికతను నిర్మించ బూనుకుంటే ఫలితాలు అలాగే ఉంటాయి. ఇవన్నీ యిలా ఉండగా ప్రభుత్వం నిర్వహించబోయే 'సక్సెస్' పాఠశాలలకు ఏ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుండి బాలబాలికలు రాబోతున్నారో ఆ పాఠశాలలు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం తేర్చిదిద్దిన 'సక్సెస్' పథకంలోగాని, రాష్ట్ర ప్రభుత్వం ఏరికోరి విడుదల చేసిన జీవో నెం.76లో గాని వాటి ప్రస్తావన లేదు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో గుణాత్మక విద్య అందాలంటే ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు కనీసంగా అవసరమని విద్యా పరిరక్షణఉద్యమం చేస్తున్న డిమాండ్లను సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం ఆ దిశలో ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్రాథమిక పాఠశాలలలో కనీస అధ్యయన పరిస్థితుల కల్పన కొరకు ఉద్యమించడం రాష్ట్రంలో విద్యార్థులకు, యువకులకు, ఉపాధ్యాయులకు, మేధావులకు ప్రధాన విషయం కావచ్చు. అటువంటి ఉద్యమం జరిగినప్పుడు ప్రభుత్వ బండారం బయట పడుతుంది. 'సక్సెస్' పథకం డొల్లతనం బహిర్గతమవుతుంది. ప్రభుత్వం, పాలకవర్గ శక్తులు, వారి తైనాతీలు డిఫెన్స్‌లో పడతారు. ప్రగతిశీల ఉద్యమ శక్తులు తమ భావాలను ప్రజల గొంతుకులతో వినిపించగలగాలి.

డ్రాప్-అవుట్ సమస్య:

కేంద్రం యొక్క 'సక్సెస్' పథకంగాని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 76 గాని ఈ సమస్యను పట్టించుకోలేదు. బడి బయట ఉన్న వారంతా బాల కార్మికులే అని మనం అంగీకరిస్తే రాష్ట్రంలో 27 లక్షల 27 వేల మంది బాలబాలికలు బడి బయట ఉన్నారు. వీరికి పునరావాసము, ప్రత్యేకంగా గ్రేడు చేయబడిన సిలబస్‌తో విద్య అవసరం. వీరి కొరకు కనీసం 3 వేల రెసిడెన్షియల్ పాఠశాలలవసరం. అదలా ఉండగా ప్రతి సంవత్సరం 4 లేక 5 లక్షల మంది మధ్యలో బడిమానివేసి కొత్తగా బాలకార్మికులవుతున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. మధ్యలో బడిమాని వేయడానికి ప్రధాన కారణం కుటుంబ పేదరికమే. అయితే కుటుంబ పేదరికాన్ని పరిష్కరించే వరకు ఈ సమస్య పరిష్కారానికి ఏమీ చేయలేమని కాదు. బాలబాలికల విద్యకు కుటుంబ పేదరికం అడ్డు రాకుండా పాఠశాల ద్వారా వారికి గుణాత్మక విద్యతోపాటు పౌష్టికాహారం, వస్త్రాలు, వైద్యం, వ్యాయామ క్రీడలు అన్ని అవసరాలు తీర్చి ఆరోగ్యకరమైన, సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దవచ్చు. ఈ విషయాల ఎడల ప్రభుత్వానికి శ్రద్ధలేదు. కాగా ఈ డిమాండ్లు యింకా ఉద్యమ రూపాన్ని తీసుకోవలసి ఉంది.

ముగింపు:

జీవో నెం.76, ముందుగా మనం చర్చించినట్లు భాషా సమస్య, సీబీఎస్ఇ సమస్యతోపాటు ప్రాథమికొన్నత పాఠశాలల కుదింపు సమస్యను, మూసివేతల సమస్యను తీసుకు వచ్చింది. 'సక్సెస్' పథకం క్రింద చేపట్టిన పాఠశాలలలో ఎంత అవినీతి పొంచి ఉందో యింకా మనకు తెలియదు. ఏదేమైనా వివిధ జిల్లాలలో ప్రజలు, స్థానికంగా పనిచేస్తున్న ప్రజాస్వామిక శక్తులు ఈ మూసివేతలను అడ్డుకుంటున్నాయి. యిది శుభ సూచకం. ప్రగతిశీల శక్తులు రాష్ట్ర వ్యాపితంగా ప్రజల చొరవను వొందుకు తీసుకువెళ్ళాలి. ఈ సందర్భంలో మూసివేతలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం అవసరమని అందర్మూ అంగీకరిస్తారు. సాధ్యమని కూడా అనిపిస్తుంది.

(అయి పోయింది)

ముగాబే సారథ్యాన జింబాబ్వేలో పురోగమిస్తున్న జాతీయ చైతన్యం

"మా ఆఫ్రికాను దురాక్రమించి, మా సంపదలను కొల్లగొట్టి, మా నీగ్రో జాతీయులను సంతల్లో సరుకులవలె విక్రయించి, పశువుల్లా పనిచేయించుకున్న శ్వేత సామ్రాజ్యాలకు మా దేశాల ప్రజాస్వామ్యం గూర్చి నీతులు బోధించే హక్కు లేదు. రెండు శతాబ్దాలకు పైగా నీగ్రో బానిసత్వ పునాదులపై అనాగరిక, ఆటవిక రాజ్యాలను స్థాపించిన అమెరికా, యూరప్‌లకు మా ఆఫ్రికా దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునే అధికారం లేదు. నేటికీ ఆర్థిక, ఆంక్షల పేరిట మా దేశ ప్రజలను ఆకలి మంటలకు గురిచేస్తూ, కృత్రిమ కరువుకాటకాలనూ, సంక్షోభాలనూ సృష్టిస్తున్న పాశ్చాత్య సంపన్న రాజ్యాలు మా ప్రజల సంక్షేమం, శ్రేయస్సు గూర్చి మొసలి కన్నీళ్ళు కారుస్తున్నాయి. వారి చెప్పు చేతుల్లో వున్న ప్రచార సాధనాలు మమ్మల్నీ, మా స్వాతంత్ర్యాన్నీ, మా జాతి ఆత్మాభిమానాన్నీ అవమాన పరుస్తూ వికృత ప్రచారం చేస్తున్నాయి. అయినా మా ఆఫ్రికా ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని వదులుకోరని స్పష్టం చేస్తున్నాం. మూడో ప్రపంచ దేశాలు మా పక్షాన నిలబడి, ఆపద కాలంలో మాకు ఆత్మ విశ్వాసాన్నిస్తాయని ఆశిస్తున్నాం".

పై వ్యాఖ్యలు చేసిందెవరో కాదు. నేడు ప్రపంచమంతటా మీడియాలో ప్రతిరోజూ 'పరమనియంత'గా, నరహంతక పాలకుడిగా పేరొందిన రాబర్ట్ ముగాబే వ్యాఖ్యలివి. ఒకవైపు పొద్దున్నే లేవగానే పత్రికల్లో, ఛానళ్ళలో నేడు ముగాబే వ్యతిరేక ప్రచారం భారీస్థాయిలో సాగుతున్నది. మరోవైపు అదే ముగాబే మూడో ప్రపంచ దేశాల ఆత్మ గౌరవ ప్రతీకగా పై వ్యాఖ్యలు చేశాడు. ఇందులో ఏది నిజం?

మన భారతీయుల వలనే జింబాబ్వే ప్రజలు కూడా రెండు శతాబ్దాల వలస బానిసత్వంలో మగ్గిపోయారు. ఇంకా చెప్పాలంటే మనకంటే అదనంగా మరో అనాగరిక దోపిడీకి కూడా గురయ్యారు. అదే నీగ్రో బానిసల వ్యాపారం! ఆసియా దేశాల కంటే కొంత ఆలస్యంగా ఆఫ్రికా దేశాల ప్రజలు కూడా స్వాతంత్ర్య పోరాటాలు చేశారు. ఉత్తరాఫ్రికాకు చెందిన అల్జీరియా, లిబియా, ఈజిప్టు దేశాల ప్రజలు దాదాపు ఆసియా దేశాల ప్రజలతో సమకాలికంగా స్వాతంత్ర్య పోరాటాలు చేశారు. వారిని కొద్ది కాలంలోనే పశ్చిమాఫ్రికా దేశాల ప్రజలు అనుసరించారు. ఆలస్యంగా తూర్పు, మధ్య, దక్షిణాఫ్రికా దేశాల ప్రజలు కూడా అనుసరించారు. ఇలా ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలలో జింబాబ్వే ఒకటి!

ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్యోద్యమాలకు నాయకత్వం వహించి పేరొందిన నాయకులు చాలా మంది వున్నారు. అందులో ముగాబే ఒకరు. కెన్నెత్ కౌండా (జాంబియా), శ్యామ్ నుజోమా (నమీబియా), జూలియస్ నైరేరీ (టాంజానియా) లుముంబా (కాంగో) ఎన్‌కోమా (రొడీషియా), జోమో కెన్యట్టా (కెన్యా) క్వామే ఎన్ క్రూమా (ఘనా) కబాకా (ఉగాండా) వంటి కొద్ది మంది పేరొందిన ఆఫ్రికా జాతీయోద్యమ నేతల్లో ముగాబే ఒకరు! శ్వేత వలస పాలనకు వ్యతిరేకంగా 1950 నుంచే ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా ముగాబే వుద్యమాలు సాగించాడు. అనంతరం స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించాడు. అనేక నిర్బంధాలకు గురయ్యాడు. తుదకి గెరిల్లా పోరాటాన్ని నిర్మించాడు. 1980లో స్వాతంత్ర్యాన్ని పొందే నాటికి 25 వేల అజ్ఞాత గెరిల్లా సైన్యానికి సారథ్యం వహించాడు.

జింబాబ్వేలో 1950 నాటికి సుమారు 40 లక్షల జనాభా వుండేది. అందులో రెండున్నర లక్షల మంది ఇంగ్లీషు దొరలుండేవాళ్ళు. ఈ మైనార్టీ శ్వేత జాతీయుల చేతుల్లో మెజార్టీ సారవంతమైన భూములున్నాయి. వీరే రెండు శతాబ్దాలపాటు జింబాబ్వే ప్రజలను జలగల్లా పీల్చి తెగ బలిసారు. ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో ఆధిపత్య స్థానం పొందారు. ఇంగ్లీషు సామ్రాజ్యానికి సాంఘిక, రాజకీయ పునాది వర్గంగా వీరు పనిచేశారు. 1980లో వలసపాలన అంతమయ్యాక వారి రాజకీయ ఆధిపత్యం కూలిపోయింది. అయితే శ్వేత జమీందార్లకూ, ల్యాండ్ ఎస్టేట్లకూ పరిమిత అనుమతులను కొత్త జాతీయ ప్రభుత్వం అనుమతించింది. చాలా సం॥రాలు సాఫీగానే జరిగిపోయింది. కానీ తిరిగి 1990 తర్వాత జింబాబ్వేకు కష్టకాలం వచ్చింది. సోవియట్ యూనియన్ పతనం - ప్రచ్ఛన్న శకం ముగియడం - సరళీకరణశకం తలెత్తడం - నూతన ప్రపంచ క్రమం తదితర పరిణామాలు జింబాబ్వేకు నయావలస ప్రమాదాన్ని తెచ్చాయి. తిరిగి ముగాబే ప్రభుత్వాన్ని అగ్ని పరీక్షకు గురిచేశాయి.

1980లో స్వాతంత్ర్యం పొందాక తెల్లజాతీయుల ఉత్పత్తి సాధనాలను ముగాబే ప్రభుత్వం నియంత్రించింది. కొన్ని కీలక రంగాల ఉత్పత్తి సాధనాలను స్వాధీనం చేసుకొని జాతీయం చేసింది. మరికొన్ని మధ్యస్థాయి వాటిని స్వాధీనం చేసుకోక పోయినా, కంట్రోళ్ళ కిందికి తెచ్చింది. చిన్న తరహా ఉత్పత్తి సాధనాల జోలికి వెళ్ళలేదు. గ్రామీణతెల్ల జమీందారీ భూముల మీద కూడా ఇలాంటి విచక్షణతో కూడిన నియంత్రణనే కొనసాగించింది. తొలుత ఈ నియంత్రణవిధానం బాగానే సాగింది. కానీ ప్రపంచీకరణ, సరళీకరణవిధానాలు రావడంతో జింబాబ్వే పరిస్థితుల్లో కూడా మార్పులొచ్చాయి. అంతకు ముందు హరారే ప్రభుత్వ కంట్రోళ్ళ రాజ్య నియంత్రణకి తలవంచిన ఇంగ్లీషు జమీందారీ, కులక్ వర్గాలు తిరిగి అవిధేయతతో తలెత్తసాగాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అదనపు శిస్తులను చెల్లించ లేదు. పైగా వారి భారీ ల్యాండ్ ఎస్టేట్లను తమ స్వంత వనరులుగా భావించ సాగాయి. ఈ నేపధ్యంలోనే 1990వ శతాబ్దంలో జింబాబ్వే మరోసారి తీవ్ర అశాంతికి గురైనది. ముగాబే ప్రభుత్వం శ్వేత భూస్వామ్య, జమీందారీ వర్గాలపై విరుచుక పడింది. పెద్ద ఎత్తున పీడిత రైతాంగాన్ని సమీకరించింది. దానితో కొత్తగా తలెత్తబోయిన తెల్లజాతి భూస్వామ్య వర్గాలు తోక జాడించాయి. అదొక దశ.

ఈ సందర్భంగా ఒక చారిత్రిక విషయాన్ని గుర్తు చేసుకోవాలి. జింబాబ్వే కంటే ముందు తెల్లజాతి వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా దేశాలు మూడు మార్గాలుగా విడిపోయాయి. అంగోలా, మొజాంబిక్ వంటి కొన్ని దేశాలు సోవియట్ సోషల్

ఏ.ప్రసాదు

సామ్రాజ్యవాదుల మీద ఆధారపడ సాగాయి. ఈజిప్టు అల్జీరియా, కాంగో, జైరే వంటి మరికొన్ని దేశాలు తిరిగి అమెరికా నాయకత్వంలోని పాశ్చాత్య సామ్రాజ్యవాద శిబిరం మీద ఆధారపడసాగాయి. ఈ రెండు అగ్రరాజ్యాలలో చేరకుండా మరికొన్ని స్వతంత్ర్య దేశాలున్నాయి. వాటిలో జింబాబ్వే ఒకటి! ఇది ప్రచ్ఛన్న యుద్ధకాల దశలోని ఆఫ్రికా దేశాల పరిస్థితి!

ప్రచ్ఛన్న యుద్ధకాలం ముగిసింది. ఏకధ్రువ ప్రపంచం ఏర్పడింది. ఆఫ్రికా పరిస్థితిలో మరో ముఖ్యమైన మార్పు వచ్చింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఏ అగ్రరాజ్య శిబిరంలో చేరకుండా నిలబడ్డ లిబియా, టాంజానియా, సూడాన్, జింబాబ్వే వంటి స్వతంత్ర దేశాలకు ఏకధృవ ప్రపంచంలో ప్రమాదం ఎదురైనది. గడ్డాఫీ నాయకత్వంలోని లిబియా ప్రభుత్వం సైతం ఒకింత సర్దుబాటుకి సిద్ద పడింది. తమ మనుగడకై పాశ్చాత్య రాజ్యాల వత్తిళ్ళకు మరికొందరు తొలి తరం ఆఫ్రికన్ జాతీయోద్యమ నేతలు కూడా తలవంచారు. తమ ఇరుగు, పొరుగు దేశాల సహ జాతీయ ప్రభుత్వాలు కూడా కొన్ని ఇలాగే మారిపోయాయి. అయినా ముగాబే ప్రభుత్వం తన పాత జాతీయ విధానానికే కట్టుబడింది. ఇది పాశ్చాత్య దేశాల కడుపు మంటకి కారణమైనది.

గత 15 ఏండ్లుగా ముగాబే ప్రభుత్వం మీద ప్రధానంగా ఆంగ్లో-అమెరికన్ కూటమి చాలా వత్తిళ్ళు తెస్తున్నది. యూరోపియన్ యూనియన్ (ఇయు) కూడా తనదైన బాణీలో జింబాబ్వేను అస్థిర పరచజూస్తున్నది. అప్రకటిత ఆంక్షలను ఇవి కొనసాగిస్తున్నాయి. సహజ సంపదల దేశాన్ని తమ నయావలసగా మార్చుకోజూస్తున్నాయి. ఖనిజ, వ్యవసాయ రంగాల మీద అవి కన్నేసాయి. వాటిని కబళించే లక్ష్యంతో జింబాబ్వేలో రాజకీయ అస్థిర పరిస్థితులను సృష్టించజూస్తున్నాయి. ఒకవైపు అమెరికాకూ, ఇ.యూకీ మధ్య జింబాబ్వేను తమ నయావలసగా మార్చుకోవడంలో పోటీ నెలకొన్నది. మరోవైపు తొలుత, ముగాబే ప్రభుత్వాన్ని కూల్చడంలో వాటి మధ్య విశాల ఐక్యత కొనసాగుతూ వుంది. ఈ విశాల ఐక్యతతోనే అవి నేడు జింబాబ్వే అధ్యక్ష ఎన్నికలను ఒక అవకాశంగా ఎంచుకున్నాయి. పూర్తి స్థాయి ఆంక్షలను యూఎన్‌ఓ ద్వారా విధించజూస్తున్నాయి. తద్వారా ముగాబే ప్రభుత్వ పాలన నుంచి జింబాబ్వే ప్రజలను అవి 'రక్షించ'డానికి నేడు నడుం గట్టాయి.

ఇప్పటికే అప్రకటిత ఆంక్షలవల్ల జింబాబ్వేలో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటింది. ధరలు చుక్కలు చూస్తున్నాయి. ద్రవ్యోల్బణసూచిక వేల శాతాలతో పైకి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఈ మొత్తం పాపానికి సామ్రాజ్యవాదులే కారకులు! ఇంతటితో వారి కడుపుమంట చల్లారలేదు. ఇప్పుడిక పూర్తిస్థాయిలో అధికారిక ఆంక్షలకు బరితెగించ బోతున్నారు. రానున్న ప్రమాదం గూర్చి అర్థం చేసుకోవచ్చు.

ఇంతకూ ముగాబే ప్రభుత్వం మీద ఎన్నికల అవకతవకలకు పాల్పడిందంటూ సాగిస్తున్న దుష్టచారం సంగతేమిటో కూడా పరిశీలించుదాం! ఒకవేళ నిజంగానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి ముగాబే ప్రభుత్వం చట్ట విరుద్దంగా అధికారానికి వచ్చిందనుకుందాం! అయితే మాత్రం ఆ ప్రభుత్వం మీద ఆంక్షలు విధించే అధికారం అంతర్జాతీయ సమాజానికి ఎవరిచ్చారు? జింబాబ్వే ప్రజలే న్యాయనిర్ణేతలు! ప్రజాస్వామ్యం కోసమైనా, సార్వభౌమాధికారం కోసమైనా పోరాడాల్సింది ఆ దేశ ప్రజలే! ఆ దేశ ప్రజల శ్రేయస్సు పేరుతో ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకునే అధికారం ఇతర దేశాలకు లేదు. ముఖ్యంగా సామ్రాజ్యవాద దేశాలకి అసలే లేదు. మరీ ముఖ్యంగా 2 వందల ఏండ్లపాటు జింబాబ్వే ప్రజలను బానిసలుగా అంగట్లో అమ్మిన అనాగరిక సంపన్న సామ్రజ్యాలకు వేలెత్తి చూపే అధికారం కూడా లేదు.

అసలు లోతుగా పరిశీలిస్తే జింబాబ్వే అధ్యక్ష ఎన్నికల అవకతవకల నిజరూపం కూడా అర్థమౌతుంది. బాహ్య ప్రపంచానికి పాశ్చాత్య మీడియా కలిగించిన అభిప్రాయం కూడా నిజం కాదు. ప్రపంచంలోని చాలా దేశాల ఎన్నికల నియమావళినే జింబాబ్వే అధ్యక్ష ఎన్నికల నియమావళి కూడా అనుసరించింది. మొదటి రౌండ్ ఎన్నికలలో ఎందరైనా అధ్యక్ష అభ్యర్థులుగా పోటీ చేయవచ్చును. అందులో ఏదేని ఒక అభ్యర్థికి 50 శాతంకి ఓట్లు మించితే ఇక రెండో రౌండ్ ఎన్నికలు వుండవు. అతనే దేశాధ్యక్షునిగా ఎన్నికైనట్లు ఎన్నికల కమీషన్ ప్రకటిస్తుంది. ఒకవేళ ఏ ఒక్క అభ్యర్థికి కూడా 50 శాతం ఓట్లు రాకపోతే, మొదటి మరియు రెండవ అభ్యర్థులిద్దరి మధ్య మాత్రమే రెండో రౌండ్ ఎన్నికలు జరుగుతాయి. మొదటి రౌండ్ ఎన్నికలలో ప్రతిపక్ష నేత స్వాంగిరాయ్‌కి 48 శాతానికి తక్కువగా ఓట్లు వచ్చాయి. ముగాబేకి 43 శాతానికి పైగా వచ్చాయి. ఇందులో ఎవరికీ 50 శాతం ఓట్లు మించలేదు. గాన ఎన్నికల నియమావళి ప్రకారం స్వాంగిరాయ్, ముగాబేల మధ్య ముఖాముఖి ఎన్నికలు రెండవ రౌండ్‌లో జరపాల్సి వుంది. దీనికి స్వాంగిరాయ్ సిద్ధం కాలేదు. పైగా అడ్డదారిలో దేశాధ్యక్షునిగా స్వాంగిరాయ్‌ని ఎన్నికైనట్లు ప్రకటింపజేయాలని కుట్రలు జరిగాయి. జింబాబ్వే ఎన్నికల కమీషన్ మీద అమెరికా యూరోపియన్ సామ్రాజ్యవాద దేశాలన్నీ దారుణంగా వత్తిళ్ళు తెచ్చాయి. అవకతవకలకు పాల్పడింది ముగాబే ప్రభుత్వం కాదు. పాశ్చాత్య రాజ్యాలే అవకతవకలకు దిగి, వాటిని చట్టబద్ధమైనవిగా చిత్రించదలిచాయి.

రెండవ రౌండ్ ఎన్నికలకి స్వాంగిరాయ్ భయపడటానికి కారణాలున్నాయి. మొదటి రౌండ్‌లో పోటీచేసిన తృతీయ అభ్యర్థికి 7 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. ఈ తృతీయ అభ్యర్థి ముగాబే కంటే అతివాద విధానాల ప్రతినిధి! ఆయన జింబాబ్వేలోని తెల్లజాతీయుల చిన్నా, చితకా ఆస్తులన్నింటినీ తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాడు. స్థూలంగా ముగాబే ప్రభుత్వ జాతీయ విధానాన్ని సమర్థిస్తూనే, అంతకంటే అతివాద జాతీయ విధానాలతో పోటీ చేశాడు. పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ఏజెంటుగా పేరొందిన స్వాంగిరాయ్‌ని దేశద్రోహిగా ప్రకటించి, అధ్యక్ష ఎన్నికలలో పోటీకి అనర్హుణ్ణి చేయాలని అతడు వాదించాడు. ఈ కారణంగా తృతీయ అభ్యర్థి మద్దతుదారులు నూటికి నూరుపాళ్ళు రెండో రౌండ్ ఎన్నికలలో ముగాబేకి ఓటు వేసారు. పైగా మొదటి రౌండ్ ఎన్నికల ప్రచారంలో జింబాబ్వే జాతీయవాదం రెండుగా చీలిపోయింది. రెండో రౌండ్ ఎన్నికలలో అది పునరేకీకరణజరిగి, ఒక అదనపు వూపు వస్తుంది. అందుకే పాశ్చాత్య దేశాల మీడియా 48 శాతం ఓట్లు వచ్చిన స్వాంగిరాయ్‌ని ఏకంగా దేశాధ్యక్షునిగా ఎన్నికైనట్లు ఒక ఫోబియాను సృష్టించాయి.

వారు రెండవ రౌండ్ ఎన్నికలకి భయపడుటకు మరికొన్ని కారణాలు కూడా వున్నాయి. జింబాబ్వే మొదటి రౌండ్ ఎన్నికల్లో అనేక విదేశీ కుట్రలు జరిగాయి. అవి పోలింగ్ రోజునే కొన్ని బహిర్గతమైతే, ఆ మరునాటి నుంచి మరికొన్ని కుట్రలు వెల్లడయ్యాయి. విదేశీ నిధులు ఎన్నికలలో ప్రవహించాయి. ముగాబే ప్రభుత్వంలోని కొందరు ఉన్నతస్థాయి అధికారులను 'విదేశీ నిధుల'తో కొనివేశారు. వారు ఎన్నికల్లో వెన్నుపోటు పాత్రను పోషించారు. గ్రామీణతెల్లజాతి జమీందార్లు, లాండ్ ఎస్టేటర్లు పోలింగ్ కేంద్రాలకు సామాన్య ప్రజలను రానివ్వకుండా రకరకాల ఎత్తుగడలు వేశారు. ప్రలోభాలకి కూడా గురిచేశారు. మీడియా తనదైన పాత్రను పోషించింది. ఇవన్నీ

డబ్ల్యూ.టి.వో. నుండి వైదొలగాలి! వ్యవసాయ రంగాన్ని రక్షించాలి!!

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ.) మిని స్టిరియల్ సమావేశం వ్యవసాయ ఒప్పందం ఖాయం చేయటానికి జెనీవాలో జూలై 21 నుండి ప్రారంభం కాబోతుంది. ఈ సమావేశం వ్యవసాయేతర అంశాలను మార్కెటుకు సంబంధం కల్పించే అంశాలకు ఉద్దేశించబడింది.

ఈ రెండు ఒప్పందాలవల్ల అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్, జపాను దేశాలకే ఉపయోగం తప్ప వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరడమే అభివృద్ధి చెందుతున్న దేశాలకు, భారతదేశానికి తీరని నష్టం అనే విషయాన్ని ఎఐకెఎంఎస్ ప్రారంభం నుండి వాదిస్తూ వస్తున్నది. దాని కనుగుణ్యంగానే డబ్ల్యూ.టి.వో నుండి భారత్ బయటకు రావాలని ఆందోళనలు కొనసాగిస్తున్నది.

వివిధ ఒప్పందాలపై చర్చలు కొనసాగిస్తూ అభివృద్ధి చెందిన దేశాలు, వారి బహుళ జాతి సంస్థలు తమ విచ్చలవిడి దోపిడీకి చట్టబద్ధత కల్పించుకోవడానికే డబ్ల్యూ.టి.ఓ.వేదికను సాధనంగా చేసుకొంటున్నారు.

మన దేశంలో వ్యవసాయరంగం కోట్ల మందికి ఉపాధిని కల్పిస్తూ దేశానికి ఆహారభద్రతను కల్పిస్తున్నది. మన వ్యవసాయదారులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలకంటే వ్యవసాయ రంగమే 1994 నాటికి 1,34,000 కోట్లు రాయితీ ఇచ్చినట్లు శరద్ జోషి పేర్కొన్నాడు. భారతదేశం ఇస్తున్న సబ్సిడి ఉత్పత్తి ఖర్చులో 2%కి మించి లేదు. కాని అమెరికా, యూరప్, జపాను దేశాలు 32% నుండి 87% వరకు రాయితీలు ఇస్తున్నాయి. డబ్ల్యూ.టి.ఓ. ద్వారా ప్రపంచ మార్కెటులోకి విస్తారంగా ప్రవేశించడానికి అంశాలు పెంచుకొన్నారు. నేడు మత్స్య పరిశ్రమను ఎఫ్.ఏ.ఓకు అనుబంధంగా చేర్పించి NAMAలో ప్రతిపాదించారు. పెద్ద పడవలకు రాయితీ ఇచ్చికోవచ్చని పేర్కొన్నారు. కాని వెనుకబడిన దేశాల చేపల వేట 90% చిన్న పడవలపై కొనసాగుతుంది. బ్లూబాక్స్, గ్రీన్‌బాక్స్ పేరిట ఇచ్చే రాయితీ భారీగా పెంచారు. అది ఖాయం చేసుకోవడానికి నేడు సమావేశం వేదిక కాబోతుంది. ఒక్కొక్క ఒప్పందాన్ని విమర్శించడం, వ్యతిరేకించినందువల్ల ప్రయోజనం లేదు. డబ్ల్యూ.టి.ఓ నుండి భారత్ బయటకు రావడం ద్వారానే వ్యవసాయరంగాన్ని, దేశాన్ని రక్షించుకోగలం.

ఈ అంశంపై దేశవ్యాపితంగా జూలై 21న తమ తమ రాష్ట్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, కలిసి వచ్చే శక్తులను కలుపుకొని డబ్ల్యూ.టి.ఓ నుండి భారత్ బయటకు రావాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలని ఎఐకెఎంఎస్ కేంద్రకార్యవర్గం పిలుపునిస్తున్నది.

హెచ్.యస్. సంధు
అధ్యక్షులు

గాదె దివాకర్
ప్రధాన కార్యదర్శి,

కేంద్ర కార్యవర్గం,

అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఎఐకెఎంఎస్)

బహిర్గతం కావడంతో జింబాబ్వే ప్రజల్లో పాశ్చాత్య దేశాల కుట్రల పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగింది. రెండవ రౌండ్ ఎన్నికలు జరిగితే స్వాంగిరాయ్‌కి ఓట్ల శాతం గణనీయంగా దిగజారే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే రెండవ రౌండ్ ఎన్నికల బరి నుంచి స్వాంగిరాయ్ తోక ముడిచాడు. కానీ ముగాబే ప్రభుత్వ నియంతృత్వం, అవకతవకలకు నిరసనగా పోటీ నుంచి తాను విరమించుకున్నట్లు చిత్రించ జూశాడు. తమ పెంపుడు మీడియా ద్వారా ప్రపంచ ప్రజలని పాశ్చాత్య సంపన్న రాజ్యాలు అపోహలకి గురిచేయగలిగాయి.

జింబాబ్వేలోని అంతర్గత పరిస్థితిని కూడా ప్రస్తావించుకోవాలి. ప్రధానంగా పాశ్చాత్యదేశాల ఆంక్షలూ, వత్తిళ్ళూ, కుట్రల వల్ల జింబాబ్వే తీవ్ర అస్థిరతకు గురైనది. అధిక ధరలు, నిరుద్యోగం, కరువు, ఆకలి చావులు, శిశు మరణాలు, వ్యాధులు, ఆహారధాన్యాల కొరత వంటి రుగ్మతలతో ప్రజలు తీవ్రంగా ఇక్కట్లకు గురౌతున్నారు. బయట పడలేని ఒక సంక్షోభపు అగాధంలో చిక్కుకున్నారు.. భవిష్యత్తుపై నిరాశతో జీవచ్ఛవాలవలె జీవిస్తున్న దేశ ప్రజలను గత సాంప్రదాయ జాతీయవాదం సంతృప్తి పరచడం లేదు. మారిన కొత్త పరిస్థితుల కనుగుణ్యంగా కొత్త విధానాలను అవలంభించక పోతే ప్రజలు సహజంగానే అసంతృప్తికి గురౌతారు. ఈ మేరకు ముగాబే ప్రభుత్వం పట్ల గతంతో పోల్చితే దేశ ప్రజల్లో నమ్మకం కొంత తగ్గింది. అదే సమయంలో పాశ్చాత్య మీడియా ప్రచారం, మరియు స్వచ్ఛంధ సంస్థల ప్రయత్నాలవల్ల ప్రజల్లో ఒక గణనీయ భాగం స్వాంగిరాయ్ వైపు మొగ్గారు. ముగాబేని మళ్ళీ గెలిపిస్తే విదేశీ ఆంక్షల కొనసాగి, ఆకలి మంటలు తప్పవనుకున్నారు. స్వాంగిరాయ్‌ని గెలిపిస్తే విదేశీ సాయం అందుతుందనీ, కరువు, దుర్భిక్షాల నుంచి ఉపశమనం పొందవచ్చని భ్రమలకు గురయ్యారు. ఎన్నికల పట్ల నిర్లిప్తతతో ఒక వైపు మెజార్టీ ప్రజలు పోలింగ్‌కి దూరంగా వున్నారు. అపోహలకు గురైన ఒక గణనీయ భాగం ప్రజలు మరోవైపు స్వాంగిరాయ్‌కి గట్టి మద్దతునిచ్చారు (జింబాబ్వేలో లక్షల సంఖ్యలోగల ఇంగ్లీషు ఓటర్లలో 99 శాతం మంది స్వాంగిరాయ్‌కి ఎలాగూ ఓటు చేశారు). ఈ అన్ని కారణాలు కలిసి మొదటి రౌండ్ అధ్యక్ష ఎన్నికలలో స్వాంగిరాయ్‌కి పెద్ద వూపునిచ్చింది. అదే స్వాంగిరాయ్ ఆ తర్వాత జరిగిన పరిణామాలను గ్రహించి పోటీకి కూడా సిద్ధం కాలేదు.

నిజానికి ఈ ఎన్నికలు స్వాంగిరాయ్‌కీ, ముగాబేకీ మధ్య జరిగినవిగా చూడరాదు. జింబాబ్వే జాతీయ ప్రయోజనాలకూ, సామ్రాజ్యవాద ప్రయోజనాలకూ మధ్య జరిగినవిగా చూడాలి. జింబాబ్వేలోని ఉత్పత్తి సాధనాలు ఎవరి చేతుల్లో వుండాలనే ఎన్నికలివి! ముగాబే కంటే ముగాబే ప్రభుత్వ జాతీయ విధానాలు ముఖ్యమైనవి. వాటికంటె అవి ప్రాతినిధ్యం వహించే జింబాబ్వే జాతీయ వనరులూ, ఖనిజసంపదలూ, మానవశక్తీ అత్యున్నతమైనవి. వాటిని కబళించే విదేశీ కుట్రదారీ శక్తులు అత్యంత అనాగరిక, ఆటవిక, అమానవీయమైనవి. నీగ్రో ప్రజల రక్తమాంసాలను శతాబ్దాలపాటు తెగమెక్కి బలిసిన బందిపోటు సామ్రాజ్యాల నీతి సూత్రాలు అత్యంత మోసపూరితమైనవి. ఒకవైపు వందల ఏండ్లు మానవ బానిసల నెత్తురు మాంసాన్ని జుర్రుకున్న నరరూప రాక్షసత్వానికీ, మరో వైపు దేశ సంపదలను పరిరక్షించే జాతీయ వాదశక్తులకూ మధ్య జరిగిన ఎన్నికలుగా వీటిని చూడాలి.

ఈ ఎన్నికల క్రీడా ప్రాంగణంలో నియమావళిని ఎవరు ఏ మేరకు పాటించారనేది ముఖ్యం కాదు. అది సాంకేతిక మైనది మాత్రమే! తమ జాతి ఆస్తులను పరిరక్షించే లక్ష్యం గల జింబాబ్వే ప్రభుత్వం సాంకేతికంగా ఎన్నికల నియమావళిని ఒక వేళ ఉల్లంఘించిందనుకుందాం. పాశ్చాత్య సామ్రాజ్యవాదులూ, వారి తాబేదార్లూ ఒకవేళ సాంకేతిక ప్రమాణాలను చక్కగా పాటించారనుకుందాం. ఈ ఎన్నికల నియమావళీ, నిబంధనలూ, ప్రమాణాలూ, పద్ధతులూ వాటికి అవే 'జాతి ఆస్తులు' కాజాలవు. దానికి అదే 'సామాజిక సంపద' కాజాలదు. అందుకే అందమైన, తెలివైన, సున్నితమైన, లౌకికమైన కబ్జా సామ్రాజ్యవాదులకంటే, మొరటైన, మూర్ఖమైన, వికారమైన, వెనకబాటు జాతీయవాదులనే నిర్మోహమాటంగా బలపరచాలి. మనకి నేటి జింబాబ్వే పరిణామాలు ఈ పాఠాలనే బోధిస్తున్నాయి.

సామ్రాజ్యవాదుల ద్వంద్వ రాజకీయ ప్రమాణాలను కూడా తాజా జింబాబ్వే ఎన్నికలు నిరూపిస్తున్నాయి. కెనడాలో ఒక దశాబ్దం క్రితం ఫ్రెంచ్, ఇంగ్లీష్ భాషా జాతుల మధ్య వివాదంలో రిఫరెండం జరిగింది. రెండూ శ్వేతజాతులే! విడిపోయే హక్కును ఫ్రెంచ్ జాతీయ వాదులు కోరడంతో ఆనాటి ఎన్నికలు జరిగాయి. సమైక్యవాదానికి 50.2 శాతం ఓట్లు వచ్చాయి. వేర్పాటు వాదులకి 49.8 శాతం ఓట్లు వచ్చాయి. అరశాతం కూడా మార్జిన్ లేదు. అయినా ఎన్నికల నియమావళిని పాటించారు. మరోమాటకు తావులేదు. యుగోస్లోవేకియా (సెర్బియా) ఎన్నికలలో మొదటి రౌండ్. ఎన్నికలలో 50 శాతం ఓట్లు మిలోసోవిక్‌కు రాలేదనే సాకుతో ఆయన ప్రభుత్వాన్ని విధ్వంసంతో కూల్చివేశారు. రెండవ రౌండ్ ఎన్నికలలో పోటీకి అవకాశం కూడా నాటో యివ్వలేదు. ఇది వారి రెండు నాల్కల రాజనీతికి నిదర్శణం!

ముగాబే దేశాధ్యక్షునిగా ఎన్నికయ్యాక పాశ్చాత్యుల విమర్శల వెల్లువ వికృతంగా సాగింది. కానీ కుక్కకాటుకి చెప్పుదెబ్బవంటి ఒక ఎదురుదెబ్బ పాశ్చాత్య సంపన్న రాజ్యాలకు తగిలింది. ఈజిప్టులో 1.7.2008న ఆఫ్రికా సమైక్యతా సంస్థ శిఖరాగ్ర సమావేశం జరిగింది. మొత్తం 53 ఆఫ్రికన్ దేశాల ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. దీనికి జింబాబ్వే తరపున స్వయంగా ముగాబే హాజరయ్యాడు. ఈ సభ నుంచి ఆయన్ని బహిష్కరించాలనీ, ఆంక్షలను కోరుతూ తీర్మానించాలనీ పాశ్చాత్య రాజ్యాలు రకరకాల కూతలు కూశాయి. ఇవేవీ ఆ సమావేశంలో జరగలేదు. ముగాబే ప్రసంగిస్తున్నంత సేపు హర్షధ్వానాలు వినిపించాయి. సభకి ఆయనొక ప్రత్యేక ఆకర్షణగా మారాడు. పాశ్చాత్య దేశాల కుట్రలనూ, వారి మీడియా తమపై సాగించిన దుష్ప్రచారాన్ని తన ప్రసంగంలో బహిర్గత పరిచాడు. అన్నింటికంటే మించి ఒకటి జరిగింది. శాంతి, సుస్థిరతలను కాపాడటంలో ముగాబే ప్రభుత్వానికి అండ దండలివ్వాలని ఆఫ్రికన్ సమైక్యతా సంస్థ శిఖరాగ్ర సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకి పిల్ల కాకికి ముద్దట! ఔను నీగ్రో ఖండం నీగ్రో స్వామ్యాన్ని బలపరిచింది. శ్వేత జాత్యహంకార నీతిని తోసిపుచ్చింది. ఈజిప్టు వంటి కొన్ని అమెరికా అనుకూల ఆఫ్రికన్ దేశాలు కూడా ఆఫ్రికన్ సమైక్యతా వాదాన్ని కాదనలేక పోయాయి. ఈనాటి కష్టకాలంలో ఇది ముగాబే రాజకీయ, నైతిక ప్రతిష్టలను బాగా పెంచింది.

మూడో ప్రపంచ దేశాల జాతీయ నేతలు లేదా జాతీయ ప్రభుత్వాలు తాత్విక, రాజకీయ, సైద్ధాంతిక, వుద్యమ రంగాలలో ఒకే రకంగా వుండవు. ఆయా దేశాల, ఖండాల, తెగల, జాతుల, మతాల, రాజకీయ చారిత్రిక నేపథ్య పరిస్థితుల మీద ఇవి ఆధారపడతాయి. సామ్రాజ్యవాదుల కుట్రలను ఎదిరించే పద్ధతులు కూడా విభిన్నంగానే వుంటాయి. కాస్ట్రో, సద్దామ్, చావెజ్, నాజర్, గడ్డాఫీ, మిలోసోవిక్ వంటి నేతలు తాత్విక రాజకీయ స్థాయి గలవారు. సమకాలీన ప్రపంచ రాజకీయ పరిస్థితులను వీరు సరిగా అంచనా వేయగలరు. జాతీయంగా అంతర్జాతీయంగా తమ శత్రువులనూ, మిత్రులనూ సరిగ్గా విశ్లేషించగలరు. శత్రువుల మధ్య గల వైరుధ్యాలను కూడా వుపయోగించుకోగలరు. తమ దేశ ఆంతరంగిక ఎన్నికలలో కూడా దౌత్యపరంగా యూ.ఎన్.ఓ తదితర విదేశీ పరిశీలకులను భాగస్వామ్యం చేశారు. విదేశీ పాశ్చాత్య మీడియా దుష్ప్రచారాన్ని తప్పికొట్టే లౌకిక ఎత్తుగడలను అలవంభించారు.

ఇక పోతే మరో రకం నేతలున్నారు. 1979 ఇరాన్ ఇస్లామిక్ విప్లవ నేత ఖుమైనీ, ఆఫ్ఘనిస్థాన్ ఒమర్ వంటి పాలకులు అత్యంత మొరటైన, మూర్ఖమైన వారు. ఈ రెండు కాకుండా ముగాబే వంటి మధ్యే మార్గీయులూవున్నారు. ఆఫ్రికా చారిత్రిక రాజకీయ సామాజిక భౌతిక పరిస్థితుల నుంచే ముగాబే మోటు విధానాలను చూడాలి. ఒకవేళ ముగాబే తాత్విక, రాజకీయ స్థాయి అల్పంగా వుందనుకుందాం! పాశ్చాత్య మీడియా దానిని బట్టి ప్రపంచ ప్రజలను ఎక్కువగా అపోహలకు కూడా గురి చేయవచ్చు. మోటు లేదా వెనుకబాటు తనాల వల్ల నూరు సాంకేతిక పొరపాట్లు దొర్లవచ్చు. వెయ్యి రాజకీయ లోపాలు జరగవచ్చు. అయినా మీన మేషాలు లెక్కించకుండా, ముగాబే ప్రభుత్వ పక్షాన అంతకంటే మించి జింబాబ్వే ప్రజల పక్షాన నిలబడదాం!

రాబర్టు ముగాబే తన బాల్యం నుంచే జాతీయ భావాలతో వుద్యమకారునిగా రూపొందాడు. దుర్లభమైన, కఠోరమైన అజ్ఞాత, జీవితాన్ని కొనసాగించాడు. పాతిక వేల సాయుధ గెరిల్లా సైన్యాన్ని నిర్మించి, అప్రతిహతంగా నడిపించాడు. ఇరుగు, పొరుగు ఆఫ్రికన్ దేశాల జాతీయ విమోచనోద్యమాలను సమన్వయం చేశాడు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో రెండు అగ్రరాజ్యాలకు దూరంగా వున్నాడు. ప్రచ్ఛన్న యుద్ధ శకం ముగిశాక కూడా గుండె చెదరలేదు. ఏకధృవ ప్రపంచ వత్తిళ్ళకు తలవంచలేదు. తన సమకాలిక ఆఫ్రికన్ దేశాల జాతీయ నేతలు కొందరు వెనుకడుగు వేసినా చలించలేదు. పాశ్చాత్య సంపన్న సామ్రాజ్యాలు కుట్రలతో తన దేశాన్ని అస్థిరపరుస్తున్నా లొంగలేదు. 80 ఏండ్ల వృద్ధాప్యంలో కూడా తన జాతీయవాద ఎజెండాను విడిచి పెట్టలేదు. అందుకే ముగాబే ముమ్మాటికీ మూడో ప్రపంచ దేశాల మనిషే! ఆయన దీక్షనూ, దేశభక్తినీ నిండు మనస్సుతో అభినందించుదాం! ఆయన సారధ్యంలో నడిచే ప్రభుత్వానికి నైతిక అండదండలిద్దాం! ఆయన ప్రభుత్వ మార్గదర్శకత్వంలో జాతీయ చైతన్యంతో పురోగమిస్తున్న జింబాబ్వే దేశ ప్రజలకు చెయ్యి ఎత్తి జై కొడదాం.

"స్వతంత్ర" భారతంలో ఆదివాసీల స్థితిగతులు

భారతదేశంలో ఆదివాసీల అభివృద్ధి గురించి ఎన్నో పథకాలు రూపొందించి, కోట్లాది రూపాయలు కేటాయించి కృషి చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (ఏ పార్టీ అయినా) గత 6 దశాబ్దాలుగా గొప్పలు చెప్పుకుంటున్నాయి. నేడు మన్‌మోహన్ సింగ్, వై.ఎస్.ఆర్. నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అదే మాట చెప్తున్నాయి. కానీ, దేశానికి "స్వాతంత్ర్యం" వచ్చిందని పాలకులు చెప్పే మాటల గొప్పేగానీ దేశ జనాభాలో భాగంగా వున్న ఆదివాసీలు నేటికీ ఆర్థికంగా, సాంస్కృతికంగా, విద్యా-ఉద్యోగం, ఉపాధి, వైద్య రంగాల్లో వెనుకబడే వున్నారు.

"మైదానాలలో, పట్టణపరిసరాలలో, పట్టణాలలో వున్న దళితులు, గిరిజనుల కంటే మారుమూల ప్రాంతాల అడవుల్లో, కొండల్లో, గుట్టల్లో వున్న గిరిజనులు ఎంత వెనుకబడి వున్నారో, ఆహారం, వైద్యం, నిరుద్యోగం, వనరులు, అవకాశాలు, సమాచారం ఎంత తక్కువగా అందుతున్నాయో బోధపడుతుంది" అని ఇటీవలె ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాలు స్వయంగా పర్యటించిన లక్ష్మణరావు అనే ప్రొఫెసర్ వ్రాశారు (9-2-2007 వార్త). వీరిలో అత్యధికులు భూమిలేని వారుగానే వున్నారు. గనులు, తోటలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణం, వ్యవసాయ కూలీ పనులు చేసుకొంటూ విపరీతంగా దోపిడీకి గురవుతున్నారు. గిరిజనుల స్థితిగతుల గురించి జర్నలిస్టు పండరీనాథ్ ఇలా వ్రాసారు. "స్వాతంత్ర్యం వచ్చి 5 దశాబ్దాలు గడిచినా నేటికీ గిరిజనుల జీవన స్థితిగతుల్లో మార్పు రాలేదు. ఇంకా అనేక మంది గిరిజనులు కొండ కోనల్లో నివశిస్తూ కనీసం ఆహారం లభించక అలమటిస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం హామీలతో పొద్దు పుచ్చుతుంటే గిరిజనుల బతుకులు మాత్రం పస్తులతో తెల్లారి పోతున్నాయి..." అని వ్రాశారు. ఇంకా ఇలా వ్రాశారు. ".... ఆ విద్య, అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం.... ప్రకృతి విలయాలు ఇంకా ఎన్నో సమస్యలు గిరిజన ప్రాంతాలను చుట్టుముట్టి గిరిజనుల జీవితాన్ని దుఖ:మయం చేస్తున్నాయి..." అని పండరీనాథ్ (జూలై 22, 2002, ఆంధ్రప్రభ) వ్రాశారు. చాలా కాలం క్రిందట గిరిజనుల దుర్భరమైన జీవితాల గురించి ఎ. పండరీనాథ్ రాసినప్పటికీ, వారి జీవన స్థితిగతులు నేటికి దుర్భరంగానే వున్నాయి. నేడు కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణవిధానాలు ఆదివాసీల జీవన స్థితిగతులను మరింత అధ్వాన్నం చేస్తున్నాయి.

ప్రపంచంలో ఆఫ్రికా ఖండం తరువాత ఆదివాసీలకు కేంద్రం భారతదేశమే. ప్రస్తుతం వీరు దేశంలో 10 కోట్ల వరుకున్నారు. ఆ సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 80 లక్షలుగా వున్నది. ఆదివాసీలు 21 రాష్ట్రాలలో, 4 కేంద్ర పాలిత రాష్ట్రాలలో సరిహద్దు ప్రాంతాలు, గుట్టలు, కొండ ప్రాంతాలలో నివశిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 9 జిల్లాలలో 65,000 చ॥కి॥మీ॥ విస్తీర్ణంలో 60 వేల కుటుంబాలుగా వుండి 35 తెగలుగా జీవిస్తున్నారు. దేశంలో 636 గిరిజన తెగలున్నాయని ప్రముఖ చరిత్రకారుడు కె.ఎస్. సింగ్ చెప్పగా, 461 తెగలు ఉపతెగలుగా వుండి 100 భాషలు మాట్లాడుతున్నారని ఆసుతోష్ అనే మరో చరిత్ర కారుడు చెప్పాడు. ఆదివాసులు ప్రధానంగా 80% మంది మధ్య భారతంలో, 12% ఈశాన్య ప్రాంతంలో, 8% దక్షిణాధి ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరంతా 1857కి పూర్వం స్వయం సంపూర్ణ ఆర్థిక వ్యవస్థను పోలిన పరిపాలనను నిర్వహించుకొన్నారు. వారి ప్రాంతంలో సర్వహక్కులూ వారివే. అయితే, బ్రిటీషు ఆక్రమణ తరువాత ఆ పరిస్థితి మారింది. దోపిడీకి వారి ప్రాంతాల గురయినాయి. దీనితో ఆదివాసీ ప్రాంతాలు ఎంతో సుసంపన్నమైనప్పటికీ కొల్లగొట్టబడ్డాయి. అభివృద్ధికి నోచుకోలేక పోయాయి. ఆదివాసీల హక్కులు హరించబడ్డాయి. బ్రిటీష్ వారి హయాంలో భూస్వాములు, జమీందార్లు, మురాదారులు వంటి వారి పెత్తనం ప్రారంభమైంది. దీంతో ఆదివాసీలు తిరుగుబాట్లు చేయువలసి వచ్చింది. ఆదివాసీలు 1947కు పూర్వం స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా జమీందారులు, వడ్డీ వ్యాపారులు, బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారు. వీరు భూమి కోసం, అడవులపై హక్కు కోసం, బలవంతపు గెంటివేతలకి నిరసనగా, వలస సమస్యలు తదితర సమస్యలపై పోరాడారు. ఈ పోరాటాలన్నీ భారత ప్రజాతంత్ర ఉద్యమంలో భాగంగానే సాగాయి. ఇంకా చెప్పాలంటే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మొట్టమొదట తిరగబడ్డవారు భారతదేశంలో ఆదివాసులే. ఆ తరువాత దేశవ్యాపితంగా ప్రజా వుద్యమాలు, తిరుగుబాట్లు జరిగాయి. ఆ విధంగా ఎందరో చేసిన పోరాటాల ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతదేశానికి అధికార మార్పిడి జరిగింది. దీనినే "స్వాతంత్ర్యం" అంటూ స్వదేశీ పాలకులు, విదేశీ సామ్రాజ్యవాదులు భారత ప్రజలను మోసం చేస్తూవస్తున్నారు. అందుకే భారతదేశాన్ని నాడు ఒక్క బ్రిటీషువాడి స్థానంలో నేడు అమెరికాతో సహా అనేక దేశాలు దోచుకుంటున్నాయి. పెత్తనం చేస్తున్నాయి. వారి కనుగుణంగా భారత చట్టాలను మార్పించుకొంటున్నాయి. నేటి ప్రపంచీకరణకాలంలో వారి దోపిడీకి అవదులు లేవు. అన్ని రంగాలలో అన్ని ప్రాంతాలకు విస్తరించి ఏ ఒక్కరినీ వదలకుండా దోచుకుంటున్నారు. ఇందుకు దేశంలోని అన్ని బడాబూర్జువా, బడా భూస్వామ్య పాలక పార్టీలన్నీ (అవి కేంద్రంలో అధికారంలో వున్నా, రాష్ట్రాలలో అధికారంలో వున్నా) తోడ్పడుతున్నాయి. ఈ విధానాలు 1947 నుండి అమలు జరుగుతున్నప్పటికీ, 1991లో పి.వి. నర్సింహారావు ప్రధానమంత్రిగా తెచ్చిన సంస్కరణలను బరితెగించి అమలు జరపనారంభించారు. అదే విధానాలను ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్.డి.ఎ., యు.పి.ఏ. ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. రాష్ట్రంలో తెలుగుదేశం అదే విధానాలను అనుసరించింది. ఇట్టి విధానాలన్నీ దేశ ప్రయోజనాలకు, ఆదివాసీ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయి. ఫలితంగానే నేడు ఆదివాసీలు అత్యంత దుర్భరమైన జీవనం సాగించవలసివస్తున్నది. అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

అభివృద్ధి పేరుతో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల జీవితాలను దారుణంగా విచ్ఛిన్నం చేస్తున్నాయి. తరతరాలుగా గిరిజనుల జీవితంలో అంతర్భాగమైన సమానత్వ లక్షణాలు కలిగిన సమిష్టి రూపాలు అంతరించి పోతున్నాయి. దేశంలోని అన్ని వర్గాల ప్రజల కంటే ఆదివాసులే అన్ని విధాలుగా అట్టడుగున వున్నారు. బాగా

కిచ్చెల రంగయ్య

వెనుకబడి వున్నారు. భూస్వాములు, పెట్టుబడిదారులు, వడ్డీ వ్యాపారుల్ను, కాంట్రాక్టర్లు, అవినీతి పరులైన రెవిన్యూ - పోలీసు అధికార్లు, పాలకవర్గ నాయకులు సాగించే విచ్చలవిడి దోపిడీకి ఆదివాసీలు దారుణంగా బలవుతున్నారు. బతుకుతెరువుకై స్వస్థలాలు వదిలి పరాయి ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసపోయి దిక్కులేని చావులు చస్తున్నారు. పని స్థలాలలో గిరిజన మహిళలను భూస్వాములు, మాఫియాలు, కాంట్రాక్టర్లు, అటవీ అధికార్లు, ఇతర యజమానులు లైంగికంగా వేధిస్తున్నారు. వారు అసంఘటితంగా వుండటమేగాక, వెట్టి కార్మికులుగా కూడా వుండటం వల్ల వారు కనీస వేతనాలు పొందలేక పోతున్నారు. వారిని గిరిజన చట్టాలు కాపాడలేక పోతున్నాయి. విద్యా, వైద్య సౌకర్యాలు పొందలేక పోతున్నారు. గ్రామాలకు కొన్నింటికి రహదార్ల సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, రవాణా సౌకర్యం, వైద్య సౌకర్యం వంటివి ఇంకా అందుబాటులో లేవంటే ఆశ్చర్యం కలుగక మానదు. రాష్ట్రంలో విద్య 44.07% వుండగా అది ఆదివాసీలలో 17.16% మాత్రమే వుంది. అది ఆదివాసీ స్త్రీలలో 8.68% మాత్రమే వుంది. వీరిలో దారిద్ర్యం 61% వుంది. గిరిజన ప్రాంతాల్లో 125 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 110 ఉప కేంద్రాలు, 29 యం.యం. కేంద్రాలు, 21 ఆసుపత్రులు, 16 డిస్పెన్సరీలు పని చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్తున్నది. అయినా, అవి ఆదివాసీల అవసరానికి తగ్గట్టుగా లేవు. వున్న వాటిలో కూడా ఉద్యోగులూ, మందులూ వుండటం లేదు. వాహనాలుండటం లేదు. భవనాలుండవు, డాక్టర్లు ఇతర సిబ్బంది వుండరు. వుంటే కూడా ఎక్కడో వుండి వచ్చిపోయే పరిస్థితే వుంది. దానితో ప్రతి సంవత్సరం సంభవించే విషజ్వరాలు, వాంతులు, విరోచనాలు, వింత రోగాలతో వేలాది మంది ఆదివాసులు దిక్కులేని చావు చస్తున్నారు. ఈ సంవత్సరం ఇప్పటికే రాష్ట్రంలో ఆదిలాబాద్, ఖమ్మం, విశాఖ వంటి మన్య ప్రాంతాలలో ఎందరో ఆదివాసీలు మరణిస్తున్నప్పటికీ, ఆదివాసీలకు అనుకూలమైన ప్రభుత్వంగా చెప్పుకొంటున్న వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అచేతనంగా వుంది. ఇక విద్యుత్ సౌకర్యం గురించి పరిశీలిస్తే ఆదివాసీ ప్రాంతాలలో 44.6% గ్రామాలకు మాత్రమే కరెంటు లభించింది. ఇంకా 2844 రెవిన్యూ గ్రామాలు, 1448 శివారు గ్రామాలకు కరెంటు లేక చీకట్లోనే వుంటున్నాయి. రోడ్లు మైదాన ప్రాంతంలో ప్రతి 100 చ॥కి॥ మీటరుకు 46.79% రోడ్డు వేయగా, ఆదివాసీ ప్రాంతాలలో కేవలం 1.63% మాత్రమే రోడ్లు వేశారు. 1543 గ్రామాలకు మంచినీటి సౌకర్యం లేదు. అంటే పాలకులు చెప్పే అభివృద్ధి దేశంలోని కొందరికే తప్ప 100 కోట్ల మందిలో 10 కోట్లుగా వున్న అత్యంత వెనుకబడిన ఆదివాసులకి లభించటం లేదు. ఈ విధంగా ఆదివాసులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నేడు భూమి, నిర్వాసిత సమస్యలను ప్రధానంగా ఎదుర్కొంటున్నారు.

భూమి సమస్య: ఆదివాసీ ప్రాంతంలో బ్రిటీష్‌వారు, వివిధ రాజులు, జమీందార్లు అనుసరించిన విధానాల వల్ల గిరిజన ప్రాంతాలలోకి వడ్డీ వ్యాపారులు, భూస్వాములు ప్రవేశించి గిరిజనుల భూములను వివిధ పద్ధతుల్లో అన్యాక్రాంతం చేశారు. ఈ క్రమం అధికార మార్పిడి జరిగిన తరువాత గిరిజనుల భూమి రక్షణకోసం అంటూ ఎన్ని చట్టాలు చేసినా, పాలకులకు చిత్తశుద్ధి లేక పోవటంతో గిరిజనుల భూమి పరాయికరణజరిగిపోతూనే వున్నది. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్డ్‌తోపాటు షెడ్యూల్డ్ ప్రాంతాల నియంత్రణచట్టం (1/70), చోటానాగపూర్, సంతాల్ పరిగణకౌలుదారీ చట్టం వంటివి అనేకం వున్నప్పటికీ భూమి పరాయికరణఆగలేదు. వివిధ పద్ధతుల్లో జరిగి పోతూనే ఉన్నది. తాకట్టు, కౌలు ఒప్పందాలు, బినామీ బదలాయింపులు, రెవిన్యూ అధికారుల సహాయంతో తప్పుడు పత్రాలు పుట్టించడం ద్వారా, గిరిజన స్త్రీలను గిరిజనేతరులు వివాహం చేసుకొనే పేరుతో, గిరిజన పాలేర్ల పేరుతో బినామి భూములు కాజేయటం వంటి రూపాలలో భూమి పరాయికరణజరిగి పోతున్నది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1970 నాటికే గిరిజనుల భూమి 18,48,209 ఎకరాలలో 7,53,435 ఎకరాలు (48.29%) అన్యాక్రాంతం అయింది. ఆ తరువాత 1/70 వచ్చాక సుమారు 8 లక్షల ఎకరాలు గిరిజనుల భూమి అన్యాక్రాంతం అయింది. ఈ పరిస్థితి గిరిజనులను మరింత భూమి హీనులను చేస్తున్నది. తీవ్రస్థాయి ఆవేదనకు గురిచేస్తున్నది.

గిరిజనుల గెంటివేత సమస్య: గిరిజనులు ఎంతో కాలం నుండి సాగుచేసుకొంటున్న భూములను పాలకులు అభివృద్ధి పథకాల పేరుతో లాగేసుకుంటున్నారు. అడవుల నుండి వారిని గెంటివేస్తున్నారు. వివిధ అభివృద్ధి పథకాల పేరిట ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, గనుల త్రవ్వకం వంటి పథకాలకు ఎలాంటి నష్టపరిహారంగానీ, పునరావాసం కల్పించటం గానీ ముందుగా చేయకుండా గెంటి వేస్తున్నారు. నిర్వాసితులను చేస్తున్నారు. కొన్ని చోట్ల చేస్తున్నట్లు చెప్పుతున్నదంతా మొక్కుబడిగా వుంటున్నది. అనేక అవకతవకలతో కూడిన ప్యాకేజీని అమలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఆ విధంగా ఈ 'అభివృద్ధి' అనేది గిరిజనులకి తోడ్పడక పోగా ఆదివాసీలను బలి తీసుకుంటున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి, ఖమ్మం జిల్లాల సరిహద్దులలో నిర్మించ తలపెట్టిన పోలవరం ప్రాజెక్టువల్ల దాదాపు 300 గ్రామాలు, 2 లక్షల ఎకరాల భూములు మునిగిపోతున్నాయి. ఇందులో సగం మంది గిరిజనులే ఉన్నారు. వీరి కోసం పునరావాసం, పునర్నిర్మాణపథకం (ఆర్.ఆర్. ప్యాకేజి) కంటి తుడుపుగా వున్నది. ఈ పరిస్థితి దేశవ్యాపితంగా ఎన్నో సంవత్సరాల నుండి జరుగుతున్నది. భారత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల వలన గిరిజనులు పెద్ద ఎత్తున నిర్వాసితులయినారు. మొదటి, రెండవ పంచవర్ష ప్రణాళికల కాలంలో చేపట్టిన 189 పబ్లిక్ ప్రాజెక్టుల వల్ల బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో దాదాపుగా 94,45,776 ఎకరాల భూముల నుండి వెళ్ళగొట్టబడ్డారు. 3వ పంచవర్ష కాలంలో 27 ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయ్యే క్రమం పెరిగింది. 1951 నుండి 1990 మధ్యకాలంలో 21.3 మిలియన్లు (2.30 కోట్ల) నిర్వాసితులయితే, అందులో 8.7 మిలియన్లు (8.7ల) గిరిజనులున్నారు. ఇది 15% వుంటుంది. కాగా 2 కోట్ల 60 లక్షల మంది గిరిజనులు నిర్వాసితులయినారని వాల్టర్ పెర్నాండేజ్ అనే అతను గిరిజన నిర్వాసితులపై అధ్యయనం చేసి చెప్పాడు.

ప్రపంచీకరణవిధానాల్లో భాగంగా అమలు చేస్తున్న సరళీకృత విధానాల ఫలితంగా దేశంలో, రాష్ట్రంలో అనేక అటవీ ప్రాంతాలలో పార్కుల ఏర్పాటు, పర్యాటక ప్రాంతాల ఏర్పాటు కోసం, అడవుల అభివృద్ధి ఇతర అభివృద్ధి పథకాల పేరిట గిరిజనులను పోడు భూముల నుండి, అటవీ ప్రాంతాల నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలను పాలకులు చేస్తున్నారు. వాస్తవానికి గిరిజనుడికి-అడవులకి మధ్య అవినాభావ సంబంధం వుంది. ఆదివాసులవల్ల అడవులు ఎప్పుడూ నాశనం

నేపాల్ రాజ్యాంగ నిర్ణయ సభ ఎన్నికలలో మావోయిస్టు పార్టీ ఘన విజయాన్ని అభినందిస్తూ కలకత్తాలో భారీ సభ

నేపాల్ రాజ్యాంగ నిర్ణయ సభకు గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సాధించిన ఘన విజయాన్ని అభినందించటానికి బెంగాల్‌లోని 18 విప్లవ, వామపక్ష పార్టీలు కలకత్తాలో జూన్ 23న సంయుక్తంగా ఒక భారీ బహిరంగ సభను నిర్వహించాయి. చరిత్రాత్మక నక్సలైట్ వుద్యమం 1970లలో ప్రారంభమైన యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాల్‌లోనే ఈ సభ జరగటం విశేషం. రాచరికంపై నేపాల్ ప్రజలు మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సాధించిన చారిత్రాత్మక విజయాన్ని, నేపాల్ రాజ్యాంగ నిర్ణయసభకు జరిగిన ఎన్నికలలో మావోయిస్టు పార్టీ సాధించిన ఘన విజయాన్ని ఈ సభ ఏకగ్రీవంగా అభినందించింది. నేపాల్ మావోయిస్టు పార్టీ, నేపాల్ ప్రజలు సాగిస్తున్న విప్లవ పోరాటానికి తన సంపూర్ణ మద్దతును తెలియజేసింది. భారత పాలకవర్గాలు, అమెరికన్ సామ్రాజ్యవాదం నేపాల్ ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించింది.

ఈ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నేపాల్ మావోయిస్టు పార్టీ చైర్మన్ కామ్రేడ్ ప్రచండ పంపించిన సందేశాన్ని నేపాల్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ లక్ష్మణ్ పంత్ సభకు చదివి వినిపించారు. కామ్రేడ్ ప్రచండ్ తన సందేశంలో యిలా అన్నారు. "రాజ్యాంగ నిర్ణయ సభకు జరిగిన ఎన్నికలు, నేపాల్‌లో ఫెడరల్ ప్రజాస్వామిక, రిపబ్లిక్ యేర్పాటుకు నిస్సంకోచంగా పునాదిని వేశాయి. ఫ్యూడల్ రాచరిక వ్యవస్థను కూల్చివేశాయి. అయితే, భూస్వామ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేపాల్ ప్రజల పోరాటం యెంత మాత్రం ముగియలేదు. కనుక, రానున్న రోజులు మరింత సవాలుతో కూడినవి". తమ పోరాటానికి అంతర్జాతీయ సంఘీభావం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. "సామ్రాజ్యవాద దాడి, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాద దాడి పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో, ఒక దేశంలో కార్మికవర్గ విప్లవ విజయం గతంలో యెప్పటికన్నా, కార్మికవర్గం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బలమైన విప్లవోద్యమాన్ని అంతర్జాతీయంగా నిర్మించగలుగుతుందా? లేదా? అనే దాని మీద ఆధారపడి వుంటుందని మేము అభిప్రాయపడుతున్నాం" అని కామ్రేడ్ ప్రచండ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాపితంగా విప్లవ శక్తులు, వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు, వ్యక్తులు బలమైన సంఘీభావాన్ని అందించి వుండకపోతే, నేపాల్‌లో ఈ మార్పు సాధ్యమైవుండేది కాదని ప్రచండ అన్నారు. మరీ ముఖ్యంగా భారతదేశంలోని విప్లవ, ప్రజాతంత్ర శక్తుల అండయెంతగానో తోడ్పడిందని ఆయన పేర్కొన్నారు.

సభనుద్దేశించి నేపాల్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ లక్ష్మణ్ పంత్ ప్రధానోపన్యాసం చేశారు. ఆయన తన వుపన్యాసంలో నేపాల్ మావోయిస్టు పార్టీ సాధించిన విజయం అంతర్జాతీయ కార్మికవర్గం సాధించిన విజయమేనన్నారు. నేపాల్ మావోయిస్టు పార్టీ విజయం అజేయమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం విజయమన్నారు. ఇది కృశ్చేవ్ రివిజనిస్టు సిద్ధాంత ఓటమి, పార్లమెంటరీ విధాన ఓటమి అని ఆయన వుద్ఘాటించారు. నేపాలీ విప్లవం పట్ల ఒక అభిప్రాయాన్ని యేర్పరచుకునే ముందు ఈనాటి ప్రపంచ పరిస్థితి గురించి ఒక సమగ్రమైన, వాస్తవికమైన మదింపుకు రావాలని ఆయన విప్లవకారులకు, ప్రజాస్వామిక వాదులకు విజ్ఞప్తి చేశారు. రష్యాలో బోల్షివిక్ విప్లవం జరిగిన నాడు కానీ, చైనాలో విప్లవం జరిగిన నాడు కానీ వున్న అనుకూల పరిస్థితులు - సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమైన వైరుధ్యాలు, ప్రపంచ యుద్ధ పరిస్థితులు ఈనాడు లేవనే విషయాన్ని గమనంలో వుంచుకోవాలని ఆయన కోరారు. ఆనాడు ఈ తీవ్ర వైరుధ్యాల వలన సామ్రాజ్యవాదం, రివిజనిజం బలహీనపడ్డాయని, ఈనాటి భౌతిక, స్వీయాత్మక పరిస్థితులు - రెండూ అననుకూలంగా వున్నాయని ఆయన అన్నారు. పార్టీ ముఖ్యమైన రాజకీయ, యెత్తుగడల విజయాలను సాధించినప్పటికీ, అంతిమ విజయం యింకా దూరంగానే వుందని, వర్గ పోరాటం యింకా ముగియలేదని ఆయన చెప్పారు. పత్రికలలో వస్తున్న వార్తలను బట్టి, నాయకులు పత్రికలకు యిస్తున్న ఇంటర్వ్యూలను బట్టి పార్టీ సిద్ధాంతం గురించి, విధానాలు, కార్యక్రమాల గురించి ఒక అభిప్రాయానికి రావద్దని, పార్టీ అధికార ప్రకటనలు, డాక్యుమెంట్ల మీద ఆధారపడి మాత్రమే అభిప్రాయాలకు రావాలని సభలో పాల్గొన్న పార్టీలను ఆయన కోరారు.

ఈ సభకు కా॥ సుఖేందు భట్టాచార్య, కా॥ సదానంద్ బగాల్, కా॥ ప్రదీప్ బెనర్జీలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి కా॥ ప్రదీప్ సింగ్ ఠాగూర్, పీసీసీ, సీపీఐ (యం-యల్) ప్రధాన కార్యదర్శి సంతోష్ రాణా, ఎస్ఓసీ, సీపీఐ (యం-యల్) నాయకుడు సోమనాథ్ చటర్జీ, మజ్దూర్ కిసాన్ పార్టీ నాయకుడు అమృత్ పైరా, ఎస్.యు.సి.ఐ. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర నాయకులు సదానంద్ బగాల్, సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు అనిమేశ్ చక్రవర్తి, వర్కర్స్ పార్టీ నాయకుడు సుఖేందు భట్టాచార్య, సీపీఐ (ఎం-ఎల్) జనశక్తి నాయకులు ఆలోక్ ముఖర్జీ, గణప్రతిరోధ్ మంచ్ నాయకులు ప్రసూన్ చటర్జీ, డి.యం.ఎస్ నాయకులు సుఖేందు సర్కార్, సీపీఐ (ఎం-ఎల్) పీసీసీ నాయకులు శైలేన్ భట్టాచార్య, సీసీఆర్‌యంయల్ నాయకులు యాష్‌దాస్, సీపీబి నాయకులు వర్నాలి ముఖర్జీ ఈ సభలో ప్రసంగించారు. సీఆర్ఎల్ఐ, సీపీఆర్‌యం నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి అంగీకారం తెలియజేశారు కానీ హాజరు కాలేక పోయారు. ఉపన్యాసకులందరూ నేపాల్ విప్లవానికి మద్దతుగా నేపాల్ ఆంతరంగిక వ్యవహారాలలో భారత విస్తరణవాదులు, సామ్రాజ్యవాదుల జోక్యానికి వ్యతిరేకంగా భారత ప్రజల సంఘీభావ వుద్యమాన్ని నిర్మించాలని పిలుపిచ్చారు. భారతదేశంలోని విప్లవకారులకు, ప్రపంచంలోని విప్లవకారులకు నేపాల్ విప్లవం యెంతో వుత్తేజాన్ని, శక్తిని యిచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో సభలో పాల్గొన్న పార్టీలు నేపాల్ విప్లవానికి, మావోయిస్టు పార్టీకి మద్దతుగా ఒక తీర్మానాన్ని ఆమోదించాయి. 14 పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానంలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో నేపాల్ ప్రజలు తమ సుదీర్ఘ పోరాటం ద్వారా రాచరికాన్ని ఓడించడంలోను ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామిక రిపబ్లిక్కును యేర్పరచటంలోనూ గొప్ప విజయాన్ని సాధించారని ప్రశంసించింది. నేపాల్ ప్రజలకు విప్లవాభినందనలను తెలియజేసింది. వారికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది. నేపాల్‌లో అమెరికన్ సామ్రాజ్యవాదుల, భారత విస్తరణవాదుల జోక్యాన్ని ఖండించింది.

కాలేదు. పైగా రక్షించబడినాయి. కేవలం ప్రభుత్వాల వ్యాపార ధోరణి వల్లా, 'అభివృద్ధి' పేరుతో అనుసరిస్తున్న విధ్వంస విధానాలవల్లా అడవులు నాశనం అయ్యాయి. జంతువులు అంతరించుటకు కూడా పాలకుల తప్పుడు విధానాలే కారణం. గిరిజనుడు పోడు గొట్టడం వల్ల, అవసరాల కోసం ఉపయోగించే కొద్దిపాటి కలప వల్ల అడవులు నాశనం కావటం లేదు. గిరిజనుడు పరిమితమైన ప్రాంతాల్లోనే పోడు కొడతాడు. వారికి ఇంటి సామానులు చాలా స్వల్పంగా వుంటాయి. అవి కనీస అవసరాలు మాత్రమే తీర్చగలిగేలా ఉంటాయి. అవి లేకుండా మనిషి జీవించలేడు. ఇటీవల వచ్చిన "అటవీ హక్కుల చట్టం" గురించి పాలకులు ఎంత గొప్పలు చెప్పినా గిరిజనుడికి పరిమితంగానే హక్కులు లభిస్తాయి. గిరిజనులలో భాగమైన పురాతన తెగలకి సహితం హక్కులు గుర్తించటం లేదు. ఖమ్మం జిల్లా భద్రాచలం ప్రాంతంలోని గొత్తికోయలకు భూమిపై హక్కులు కల్పించలేమని అధికారులు బాహాటంగా ప్రకటిస్తున్నారు. ఇది దుర్మార్గమైన వైఖరి. ఇదంతా పాలకులు అనుసరించే తప్పుడు విధానాల ఫలితమే.

ఆదివాసీలపై సంస్కరణల ప్రభావం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సంస్కరణల ప్రభావం గిరిజనులపై ప్రతికూలంగా వుంది. అవి వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థను కుదిస్తున్నారు. సామాజిక రంగాలకు ముఖ్యంగా విద్య, వైద్య, ఉపాధి రంగాలకు నిధుల కుదింపు జరుగుతున్నది. సబ్సిడీలు ఎత్తివేస్తున్నారు. 1985లో ఎస్.సి., ఎస్.టి, బి.సిలకు రాష్ట్ర ఆదాయంలో 1.3% ఖర్చు చేయగా, సంస్కరణలు ప్రారంభమైనాక 2002-03లో ఆ ఖర్చు 0.8%కి పడిపోయింది. అన్ని రంగాలలో ప్రైవేటీకరణజరుగుతున్నది. పౌష్టికాహారం లభించడం లేదు. ఒరిస్సా, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో ఆకలి చావులకు, పౌష్టికాహార లోపాలకి గిరిజనులు గురౌతున్నారు. అలాగే, పాలకులు అనుసరిస్తున్న ఉదారవాద విధానాలవల్ల, అడవులు-భూగర్భ జలాలు-ఖనిజాలు పుష్కలంగా గల ఆదివాసీ ప్రాంతంలోకి స్వదేశీ, విదేశీ గుత్త సంస్థలు చొరబడుతున్నాయి. ఆదివాసీలను గెంటివేయడం, ఆ ప్రాంతాలను కాలుష్యభరితం చేయడం, ఖనిజ సంపదను కొల్లగొట్టడం ఉదారవాద విధానాల ఫలితమే. విశాఖ-విజయనగరం-తూర్పుగోదావరి జిల్లాల్లో వున్న బాక్సైట్ వెలికితీత పేరిట అనేక గిరిజన గ్రామాలను స్థాన భ్రంశం చేయుటకు ప్రయత్నిస్తున్నారు. పంట భూములను కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు విదేశీ కంపెనీలైన ఆల్‌ఖైమా, జిందాల్ కంపెనీలకు అటవీ ప్రాంతాలను కట్టబెట్టారు. ఆదివాసీ ప్రాంతాల గురించి రాజ్యాంగం చెప్పిన నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. ఆదివాసీల నిరసనలను పెడచెవిన పెడుతున్నారు. ఇవన్నీ ఉదార వాద విధానాల ఫలితమే.

ఆదివాసీ ప్రజల కర్తవ్యం: నేడు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారవాద విధానాల పేరుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణవిధానాలు అవలంభిస్తూ దేశ ప్రజల ప్రయోజనాలు-ముఖ్యంగా ఆదివాసీల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నాయి. వారిని అన్ని విధాలుగా దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా వీరు గతం కంటే మరింత బాధాకరమైన పరిస్థితులను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇదంతా "అభివృద్ధి" "సంక్షేమం" పేరిటనే జరిగిపోతున్నది. అందుకని ఆదివాసీలుగానీ, ఆదివాసీ సంఘాలుగానీ, సంస్థలుగానీ అప్రధాన సమస్యలను ప్రక్కన పెట్టి ఆదివాసీల ప్రధాన సమస్యలైన భూమి సమస్యను పరిష్కరించాలనీ; ఆదివాసీలను స్వస్థలాల నుండి, భూముల నుండి, అడవుల నుండి గెంటివేయరాదనీ డిమాండ్ చేయాలి. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి నిధులు అవసరమైనన్ని కేటాయించాలనీ, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, రక్షిత మంచినీరు, విద్యుత్, రహదారి సౌకర్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలనీ, ఆదివాసీ వ్యతిరేక విధానాలను విడనాడాలనీ, ప్రైవేటీకరణవిధానాలను విడనాడాలనీ, గిరిజనుల్లో ఎ, బి, సి, డి వర్గీకరణజరపాలనీ, సంస్కరణల పేరిట అమలు చేస్తున్న ప్రపంచీకరణవిధానాలను విడనాడాలనీ, 1/70 రెగ్యులరైజేషన్ సక్రమంగా అమలు చేయాలనీ, అటవీ హక్కుల చట్టంలోని ప్రజానుకూల అంశాలు, దేశంలోని గిరిజనులందరి ప్రయోజనాలకు అనుగుణంగా వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేయాలి. దీని కోసం ఆదివాసీ లందరు సమైక్యంగా, చైతన్యంతో పోరాడాలి; మొత్తం ప్రజా ఉద్యమంలో భాగంగానే ఈ ఆదివాసీ పోరాటాలు సాగాలి. అప్పుడే వారి సమస్యలు పరిష్కారం కాగలవని గుర్తించాలి.

అడుగుజాడలు

డిగ్గర్ల ఉద్యమ నేత, వ్యక్తిగతస్వామ్యం సకల రుగ్మతలకు మూలమన్న జెరార్డ్ విన్ స్టాన్లీ

"ధనికులందరూ సుఖ సమృద్ధుల్లో జీవిస్తున్నారు. యితరుల శ్రమతో సుష్టుగా తిని, చక్కటి దుస్తులు ధరిస్తున్నారు.

యిందులో... సిగ్గు పడవల్సిందే గానీ...

ఘనత ఏమీ లేదు!

ఎందుకంటే – ఒకరి నుంచి పొందడం కంటే ఒకరికి యివ్వడమే పవిత్రమైనది. కానీ, ధనికులు ప్రతిదీ రైతుల చేతుల నుంచి పొందుతారు. వాళ్ళు యిచ్చేదంతా యితరుల శ్రమ ఫలితమేగాని తమ సొంతం కాదు. అందుకని వాళ్ళే భూలోకంలోని అన్యాయపరులు."

యీ వ్యాఖ్యలు "డిగ్గర్ల" ఉద్యమ ప్రణాళిక లోనివి. 'డిగ్గర్ల' కార్యక్రమానికి విన్‌స్టాన్లీ, ఆయన సహచరులూ ఒక ప్రణాళికగా 'ఇంగ్లాండు పేద, పీడిత ప్రజల ప్రకటన' అనే శీర్షికతో దానిని ప్రచురించారు.

సెయింట్ జార్జ్ కొండ మీది తమ కార్యకలాపాలను సైద్ధాంతికంగా సమర్థించుకోవడమే ఆ ప్రణాళిక లక్ష్యం. పరస్పరం ఒకరి పట్ల మరొకరికి ప్రేమ అనే సహజమైన నియమాన్ని ఆధారం చేసుకుని, ఇంగ్లాండులోని ఉమ్మడి, గయాళు భూములను తాము దున్నాలని నిర్ణయించుకున్నట్లు ప్రణాళికలో ప్రకటించారు.

సిసలైన రిపబ్లికన్ స్వేచ్ఛ, స్వేచ్ఛాయుతమైన భూ వినియోగంలో యిమిడి వుంటుంది. భూమి విషయంలో సోదరుల (తోటి ప్రజల) స్వేచ్ఛను తొలగించే ప్రతి చట్టమూ లేక ఆచారమూ నిరాకరింపబడాలి. పరిత్యజింప బడాలి అని ప్రణాళికలో రచించారు.

ఇంగ్లీషులో డిగ్గర్లు అంటే తవ్వేవాళ్ళు అని అర్థం. పేదసాదల బృందం యిది. సెయింట్ జార్జ్ కొండమీది భూమిని, బీడు భూమిని దున్నుకునే బృందం. బీదాబిక్కిని తమతో చేరమని గ్రామాలకు వెళ్ళి ప్రచారం చేస్తూనే తెల్లవారు ఝాము నుంచి సాయంత్రం దాకా పొలంలో పనిచేసి, ఆ భూమిని చదును చేసి ఆక్రమించుకునే బృందం – వాళ్ళు తమకు 'సిసలైన సమానీకరణవాదులని', 'డిగ్గర్లు' అని పేరు పెట్టుకున్నారు. సిసలైన న్యాయాన్ని పునరుద్ధరించి, ఉమ్మడి శ్రమ, పంపిణీ, ఉమ్మడిస్వామ్యాలను ప్రవేశపెట్టాలని యీ డిగ్గర్లు కలలు కన్నారు. 1649లో 'డిగ్గర్లు' యీ భూ ఆక్రమణఉద్యమ కార్యక్రమాన్నీ, ప్రణాళికనూ ప్రకటించారు.

అప్పటికీ ఇంగ్లాండులోని లెవలర్లు అంటే సమానీకరణవాదులు బూర్జువా స్వేచ్ఛ పట్లా, ఆస్తి పట్లా ప్రశంసా భావాన్ని కలిగి వున్నారు. యీ సమానీకరణవాదుల ప్రకారం ఆంగ్ల శ్రామిక ప్రజలకు విప్లవం ఒక దోపిడీ రూపం స్థానంలో మరో దోపిడీ రూపాన్ని ప్రవేశపెట్టింది. ఆ రూపాన్ని సమానీకరణవాదులు దాచి సమర్థకులుగా వున్నారు. అందుకే దీనికి వ్యతిరేకంగా 'డిగ్గర్లు' తమను 'సిసలైన సమానీకరణవాదులని' పిలుచుకున్నారు.

యీ 'డిగ్గర్ల' ఉద్యమ ప్రణాళిక కర్త, ఉద్యమనేత జెరార్డ్ విన్‌స్టాన్లీ. యీయన లాంకషైర్‌లో జన్మించాడు. యీయన జీవితానికి సంబంధించిన సమాచారం అతి తక్కువగానే లభించింది. 1609 అక్టోబర్ 10న లాంకషైర్ పారిస్ చర్చిలో ఆయనకు నామకరణజరిగింది. జెరార్డ్ విన్ స్టాన్లీ తండ్రి నూలు, సిల్కు వస్త్రాల వర్తకుడు. అంగడిలో అమ్ముకునే చిన్న వర్తకుడు. తన తండ్రి ఆర్థిక స్తోమతను బట్టి కొద్దిపాటి విద్యను, అదీ గ్రామీణపాఠశాలలలో కొద్ది సంవత్సరాలు నేర్చుకున్నాడు. విన్ స్టాన్లీకి షేక్‌స్పియర్ రచనలతోనూ, థామస్ మూర్ 'ఉటోపియా'తోనూ పరిచయం వుండి వుంటుందని, ఆయన 'ఇంగ్లాండు ఒక జైలు' అంటూ చేసిన ఒక ప్రకటనను బట్టి ఆయన జీవిత గాథను పరిశీలించిన వారు ఊహించారు.

1630 దశాబ్దంలో విన్ స్టాన్లీ ఇంగ్లాండులో వ్యాపారం నేర్చుకుంటూ వుండేవాడు. 1640 దశకంలో లండన్‌లో సొంత వ్యాపారం ప్రారంభించాడు. ఇంగ్లాండు అంతర్యుద్ధం ఫలితంగా ఆయన వ్యాపారం దివాళా తీసింది. జీవనాధారం కోసం సర్రే ప్రాంతంలో తన మిత్రుల ఆశ్రయం పొందాడు. పొట్ట పోసుకోవడానికి తమ పొరుగువారి పశువుల కాపరిగా పనిచేశాడు. 1643 నుంచి 1648 దాకా నిరుపేదగా జీవించాడు. ఆ దశలో నిరుపేద ఆంగ్లేయుల కష్టాలనూ, ఆకాంక్షలనూ తెలుసుకున్నాడు.

1648 డిసెంబర్‌లో 'బకింగ్ హామ్ షైర్‌లో ఉజ్వలకాంతి' అనే శీర్షికతో 'బకింగ్ హామ్ షైర్'లో ఉజ్వలకాంతి లేక ప్రధాన కారణాల ఆవిష్కరణ; ప్రపంచంలో, ప్రధానంగా ఇంగ్లాండులో సమస్త బానిసత్వానికి మూల కారణం; పేదలూ, పీడితులూ అయిన ఆంగ్లేయులందరికీ అంతేగాక లార్డ్ ఫెయిర్ ఫాక్స్ నాయకత్వంలో వున్న ప్రస్తుత సైన్యపు పరిశీలనకీ చేసిన ప్రకటన' అనే పెద్ద ఉప శీర్షికతో చిన్న పుస్తకం ప్రచురించారు. రాజాధికారానికి, మొదటి చార్లెస్ నిరంకుశ పాలనను క్రియాశీలకంగా సమర్థించిన చర్చికి వ్యతిరేకంగా దానిని రాశారు. రచయిత పార్లమెంటును సైతం నమ్మవద్దని జనాన్ని హెచ్చరించాడు. ఎవరినైతే రాజ్యాధికారం ఎదుర్కొనే స్థితిలో పడిందో, ఆ అసంతృప్తి, పీడిత ప్రజల మూలంగా పార్లమెంటు ఏర్పాటు చేయబడిందని చెప్పాడు. పార్లమెంటు చక్రవర్తి అధికారాన్ని పటిష్టం చేసిందని, జనం స్వేచ్ఛను సాధించుకున్నామని భావించినా, వాస్తవంలో వాళ్ళు పార్లమెంటు అనే సాధనం ద్వారా తమ స్వేచ్ఛను కోల్పోయారని రాశారు. యీ పుస్తకం విశేష ప్రచారం పొంది, త్వరలోనే ద్వితీయ ముద్రణజరిగింది.

వి. రంగారావు

దీని నేపథ్యాన్ని పరిశీలిస్తే – 17వ శతాబ్దం మధ్య కాలం నాటి ఆంగ్ల బూర్జువా విప్లవం మూలంగా దేశం రెండు శిబిరాలుగా చీలింది. మొదటి శిబిరం రాజు అధికారం చుట్టూ వున్న ఫ్యూడల్ ప్రభు వర్గం, సాంప్రదాయక చర్చి. రెండవ శిబిరం పార్లమెంటు నాయకత్వాన పట్టణాలకూ, గ్రామాలకు చెందిన వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గం, చేతి వృత్తుల వాళ్ళూ, రైతాంగ, అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ సంబంధాల కులీన వర్గం. పార్లమెంటు రాజును ఓడించింది. ఫ్యూడల్ వ్యవస్థను వ్యతిరేకించి, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛాయుత పెరుగుదల శ్రామిక ప్రజలకు బాగా మేలైనదని భావించింది. ఆలివర్ క్రాంవెల్ పార్లమెంటుకు నాయకుడు. ఆయన కొత్త ఆదర్శ సైన్య నిర్మాత. సైన్యంలో అర్హతను బట్టి పదవులు పొందారు. బూర్జువావర్గం సైనిక విజయాల మూలంగా తన లక్ష్యాలను సాధించుకున్నది. రాజును అరెస్టు చేసి ఆయన, ఆయన అనుచరుల పొలాలు, ఆస్తులను జప్తు చేశారు. యివి అధిక శాతం బూర్జువావర్గం, కులీనుల చేతుల్లోకి పోయాయి. పట్టణాలకూ, గ్రామాలకూ చెందిన పేదలకు ఏమీ ప్రయోజనం చేకూరలేదు. పైగా యుద్ధ భారాల మూలంగా గతం కంటే మరింతగా హీనస్థితిలోకి వెళ్ళారు. జన సామాన్యుల్ని కొత్త కులీన వర్గం వదిలివేసింది. వారి డిమాండ్లను పట్టించుకోలేదు. రైతుల్లో, చేతివృత్తిదారుల్లో, సైనికుల్లో అసంతృప్తి చెలరేగింది. యీ క్రమంలోనే 1647 నాటికి కొత్త కులీన (బూర్జువా) వర్గానికి, గ్రామీణప్రాంతాల పేదలతో కూడిన సామాజిక విభాగాల సమావేశానికి తీవ్ర వైరుధ్యం కనపడింది. పార్లమెంటరీ పార్టీలోనే మితవాద బూర్జువాలు, తీవ్ర ప్రజాతంత్ర వాదులు (లెవెలర్లు)గా విభజన ఏర్పడింది. యీ పరిణామ క్రమంలోనే 1648లో విన్‌స్టాన్లీ మొదటి చిన్న రచన వెలువడింది. 1649లో డిగ్గర్ల ఉద్యమం ఆరంభించారు. తరువాత లండన్‌కు చేరి కలం పట్టి రచనకు వుపక్రమించాడు.

1649 లో 'న్యాయానికి సంబంధించిన కొత్త నియమం' పుస్తకం ప్రచురించారు. సాంఘిక చెడులకు ప్రధాన కారణం వ్యక్తిగత ఆస్తి అని అందులో పేర్కొన్నారు. వ్యక్తిగత ఆస్తి మనుషులను నేరం చేసేందుకు నడిపించి, అటు తర్వాత వాళ్ళు నేరస్థులైనందుకు వాళ్ళను చంపుతుందని పేర్కొన్నారు. అందుకే భూమి ఉమ్మడి వినియోగంగా వుండాలని, సమిష్టి శ్రమే ప్రతి ఒక్కరినీ దారిద్ర్యం నుంచి కాపాడి, అందరికి శాంతి, సంతోషాలను తెచ్చి పెడ్తుందని పరిష్కారాన్ని చెప్పారు. యీ 'సిసలైన సమానీకరణవాదులు' తమ వ్యక్తిగత ఆదర్శం ద్వారా జనాన్ని ఆకర్షించాలని, ప్రచారమే కార్యాచరణగా ప్రధానంగా ఎంచుకున్నారు.

1649 ఎప్రిల్ 8న 'డిగ్గర్ల' తొలి కాలనీని నెలకొల్పేందుకు 25 మందిని తయారు చేశారు. డిగ్గర్ల పలుకుబడి పెరుగుతుందని పార్లమెంటు డిగ్గర్ల నాయకులను వేధించింది. 1649 జూలైలో స్థానిక అధికారులు వీళ్ళను ప్రాసిక్యుషన్ చేశారు. విన్‌స్టాన్లీని, మరో యిద్దరిని ఆస్తి హక్కును భంగ పరిచారని నేరారోపణచేసి కింగ్‌స్టన్‌లోని కోర్టులో హాజరు పరిచారు. ప్రతివాదుల వాదాన్ని వినకుండా కోర్టు వీరికి జరిమానా విధించింది. డిగ్గర్ల మొత్తం అందరి ఆస్తికంటే జరిమానా ఎక్కువగా వుంది. జరిమానా చెల్లించక పోతే భూమి నుంచే బలవంతాన తొలగించే అవకాశం పొందింది. దీంతో విన్‌స్టాన్లీ, డిగ్గర్లూ మరోచోటకు పోయారు. వారికి ఎక్కడా శాంతి లభించలేదు. డిగ్గర్ల కార్యకలాపాలు పెరుగుతాయని భూస్వాములు గాభరాపడ్డారు. ఆ కాలంలోనే వ్యవసాయ కమ్యూన్లు కొన్ని యితర రాష్ట్రాల్లో కూడా నెలకొల్పారు. యీ క్రమంలోనే 'ఇంగ్లాండు పేద, పీడిత ప్రజల ప్రకటన' అనే పేరుతో డిగ్గర్లు తమ ప్రణాళికను విడుదల చేశారు.

1649లో విన్‌స్టాన్లీ చిన్న పుస్తకాలను ప్రచురించాడు. 'వాల్టన్‌కి చెందిన విలియం స్టార్, జాన్ టేలర్ల రక్తప్లావిత, క్రీస్తు మత విరుద్ధ నర్తనను గురించిన ప్రకటన', 'లార్డ్ జనరల్‌కి, ఆయన యుద్ధ మంత్రి మండలికి', కామన్స్ సభకు ఒక విజ్ఞప్తి', 'లండన్ నగరానికీ, సైన్యానికి ఒక హెచ్చరిక'. యీ పుస్తకాలలో సామాన్యులు ఉమ్మడి భూములు కలిగి వుండే హక్కును సమర్థించాడు. డిగ్గర్ల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారని, వాళ్ళను హింసిస్తున్నారని వివరించాడు. లండన్ నగరానికి, సైన్యానికి హెచ్చరిక పుస్తకంలో పేద రైతులకీ, సంపన్న భూస్వాములకూ మధ్య భూమి కోసం జరిగిన పోరాటాన్ని ఆయన స్పష్టంగా వివరించాడు.

1652లో తన చివరి రచన 'స్వేచ్ఛానియమం'లో డిగ్గర్ల ఉద్యమం నహేతుకమైనదనీ, న్యాయమైనదనీ నిరూపించేందుకు ప్రయత్నించాడు. భూమి, దాని నుంచి లభించే ఫలదాయాల ఉమ్మడి వినియోగం మీద ఆధారపడిన సమాజ నిర్మాణానికి ఆయన పథకాన్ని అందులో విపులీకరించాడు. యీ సమాజాన్ని ఏదో సుదూర భవిష్యత్తుకి, తెలియని దేశానికి చెందినదిగా కాక, ఇంగ్లాండులో, వెంటనే సాధించబడాలని ఆయన భావించాడు. యీ పుస్తకం థామస్ మూర్ 'ఉటోపియా'తోనూ, కాంపెనెల్లా 'సూర్యనగరం'తోనూ, 16, 17 శతాబ్దాల ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంత కర్తల రచనలతోను సరిపోల్చదగినది.

జెరార్డ్ విన్‌స్టాన్లీ తన రచనలో మనుషులందరికి ఆదిమ సమానత్వం, ప్రతీ మనిషికీ భూమి కలిగివుండే హక్కు కావాలని కోరాడు. శ్రమను సంపదకు ఏకైక మూలంగా గుర్తించాడు. సామాజిక రుగ్మతలకు భూమిపై వ్యక్తిగత స్వామ్యమే కారణం అని వాదించాడు. పేదల కోసం వ్యక్తిగతస్వామ్యం లేని రిపబ్లిక్ నెలకొల్పాలని ప్రతిపాదించాడు. అస్పష్టంగానైనా ఆయన కమ్యూనిస్టు సమాజపు ఆకాంక్షలను వ్యక్త పరిచాడు.

17వ శతాబ్దం నాటికి ఇంగ్లాండులో పట్టణనిరాస్తి శ్రామికులు, గ్రామీణశ్రామికులు తగిన బలం లేక పోవడం వలననే 'డిగ్గర్ల' ఉద్యమం సఫలం కాక పోవడానికి ఒక మూలకారణమని విశ్లేషకుల అంచనా. రెండు శతాబ్దాల ముందుగానే ఆయన సమాజపు అంచనాలను వెల్లడించాడు. సమాజ పరిణామం కంటే ముందు నడిచాడు.

1652 తరువాత యీయన గురించిన సమాచారం లభించలేదు. విన్‌స్టాన్లీ 1676 సెప్టెంబర్ 10న మరణించాడని అంచనా వేశారు.

జెరార్డ్ విన్‌స్టాన్లీ ఆదర్శ రాజ్య స్వాప్నికుడు. ఉద్యమకర్త. ఆయన అడుగుజాడా, స్వాప్నికత భావితరాల ఆలోచనా, సైద్ధాంతిక దృక్పథాలకు ప్రాతిపదిక.

ద్రవ్యోల్బణం - అధిక ధరలు - ఆహార భద్రత

(15.06.08 సంచిక తరువాయి)

అంతర్జాతీయంగా ముడి చమురు ధర యిటీవల సం॥లలో ఎన్నడూ లేనంత వేగంగా గత సం॥లో పెరిగింది. బ్యారలు ధర 2007 ఆగస్టులో 70 డాలర్లు వుండగా, నేడది రెట్టింపుకు పైగా పెరిగింది. ముడి చమురు ధర పెరిగిన ప్రభావం దాదాపు అన్ని సరుకులపై వుంటోంది. దీని వల్ల సరుకుల రవాణా ఖర్చులు పెరుగుతాయి. వ్యవసాయరంగంపై దీని ప్రభావం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వుంటోంది. రసాయనిక ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వాడకం ప్రపంచ వ్యాపితంగా పెరుగుతోంది. ట్రాక్టర్లు, కంబైన్లు, హార్వెస్టర్లు, బావులకు వాడే డీజిలు యింజన్లకు ఆయిలు కావాలి. ఆ విధంగా వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. రవాణా ఖర్చులు పెరుగుట వల్ల, ఆహార ధాన్యాల ధరలు మరింతగా పెరుగుతున్నాయి.

భారతదేశం, చైనా దేశాల్లో వినియోగం ఎక్కువగా వుండుట వల్లే డిమాండ్ పెరిగి, ఆయిలు ధరలు పెరుగుతున్నాయనే అమెరికా అధ్యక్షుడి వాదన వాస్తవం కాదు. ముడి చమురు ధర పెరుగుదలకు భారత, చైనా దేశాలలో పెరిగిన డిమాండ్ కారణమన్న వాదనను కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి మురళీ దేవరా ఖండించాడు. భారత్, చైనా దేశాలు ప్రపంచ జనాభాలో మూడో వంతుపైగా వున్నప్పటికీ, పెట్రోలియం వినియోగంలో 8వ వంతు కంటే తక్కువగా వుందని పేర్కొన్నారు. అమెరికాలో ఏడాదికి తలసరి సగటు వినియోగం 69 బ్యారళ్లు వుండగా, చైనాలో 4 బ్యారళ్లు, భారతదేశంలో 2 బ్యారళ్లు మాత్రమే వుంది. ప్రపంచంలో గత ఏడాది డిమాండ్ 1.2 శాతం మాత్రమే పెరగగా, ఈ ఏడాది 1 శాతం మాత్రమే పెరుగుతుందని 'అంతర్జాతీయ ఇంధన సంస్థ' అంచనా వేసింది. డిమాండ్ కంటే, సరఫరా తక్కువ వుండుట వల్లే ధరలు పెరిగాయనేది కూడా వాస్తవం కాదు. "ముడి చమురు సరఫరా, డిమాండ్‌ల మధ్య వ్యత్యాసం లేదు. అదనపు ఉత్పత్తిని యిముడ్చు కొనుటకు అదనపు డిమాండ్ లేద"ని 'పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ' (ఒపెక్) అధ్యక్షుడు ఛాకిబ్ ఖెలిల్ పేర్కొన్నాడు. ముడి చమురు ధర నిలకడగా వుంటే 2017 నాటికి, అంచనా వేసిన ధరల కంటే, గోధుమల ధర 7 శాతం, వంట నూనెల ధర 10 శాతం తక్కువగా వుంటాయని 'ఆహార, వ్యవసాయ సంస్థ' 2008 వార్షిక నివేదికలో పేర్కొంది.

పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల ప్రభావం ద్రవ్యోల్బణం పెరుగుదలపై గణనీయంగా వుంటోంది. దేశంలో పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం జూన్ 5న పెంచింది. దీనివల్ల ద్రవ్యోల్బణం జూన్ 14కు 11.42 శాతానికి పెరిగింది. ఈ వారంలో పెరిగిన ద్రవ్యోల్బణంలో 94 శాతం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగుట వల్లనే పెరిగింది. కనుక, ధరల పెరుగుదలకు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగుట ఒక ముఖ్యమైన కారణంగా వుంది.

ఫ్యూచర్స్ ట్రేడింగ్ - సట్టా వ్యాపారం

ప్రపంచీకరణలో భాగంగా ఆహారధాన్యాల వ్యాపారంలో కూడా కార్పొరేట్ సంస్థలనూ, బహుళజాతి సంస్థలనూ అనుమతించారు. చివరికి చిల్లర వ్యాపారంలో కూడా అనుమతించారు. దేశ కార్పొరేట్ సంస్థలైన రిలయన్సు, తదితర సంస్థలతోపాటు, బహుళజాతి సంస్థలైన కార్గిల్, ఆగ్రోటెక్ లాంటి సంస్థలు ప్రేశించాయి. ఇవి ఉత్పత్తిదారులైన రైతాంగాన్నీ, వినియోగదారులనూ విచ్చలవిడిగా దోపిడీ చేస్తూ, అత్యధిక లాభాలు గడిస్తున్నాయి. బహుళజాతి సంస్థలు అంతర్జాతీయ వ్యాపారాన్ని కంట్రోలు చేస్తున్నాయి. ధరలు పెంచి, విపరీతంగా లాభాలు పొందుతున్నాయి.

ఆహారధాన్యాల ధరలు, ఆయిలు ధరలు పెరుగుటలో ముందస్తు వ్యాపార లావాదేవీలు (ఫ్యూచర్స్ ట్రేడింగు, ఫార్వర్డ్ ట్రేడింగు) పేరిట కొనుగోలు చేసి, లక్షలు, కోట్ల కొద్దీ టన్నులు నిల్వలుంచుతున్నారు. సరఫరా, డిమాండ్‌ల మధ్య కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. వాణిజ్యపరమైన జూదం ఆడుతూ ఇష్టం వచ్చినట్లుగా ధరలు పెంచి, లాభాల మీద లాభాలు గడిస్తున్నారు. ఫ్యూచర్స్ ట్రేడింగ్ చట్టం 2003లో అమలులోకి వచ్చింది. 2003-04 సం॥లో 103 రకాల సరుకులు దీని పరిధిలోకి తెచ్చారు. మొదటి సం॥లో 1.29 లక్షల కోట్ల వ్యాపారం జరగగా, నేడు అది దాదాపు 60 లక్షల కోట్ల వ్యాపారానికి చేరుకుంది. ఇది దేశ స్థూల జాతీయోత్పత్తి 4 రెట్ల కంటే ఎక్కువ. ఆహారధాన్యాలను కూడా 2003-04 సం॥లో ఫ్యూచర్స్ మార్కెట్‌లోనికి అనుమతించారు. ఇది కేవలం 3 సం॥లలోనే 1570 శాతం పెరిగింది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో 4.7 శాతం నుండి 76.8 శాతానికి పెరిగింది. దీనివల్ల గతంలో అక్రమంగా నిల్వ వుంచుకునే దొంగ నిల్వలకు చట్ట బద్ధత లభించింది. ప్రస్తుతానికి ఆహార ధాన్యాల ఫ్యూచర్స్ ట్రేడింగును తాత్కాలికంగా నిషేధించినా, వున్న నిల్వలపై ఏ విధమైన చర్య ప్రభుత్వం తీసుకోలేదు. ప్రపంచీకరణదశలో సరుకుల మార్కెటు, ఫైనాన్షియల్ మార్కెటు, ఉత్పత్తి కారకాలు ఒక దానితో మరొకటి మిళితమై, లోతుగా పెనవేసుకొని వున్నాయి. అమెరికాలో సబ్‌ప్రైమ్ సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయ సట్టా (స్పెక్యులేటివ్) పెట్టుబడి వచ్చిన నష్టాలు పూడ్చుకొని, ఎక్కువ లాభాలు సంపాదించుటకు ఆహారధాన్యాలు, ఆయిలు ఫార్వర్డ్ మార్కెట్ వ్యాపారంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించింది. సట్టా వ్యాపారం వల్ల అయిలు ధరలు 60 శాతం పైగా పెరిగాయని అంచెనా. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ సట్టా పెట్టుబడి వ్యాపారం ధరలు పెరుగుటకు ఒక ముఖ్య కారణంగా వుంది.

వేములపల్లి వెంకట్రామయ్య

ముడి చమురు ధరలు విపరీతంగా పెరగటానికి "సట్టా వ్యాపారం, డాలరు విలువలో ఒడిదుడుకులు" కారణంగా 'ఒపెక్' అధ్యక్షుడు ఛాకిబ్ ఖెలిల్ పేర్కొన్నారు. "అంతర్జాతీయ గుత్త పెట్టుబడి సంస్థలూ, వ్యాపారులూ, ఆయిలును సట్టా వ్యాపారంలోకి నెట్టి గత రెండేళ్లుగా అపారమైన లాభాలు గడించార"ని సౌదీ అరేబియా ఆయిలు మంత్రి సలహాదారు ఇబ్రహీం ముహన్నా పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం జూన్ 23న జరిగిన జడ్డాలో జరిగిన క్రూడాయిలు ఉత్పత్తి చేసే దేశాల, వినియోగించే దేశాల మంత్రుల సమావేశంలో యిలా మాట్లాడారు. "పెద్ద ఆర్థిక సంస్థలు, పెన్షన్ ఫండ్స్, హెడ్జి ఫండ్స్ వంటివన్నీ తమ వద్ద వున్న వందల కోట్ల డాలర్లను నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలపై పెట్టుబడి పెట్టేందుకు తరలిస్తున్నాయి. ఈ సందర్భంగా నియంత్రణలేని లావాదేవీలు జరగడం సహజంగానే జరిగి పోతోంది. ఈ తరహా ఫండ్స్ వల్ల ఆయిలుకు బాగా డిమాండ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు పెరుగుటకు, ప్రపంచ దేశాలలో పెరుగుతున్న డిమాండ్ కారణం కాదు. "ఇది పూర్తిగా స్పెక్యులేటివ్ డిమాండ్. దీని వల్ల పెట్రో ధరలు పెరిగిపోయి, మూడో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు చితికి పోతున్నాయి". చివరకు అమెరికా సెనేట్ శాశ్వత సబ్ కమిటీ నివేదిక (జూన్ 2006) (ఆయిల్, గ్యాస్ ధరల పెరుగుదలలో మార్కెటు స్పెక్యులేషన్ పాత్ర) "ప్రస్తుత మార్కెట్‌లో ఫ్యూచర్స్ ఒప్పందాలలో పెద్ద ఎత్తున పెట్టుబడి స్పెక్యులేషన్ వల్ల గణనీయంగా ధరలు పెరిగాయనే దానికి తగిన ఆధారాలున్నాయ"ని పేర్కొన్నది.

నిర్వీర్యమవుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ

ప్రజలకు ఆహారం పొందుట మానవ హక్కులలో ముఖ్యమైనది. అది వారి ప్రాథమిక హక్కు. ప్రజలకు ఆహారాన్ని అందించాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వాలది. పెట్టుబడిదారీ మార్కెటు వ్యవస్థలో వచ్చే ఒడుదుడుకుల నుండి సాధారణప్రజలను ఆదుకొనుటకు ప్రజా పంపిణీ వ్యవస్థ ముఖ్యమైన సాధనం. ఆహార ధరలు ఆకాశన్నంటుతూ, ఆహార సంక్షోభం పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి, దృఢంగా అమలు చేయుట ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. కానీ, ప్రజా సంక్షేమాన్ని గురించి నిత్యం జపం చేసే పాలకవర్గాలు ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, ఓట్ల రాజకీయ జూదంలో ఒక పావుగా వినియోగించుకుంటున్నాయి. 1990 దశకంలో పాలకవర్గాలు చేపట్టిన సరళీకరణవిధానాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం, ప్రపంచ బ్యాంకు విషమ షరతులు - దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను బలంగా దెబ్బతీశాయి. సబ్సిడీలు గణనీయంగా తగ్గించి, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యం, గోదుమలు, చక్కెర, గ్యాసునూనెల ధరలు విపరీతంగా పెంచాయి. లక్షిత లబ్ధిదారుల పేరిట దారిద్ర్యరేఖకు దిగువన వున్న వారి సంఖ్యను బాగా కుదించాయి. మిగిలిన వారికి సరఫరా చేసే వాటి ధరలు దాదాపు మార్కెటు రేటుకు పెంచాయి. ఫలితంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వినియోగించే ఆహారధాన్యాలు బాగా తగ్గాయి. కేంద్ర ఆహార సంస్థ ద్వారా సేకరించే ఆహార ధాన్యాలు తగ్గి, నిల్వలు కూడా బాగా తగ్గిపోయాయి. ప్రజాపంపిణీ వ్యవస్థను పాలకవర్గాలు పథకం ప్రకారం నిర్వీర్యం చేయుట వల్ల, సామాన్యుల బ్రతుకులు మరింత దుర్భరమవుతున్నాయి.

భారతదేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ఎంత బలహీనంగా వుందో ప్రభుత్వ అధికారిక నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలోని లొసుగులను 2004-'05లో ప్రభుత్వం విడుదల చేసిన "ప్రజాపంపిణీ వ్యవస్థ - ఇతర వనరుల ద్వారా కుటుంబాల వినియోగం" నివేదిక వెల్లడిస్తోంది. దేశంలో 70.5 శాతం మందికి ఏ విధమైన కార్డులు లేవు లేదా దారిద్ర్యరేఖకు ఎగువనవున్న వారికి యిచ్చే కార్డు లున్నాయి. వీరిని ఆచరణలో వాస్తవంగా ప్రజాపంపిణీ వ్యవస్థ నుండి మినహాయించుట జరిగింది. బీహారులో 82 శాతం, అస్సాంలో 87.7 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 83.5 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 83.2 శాతం, రాజస్థాన్‌లో 81.5 శాతం, ఉత్తరాంచల్‌లో 74.3 శాతం, నాగాలాండులో 90 శాతం మందికి కార్డులు లేవు లేదా దారిద్ర్యరేఖకు ఎగువన వున్న కార్డులున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 56.5 శాతం, కర్నాటకలో 51.7 శాతం మందికి దారిద్ర్యరేఖకు దిగువన యిచ్చే తెల్లకార్డు లున్నాయి.

దేశంలోని వ్యవసాయ కూలీలలో 52 శాతం మందికి తెల్లకార్డులు లేవు లేదా దారిద్ర్య రేఖకు ఎగువన వుండే వారికి యిచ్చే కార్డులున్నాయి. మణిపూర్‌లో 96 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 73 శాతం, బీహారులో 71 శాతం, రాజస్తాన్, అస్సాంలో 68 శాతం వ్యవసాయ కూలీలకు దారిద్ర్యరేఖకు దిగువున వుండే వారికి యిచ్చే కార్డులు లేవు. వ్యవసాయ కూలీలలో 70 శాతం మంది తెల్లకార్డులకు అర్హులు కాదా? ఆంధ్రప్రదేశ్, కర్నాటక, జమ్మూ & కాశ్మీర్, త్రిపుర రాష్ట్రాలలో మూడింట రెండొంతులు, అంత కంటే ఎక్కువ మందికి తెల్లకార్డులున్నాయి.

అస్సాం, బీహారు, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ & కాశ్మీరు, పంజాబు, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని గ్రామీణప్రాంత దళితులలో 70 శాతం, అంతకంటే ఎక్కువ మందికి తెల్లకార్డులు లేవు లేదా దారిద్ర్య రేఖకు ఎగువన వుండే కార్డులున్నాయి.

ఆదివాసులలో అస్సాంలో 90 శాతం, అరుణాచల్‌ప్రదేశ్‌లో 79 శాతం, ఛత్తీస్‌ఘడ్‌లో 68 శాతం మందికి కార్డులు లేవు లేదా దారిద్ర్యరేఖకు ఎగువున వున్న కార్డులున్నాయి. గ్రామీణప్రాంత ఆదివాసీ కుటుంబాలలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్, మహారాష్ట్రలలో 50 శాతం మందికి పైగా తెల్లకార్డులు లేదా అంత్యోదయ కార్డులున్నాయి.

భూమిలేని లేక దాదాపు భూమి లేని కుటుంబాలలో సిక్కింలో 86 శాతం, గోవాలో 80 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 79 శాతం, హర్యానాలో 76 శాతం, జార్ఖండ్‌లో 75 శాతం, ఉత్తరాంచల్‌లో 74 శాతం మందికి తెల్లకార్డులు లేదా అంత్యోదయ కార్డులు లేవు. వీరంతా ఆ విధంగా ప్రజాపంపిణీ వ్యవస్థ నుండి మినహాయించబడ్డారు.

అధికారిక లెక్కల ప్రకారం నెలకు మనిషికి రూ. 360 కంటే తక్కువ ఆదాయం కల కుటుంబాలు, దారిద్ర్యంలో వున్న కుటుంబాలుగా పరిగణిస్తారు. ప్రభుత్వ ఆదాయ పరిమితి ప్రకారం దారిద్ర్యరేఖకు

సోషలిస్టు విప్లవం అంటే ఏమిటి?

బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గం సాయుధంగా తిరుగుబాటు చేసి బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించి కార్మికవర్గం అధికారంలోకి రావడాన్ని సోషలిస్టు విప్లవం అంటారు. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలు ప్రధానంగా రెండు పెద్ద వర్గాలుగా విభజింపబడతారు. ఒకటి కార్మికవర్గం. అంటే తమ శ్రమశక్తిని రోజూ అమ్ముకొంటే తప్ప జీవించలేని వర్గం. ఎలాంటి ఆస్తిలేని వర్గం. రెండోది బూర్జువావర్గం. నిరంతరం లాభాల వేటలో పడి కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేస్తూ సంపదను పోగేసే వర్గం. ఫలితంగా సమాజంలోని సమస్త ఉత్పత్తి సాధనాలు - అంటే భూములు, ఫ్యాక్టరీలు మొదలైన పెట్టుబడులు మొత్తం కొద్ది మంది పెట్టుబడిదారుల వద్ద కేంద్రీకృతమవుతాయి. ఇతర మధ్యస్థ వర్గాలన్నీ అంతకంతకు దివాళాతీసి కార్మికవర్గంలో కలుస్తాయి. సమాజంలో బూర్జువా వర్గం తన బానిసలైన కార్మికవర్గాన్ని పోషించలేని స్థితికీ, జీవించలేని స్థితికి చేరుస్తుంది. కార్మికవర్గం ఇక తిరుగుబాటు చేయడం తప్ప మరొక మార్గంలేని స్థితికి చేరుతుంది. అలాంటి పరిస్థితినే విప్లవకర పరిస్థితి అంటారు. అప్పుడు కార్మికవర్గం సాయుధ తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకొంటుంది. కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పరుస్తుంది. సమాజంలోని సమస్త ఉత్పత్తి సాధనాలను భూములను, ఫ్యాక్టరీలను, పెట్టుబడులను సమాజపరం చేస్తుంది. వ్యక్తిగత ఆస్తులు - దోపిడీకి తోడ్పడే ఆస్తులు - ప్రధానంగా రద్దు చేయబడతాయి. దీనినే సోషలిస్టు విప్లవం అంటారు.

కార్మికవర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం సోషలిస్టు విప్లవం ద్వారా పరిష్కరించబడుతుంది.

1917 అక్టోబర్ 17న రష్యాలో కార్మికవర్గం సాయుధ తిరుగుబాటు చేసి బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించింది. కార్మికవర్గం అధికారంలోకి వచ్చింది. కార్మికవర్గం అధికారంలోకి రాగానే అంటే అప్పటి వరకు ఉన్న రాజ్యాంగ వ్యవస్థను పూర్తిగా రద్దు పరిచింది. రాజ్యాంగ వ్యవస్థలోని - సైన్యం, పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం, జైళ్ళూ, కోర్టులను సమూలంగా రద్దు చేసింది. కొత్త సైన్యాన్ని, పోలీసులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని, జైళ్ళను, కోర్టులను ప్రజల నుండి ప్రజల ఆధ్వర్యంలో ఏర్పరిచింది. వాటినే సోవియట్స్‌గా పిలిచారు. ప్రజల ప్రత్యేకంగా కార్మికవర్గ పరిపాలనా సంస్థలుగా సోవియట్లు ప్రజల నుండి ఎన్నికయ్యాయి. అప్పటి రష్యాలోని ఫ్యాక్టరీలు, పెట్టుబడులను, విదేశీ పెట్టుబడులను సమాజపరం చేశారు. పెద్ద పెద్ద భూస్వామ్య ఎస్టేట్‌ల క్రింద గల భూములను జాతీయం చేశారు. రైతులు దున్నుకోవడానికి భూములను పంచారు. అంటే ఆ నాటికి రష్యాలో గ్రామీణప్రాంతంలో చిన్న చిన్న రైతులు చాలీచాలని భూములను కలిగి ఉన్నారు. లేదా అర్థబానిసలుగా కూడా ఉన్నారు. అందువలన వ్యవసాయంలో మొత్తం భూములను సమాజపరం చేసే స్థాయికి అప్పటికి అభివృద్ధి చెందలేదు. మొదట రైతులకు భూములు పంచి వ్యక్తిగతంగా సాగుచేసుకొనే వ్యవసాయ కేంద్రాలను యేర్పరచారు. ఆ తరువాత వాటిని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా అభివృద్ధి చేశారు. 1917లో విప్లవం విజయవంతమయితే 1933 నాటికి వ్యవసాయంలో సమిష్టి వ్యవసాయక్షేత్రాలను అభివృద్ధి చేయగలిగారు. అంటే ఆనాటికి భూమి అనే ఆస్తి రెండు పద్ధతులలో నిర్వహణలో ఉంది. మొదటి

సుధీర్

రకం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండే ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు. రెండవ రకం రైతుల సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు. రైతుల చైతన్యస్థాయి, ఉత్పత్తి స్థాయిని బట్టి పై పద్ధతులను అనుసరించారు.

రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయినా విప్లవానికి ముందు ఇతర పెట్టుబడిదారీ దేశాల కంటే చాలా వెనుకబడి వుంది. వ్యవసాయంలో మరింత వెనుకబడి ఉంది. ఒక వైపు వేల ఎకరాల భూమి పెట్టుబడిదారీ భూస్వాముల ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతులలో వ్యవసాయ సాగు ఉంది. మరొకవైపు చిన్న చిన్న రైతుల క్రిందనూ, అర్ధబానిస పద్ధతులలోనూ వ్యవసాయ ఉత్పత్తి సాగింది. అందువలన రష్యాలో సోషలిస్టు విప్లవానంతరం ఆస్తుల స్వరూపం ప్రత్యేకించి భూములపై యజమాన్య నిర్వహణవ్యక్తిగత స్థాయి నుండి సమిష్టి స్థాయికి, ప్రభుత్వ స్థాయికి అభివృద్ధి చెందడానికి చాలా కాలం పట్టింది. తగినంత సోషలిస్టు చైతన్యం రైతులలో రాక పోవడం వలనా, బలవంతపు పద్ధతులను కొంత మేరకు అనుసరించడం వలనా రష్యాలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసే సందర్భంలో రైతుల నుండి తీవ్ర ప్రతిఘటనలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన లోపాలను, తప్పులను కా॥ స్టాలిన్ నాయకత్వాన బోల్షివిక్ పార్టీ సమీక్షించింది. గుణపాఠాలు తీసింది.

చైనాలో 1949లో నూతన ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పడింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడింది. 1956 నాటికి చైనాలో సోషలిస్టు విప్లవాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు జాతీయ బూర్జువావర్గ ఆస్తులను అంటే పరిశ్రమలను, పెట్టుబడులను, పెటీ బూర్జువా వర్గం ఆస్తులను వారే నిర్వహించుకొనే విధంగా అనుమతి ఇచ్చింది. గ్రామీణప్రాంతంలో దున్నే వానికి భూమి అనే ప్రాతిపదికపై రైతులకు భూములను పంచారు. అందువలన గ్రామీణప్రాంతంలో చిన్న రైతులను, మధ్యతరగతి రైతులను, ధనిక రైతులను అనుమతించారు. అంటే 1956 వరకు చైనా కార్మికవర్గ నాయకత్వాన కార్మిక-కర్షక మైత్రీ ఆధారంగా ప్రభుత్వం వున్నా వ్యక్తిగత ఆస్తులు ఉండి పెట్టుబడిదారీ పద్ధతులను, విధానాలను అనుమతించింది. కారణం చైనా సామాజిక వ్యవస్థ అభివృద్ధి స్థాయి వెనుకబడి ఉండటమే. సోషలిస్టు విప్లవ స్థాయికి చేరుకోక పోవడం వలననే.

1956 తర్వాతనే చైనాలో సోషలిస్టు విప్లవాన్ని ప్రారంభించారు. జాతీయ బూర్జువా వర్గ ఆస్తులన్నింటినీ ప్రధానంగా శాంతియుత పద్ధతులలోనే జాతీయం చేయడం జరిగింది. జాతీయ బూర్జువా వర్గాన్ని క్రమ పద్ధతులలో చైతన్య పరచడం, నచ్చ చెప్పడం పద్ధతులలో పరివర్తన చెందింపచేశారు. గ్రామాలలో రైతుల వ్యక్తిగత భూములలో మొదటఉత్పత్తిలో సహకారాన్ని ప్రోత్సహించారు. క్రమంగా ఒక్కొక్క రంగంలో సహకార పద్ధతులను ప్రోత్సహించారు. సోషలిస్టు చైతన్యాన్ని రైతులలో కలిగించి కమ్యూన్‌ల నిర్మాణానికి పూనుకొన్నారు. ఒక గ్రామంలో ఉన్న భూమినంతా ఆ గ్రామానికి చెందిన భూమిగా మార్చి గ్రామ ప్రజలంతా ప్రజాస్వామ్య పద్ధతులలో పని విభజన చేసుకొని ఉత్పత్తిని నిర్వహించారు. ప్రజాస్వామ్య పద్ధతులలో నాయకత్వ కమిటీలను ఎన్నుకొని పరిపాలన నిర్వహణలోను ప్రజలు భాగస్వాములయ్యారు. ఉత్పత్తి పెరిగింది. చైతన్యం పెరిగింది.

దిగువన వున్న కుటుంబాలలో బీహార్‌లో 77.5 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 74 శాతం, జార్ఖండ్‌లో 67 శాతం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో 54 శాతం మందికి తెల్లకార్డులు లేదా అంత్యోదయ కార్డులు లేవు. ఆ విధంగా దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలలో మెజారిటీ ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ అందుబాటులో లేదు.

అర్హులైన పేదలలో 57 శాతం ప్రజలు ప్రజాపంపిణీ వ్యవస్థకు దూరంగా వున్నారని 11వ పంచవర్ష ప్రణాళికా పత్రం పేర్కొన్నది.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కేటాయించిన ఆహారధాన్యాలలో ఎక్కువ భాగం ప్రజల కందుట లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవినీతిమయంగావుంది. ఈ వ్యవస్థ ద్వారా అందచేస్తున్న ఆహారధాన్యాలలో బీహారులో 75 శాతం, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో 50 నుండి 70 శాతం, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒరిస్సా, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలలో 25 శాతం దారి మళ్లుతోందని పార్లమెంటు పబ్లిక్ అకౌంట్సు కమిటీ పేర్కొన్నది.

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామని కాంగ్రెసు నాయకత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం తన ఉమ్మడి కార్యక్రమంలో స్పష్టంగా పేర్కొన్నది. కానీ, ఆచరణలో అందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. జాతీయ స్థూల ఉత్పత్తిలో సబ్సిడీలు తగ్గించాలని 11వ పంచవర్ష ప్రణాళిక ఆమోదిత పత్రంలో పేర్కొన్నారు. అందువల్లనే, పెరుగుతున్న ద్రవ్యోల్బణంకు అనుగుణంగా కూడా బడ్జెటు కేటాయింపులు పెరుగుట లేదు. ఈ ఏడాది 2008-'09 బడ్జెటులో ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టం చేయటానికి కేటాయించినది కేవలం రూ. 48 కోట్లు మాత్రమే. అందువల్లనే ఆహార ధాన్యాల సేకరణఇటీవల సం॥లలో బాగా తగ్గింది. 2003-'04 సం॥లో 16.8 లక్షల టన్నుల గోదుమ సేకరించగా, 2006-'07కు 11.1 లక్షల టన్నులకు తగ్గిపోయింది. ఆహార నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కూడా కేంద్రం 2008-'09 బడ్జెటులో కేటాయింపు కేవలం రూ. 1121 కోట్లు మాత్రమే పెంచింది. ఆ విధంగా ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయుట కూడా ధరలపై ప్రభావం చూపిస్తోంది.

ప్రపంచీకరణవిధానాలు

ప్రపంచీకరణలో భాగంగా 1990 దశకం ప్రారంభం నుండి సరళీకరణవిధానాలు పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలు అనుసరిస్తున్నాయి. 1995 జనవరి 1 నుండి ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం అమలులోకొచ్చింది. విదేశీ వాణిజ్యానికి గేట్లు బార్లా తెరిచారు. విదేశీ పెట్టుబడిని దాదాపు అన్ని రంగాలలోకి అనుమతించారు. దిగుమతి ఆంక్షలు రద్దు చేశారు. దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించారు. భారత మార్కెటు, అంతర్జాతీయ మార్కెటుతో విలీనం, ఉత్పత్తిదారులు, వినియోగదారులు యిద్దరినీ దెబ్బతీసింది.

సరళీకరణవిధానాల వల్ల వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులు తగ్గాయి; సబ్సిడీలు తగ్గాయి. ఫలితంగా ఉత్పాదకత స్తంభించి పోయింది. సంక్షోభం పెరిగింది. దేశంలో వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలే దీనికి ప్రబల నిదర్శనం. ఈ విధానాలు ప్రజల ఆహార భద్రతకు పెనుముప్పుగా పరిణమించాయి. ధరల పెరుగుదలకు తోడ్పడుతున్నాయి. లోటు బడ్జెటును పూడ్చుకొనుటకు మార్కెట్‌లో ఎక్కువ డబ్బు ఛలామణిలోనికి తెచ్చుట, రూపాయి విలువ క్షీణించి బలహీన పడుట (ఏప్రిల్ నుండి జూన్ వరకు 3 నెలల కాలంలో రూపాయి విలువ డాలరులో 10 శాతం తగ్గింది), పెరుగుతున్న వాణిజ్య లోటు, దేశంలో సమాంతర వ్యవస్థగా కొనసాగుతున్న నల్ల డబ్బు, ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికీ, ఆహార భద్రత ముప్పుకూ సరళీకరణవిధానాలే మూలకారణంగా వున్నాయి. 'ఆహార, వ్యవసాయ సంస్థ'కు డైరక్టరుగా వున్న జాక్యూస్ దయెప్ దీనిని గుర్తించి, ఈ సంక్షోభం దశాబ్దాలుగా పెరుగుతూ వస్తోందని యిలా వివరించారు. "గత 20 సం॥లుగా సరియైనవి కాని విధానాలు అనుసరించిన ఫలితమే ఈ స్థితి" అని పేర్కొన్నారు.

(ముగింపు వచ్చే సంచికలో)

కడుపు కాలిన కష్టజీవుల పోరు జెండా - సంపూర్ణ విప్లవానికి సమగ్ర అజెండా

(గత సంచిక తరువాయి)

ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను నిరసించే కవిత "ఇసుక తుఫాను - ఇనుప డేగ". "సామ్రాజ్యవాదం కాగితం పులి. ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే మావో బోధనకు అక్షర రూపం ఈ కవిత.

"ఎడారిలో ఇసుక తుఫాను
డెవిల్ హౌస్ నుంచి ఇనుపడేగ
ఇసుక తుఫాను గెలుస్తుంది
ఇనుప డేగ కూలుతుంది"

అని అమెరికన్ సామ్రాజ్యవాదుల అనివార్య పతనాన్ని, ఇరాక్ ప్రజల అంతిమ విజయాన్ని భవిష్యద్దర్శనం చేస్తుందీ కవిత. అనేక చక్కటి దేశ, విదేశీ అనువాద కవితలు యీ సంకలనంలో వున్నాయి. సోమదత్ హిందీలో రాసిన 'పరీక్ష' అనే కవిత 1941లో జర్మన్ ఫాసిస్టులు యుగోస్లేవియాలోని క్రాగ్యువాట్స్ పట్టణాన్ని ఆక్రమించి 800 మంది పిల్లల్ని, వారి టీచర్లనూ కిరాతక హత్యాకాండకు గురిచేసిన హృదయ విదారక సంఘటనను అద్భుతంగా వర్ణిస్తుంది.

మనమంతా మనుషులం. అప్పుడప్పుడూ నీరసపడటం, నిరుత్సాహపడటం సహజం. కాని అది తాత్కాలికమే. గుండె దిటవు చేసుకుని ముందుకే పయనిస్తాం.

"మనిషి గుండెకదా ఇదెంతైనా
జారిపోవడం బేజారై పోడం
వుండవా!
క్షణమోపిక పట్టి
గుండె నిండా గాలి పీల్చి
తలెత్తి చూస్తే
ముసురుకుంటున్న మేఘాలూ
శంసాలతలూనూ
ఒక వర్షాకాల దృశ్యం
నీ చుట్టూతా అల్లుకుంటుంది" (ముని మాపు చీకటి)

హిమజ్వాల కూడా మనిషే, విప్లవోద్యమ చీలకలు, విప్లవ పార్టీల మధ్య ఘర్షణలు, అతివాద, మితవాద పెడధోరణులు, ఆశించిన విధంగా లేని పురోగమనం ఆయనను గాఢంగా బాధ పెట్టాయి. కొండొకచో నిరాశా, నిస్పృహలకూ గురి చేశాయి.

"అన్ని మనం కూర్చున్న కొమ్మల్ని మనం నరుక్కుంటున్న దృశ్యాలే
అంతటా మన వేళ్లతో మన కళ్లనే పొడుచుకుంటున్న దృశ్యాలే
...
తెగిన గాలిపటాలతో
వర్తమాన ఆకాశం సంక్షుభితమౌతుంది
...
పీడకుల కుట్రలు ఫలిస్తాయి
మనం చీలిపోతాం... చీకాకై పోతాం...
మన జీవితాలన్నీ భారాలైపోతాయి
సూర్యోదయం ఇంకా ఆలస్యమౌతుంది (తరంగ శోకం)

'కాళ్లరిగిందాకా' కవితలోనూ హిమజ్వాల విప్లవోద్యమంలో చీలికల గురించి తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

అతివాద దుందుడుకు విధానం పట్ల ఆయన అంతులేని ఆవేదన పడతాడు. అనవసర త్యాగాల పట్ల, బలిదానాల పట్ల ఖేదం చెందుతాడు.

"ఒక్కడే బయల్దేరినందుక్కాదు
ఒక్కడే మిగిలిపోయినందుకు బాధ
...
వీరులక్కడ
ప్రజలక్కడ
మధ్య స్మృతి గీతంలా నేను
...
బతుకంతా
స్మృతి గీతాలు రాయడమే అయ్యింది
గట్టుకు కట్టెలు మొయ్యడమే అయ్యింది" (దుఃఖం)

"తమ్ముడు మంచివాడే
త్యాగం ధైర్యం వున్నవాడే
ఎప్పుడూ చేసిన తప్పే చేస్తుంటాడు
మళ్లీ మళ్లీ
కొత్త తప్పు చెయ్యరా అంటే
కోపం చేస్తాడు
వాణ్ణెవరు తప్పు పట్టినా
వాడు ఖాతరు చేయడు
నిరంతరం వ్యవసాయం చేస్తూనే వుంటాడు
నాలుగు విత్తనాలు వాని గంపలో పడలేదు
వాడూ అర్థాకలితోనే
వాణ్ణెవరూ మార్చలేరు
వాడే మారితే
భూమికి సంబరమే" (వాడే మారితే)

హిమజ్వాల ఉద్యమకారుడు. జీవిత గతితర్కం తెలిసినవాడు ఉద్యమంలో తప్పులు తప్పవనీ, ఓటములే విజయానికి మెట్లని, అనుభవాలను విశ్లేషణచేసుకుని తప్పులను దిద్దుకొని పురోగమించటమే మార్గమని ఆయనకు తెలుసు.

"ఇప్పుడు ముక్కలైన చూపుని
అతికే పనిలో వున్నాం
పాయలైన ప్రవాహాన్ని
సముద్రాభిముఖం చేసే
సాధనలో వున్నాం"

(ప్రయాణం కొనసాగుతూనే వుంది)

డి.వి.కృష్ణ

"నడుస్తున్నాను
ముళ్లూ రాళ్లూ కురుస్తోన్నా
నడుస్తూనే వున్నాను
నెత్తురోడుతున్న పాదాలతో
దేశ చిత్రపటం గీస్తూనే వున్నాను
...
నిరంతరం పునర్ నిర్వచించుకుంటూ
నిర్మించుకుంటూ
నడిచే నడకే గదా
బతికున్నామనటానికి సంకేతం" (నడుస్తూనే వున్నాను)

"వేసింది నాలుగడుగులే
తుఫానుల్ని కూడగట్టాల్సిన పని ఇంకా ప్రారంభమైనా కాలేదు
దీపానికి చమురింకా అందనేలేదు
సూర్యుడు బహిష్కరింపబడే వున్నాడు
వెన్నెలలింకా ప్రవాసంలోనే వున్నాయి
వేకువలింకా చెరలోనే వున్నాయి
మన రక్తంతో మన బాటల్ని మనం వెలిగించుకోవాల్సి వుంది"
(ఇంకా)

'కొత్త పద్యం కావాలి' అనే కవితలో హిమజ్వాల విప్లవోద్యమానికి కొత్త ఎజెండాను ప్రతిపాదిస్తున్నాడు.

"కన్నీళ్లను తడిచే పద్యం
కవాతు చేయించే పద్యం
మనకు వీరులుగా శిక్షణఇచ్చే పద్యం
మనల్ని వీరులుగా తీర్చి దిద్దే పద్యం
మన కాళ్లకి కొత్త సత్తువనిచ్చే పద్యం
మన కళ్లను వెలుతురుతో కడిగే పద్యం
మనల్ని అంగుళమంగుళం పెంచి
త్రివిక్రముల్ని చేసే పద్యం
మనల్ని సమూహాలుగా సంధించే పద్యం
మనలో మనకే తెలీకుండా పడి వున్న
మహాశక్తుల్ని జాగృతం చేసే పద్యం కావాలి"

ఎలాంటి పద్యం నుండి జాగ్రత్తపడాలో హెచ్చరిస్తున్నాడు

"మన కాళ్లు విరగొట్టే పద్యం కాదు
మన కాళ్లకి పక్షవాతం తెచ్చే పద్యం కాదు
మన అసహనం ఆసరాగా
శివాలాడించే పద్యం కాదు"

'ఎర్రజెండా' మార్గమే ప్రజలకు విముక్తికి ఏకైక మార్గమని ప్రబోధిస్తూ, ఎర్రజెండాను సమున్నతంగా నిలపమని ప్రజలకు పిలుపిస్తున్నాడు సచిరౌత్‌రాయ్.

ఆ కవితనిట్లా తెనిగిస్తాడు హిమజ్వాల. తద్వారా తానూ సచిరౌత్‌తో గొంతు కలుపుతాడు.

"దించకండి దించకండి!
జండాను దించకండి
దించడానికది వృత్తి 'తెర' కాదు
మిలియన్ల రక్తంతో తడిసిన జండా అది
దోపిడీ రాపిడి
ఆకలి దుఃఖాల్లో
అణగారిన నిరుపేదల ఆశల కాగడా ఈ జండా" (కవి ఆజ్ఞ)

అరుణబావుటా నేతృత్వాన వెనుదిరగకుండా మునుముందుకే పయనించమని పతితులు, బాధా సర్పదష్టులందరికీ పిలుపిస్తున్నాడు.

ఈ సంకలనంలోని కవితలు ఒకసారి చదివి పక్కన పడేసే రుబ్బురోలు కవితలు కావు. పదేపదే చదివి బుర్రకెక్కించుకోవలసిన విప్లవ పాఠాలు. చదివే కొద్దీ విప్లవోత్తేజం కలిగించే టానిక్కులు. ఒకరు చదివిన తర్వాత మరొకరికి అందించాల్సిన విప్లవ మేనిఫెస్టో ఈ పుస్తకం. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గురించి చలం చేసిన సిఫారసు ఈ పుస్తకానికీ వర్తిస్తుంది. 'విప్లవ కార్యకర్తలకు, ప్రజలకు, శ్రేయోభిలాషులందరికీ ఈ పుస్తకాన్ని 'pass on' చేయటం మన కర్తవ్యం'.

విజయనగరంలో కోస్టల్ కారిడార్‌పై నిరసన సభ

నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకూ మొత్తం 9 కోస్తా జిల్లాల సముద్రతీర ప్రాంత జనజీవనానికి ముప్పు వాటిల్లే కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకిస్తూ జూన్ 5న విజయనగరం జిల్లా చింతపల్లిలో తీరప్రాంత మత్స్యకార్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన సభ జరిగింది. సంఘం అధ్యక్షులు బర్రి అప్పన్న అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకులు కా॥ పి. ప్రసాదు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిది జిల్లాల తీర ప్రాంత ప్రజల జీవనాన్ని దెబ్బతీసే కోస్టల్ కారిడార్‌ను వ్యతిరేకించాల్సినా, వెనక్కు తిప్పికొట్టాల్సినా అవసరాన్ని కా॥ ప్రసాద్ వివరించారు.

ఇంకా ఈ సభలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కా॥ తాండ్ర ప్రకాశ్, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కా॥ లక్ష్మి, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కా॥ సన్యాసిరావు, పీడీయస్‌యూ జిల్లా కార్యదంర్శి కా॥ మల్లిక్, సర్పంచ్ చిన్నప్పన్న తదితరులు మాట్లాడారు. కోస్టల్ కారిడార్ వల్ల వివిధ వర్గాల ప్రజలకు ముఖ్యంగా మత్స్యకార్లకు జరిగే ప్రమాదాన్ని వక్తలు తెలిపారు. ప్రమాదకరమైన ప్రాజెక్టును ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించాల్సిన ఆవశ్యకతను తెలిపారు. కోస్టల్ కారిడార్‌పై ప్రజలకు అవగాహన కలిగించి చైతన్య పరిచేందుకు న్యూడెమోక్రసీ, మత్స్యకార్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం సాగుతుంది. ఈ సభకు 150 మంది మహిళలతో సహా 600 మంది పాల్గొన్నారు.

పొట్టిలంక దళితపేట మీద అగ్రకుల అహంకారుల దాడిని ఖండిస్తూ కాకినాడలో బహిరంగ సభ

పూల తోటలకు తమ చెమటతో సువాసనలు అందించే పొట్టిలంక దళితపేటలో నేడు రక్తం వాసన వస్తున్నది. కోడికూయకముందే బిలబిలమంటూ పనీ పాటల్లోకి పరుగులు తీసే దళితులు, బిక్కుబిక్కుమంటూ అరచేత ప్రాణాలతో బతుకుతున్నారు. కసిరి బుసకొట్టే అగ్రకుల విపసర్పం దళితపేటలో పరుగులు తీసి, పల్లి వీరపండు అనే దళితుడ్ని చంపేసింది. మరో 12 మందిని చావుబ్రతుకుల మధ్యకు నెట్టింది. దళితులకు అంటరానితనాన్నీ, ఆర్థిక పరాధీనతనూ అంటగట్టిన భారతదేశ కుల వ్యవస్థ ఇక్కడ రాజకీయాలనూ, అధికార యంత్రాంగాన్నీ శాసిస్తున్నది.

దళితపేటపై దాడి, పల్లి వీరపండు హత్య:

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి – రావులపాలెం అయిదో నంబరు జాతీయ రహదారి ఆనుకుని వున్న పొట్టిలంక గ్రామంలో 200 దళిత కుటుంబాలు వున్నాయి. వీరంతా యీ ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన నర్సరీ తోటల్లో పనిచేస్తుంటారు. ఇదే గ్రామంలో అగ్రకుల (కాపు) కుటుంబాలు వున్నాయి. వీరందరూ నర్సరీ తోటల యజమానులు.

ది. 20.6.2008 రాత్రి 9 గంటలకు అంబటి రాజరత్నని, సోడాబత్తుల రాజు అనే దళిత యువకులు హైవే మీదకు వెళ్ళారు. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళ చంకనవున్న బిడ్డ బుగ్గను రాజు తన చేతితో తాకి ముద్దిచ్చాడు. పక్కనేవున్న మహిళ బంధువు 'మాలోడివి ముట్టుకుంటావురా?' అంటూ తగాదాకు దిగాడు. వీరు తోసుకున్నారు. మరుసటి రోజు 21వ తేది ఉదయం రాజరత్నం టిఫిన్ కోసం హోటల్‌కు వెళ్ళగా, హోటల్ యజమాని నారాయణరావు, అక్కడే కాపుగాసి వున్న మరో 50 మంది కలిసి రాజరత్నంను తీవ్రంగా కొట్టారు. అడ్డుకున్న నక్కా దాసును కూడా తీవ్రంగా కొట్టారు. ఇద్దరినీ పంచాయితీ ఆఫీసుకు తీసుకువచ్చి, రాజరత్నంను జెండా దిమ్మకు కట్టేశారు (యీ గ్రామ సర్పంచ్ దళితుడు) "మాల లంజాకొడుకు లెవరైనా పంచాయితీ వద్దకు వస్తే చంపేస్తామన్నారు". యీ వార్త తెలిసిన రాజరత్నం తల్లి మరియమ్మ పంచాయితీ వద్దకు వచ్చింది. దాహం అంటున్న కొడుక్కి మంచినీళ్ళు ఇవ్వబోతే అడ్డుకున్న అగ్రకులాల వాళ్ళు మరియమ్మను తరిమేశారు. మరియమ్మ పారిపోయి పోలీసులకు ఫోన్ చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వచ్చి రాజరత్నంను హాస్పటల్లో చేర్చారు.

కొడుకు పరిస్థితికి దుఃఖించిన మరియమ్మ అగ్రకులాల ఇళ్ళ వద్దకు వెళ్ళింది "చంటి బిడ్డకు ముద్దిచ్చినందుకే చచ్చేట్లు కొడతారా? మా ఆడోళ్ళని మీరు తోటల్లోకి లాక్కెళ్ళి పాడు చేయడం లేదా?" అని అరిచి తిరిగి వచ్చింది. దళితులందరూ పనుల్లోకి వెళ్ళడం వల్ల యీ విషయాలు సాయంకాలం వరకూ ఎవరికీ తెలియలేదు. రాత్రి 8 గం॥లకు పనుల నుంచి వస్తున్న దళితులు, అగ్రకులాలకు చెందిన ఇద్దర్ని పట్టుకుని రాజరత్నంను కొట్టడం గురించి నిలదీశారు. వీరు తిరిగి వెళ్ళి అగ్రకులాలను రెచ్చగొట్టారు. వెంటనే 300 మంది అగ్రకులాల వాళ్ళు కత్తులు, రాడ్లు, కారం డబ్బాలతో పోలీసు విజిల్స్ వూదుకుంటూ దళితపేట మీద పడ్డారు. దాడిని అడ్డుకున్న పల్లి వీరపండు (వయస్సు 35 సం॥లు) కళ్ళలో కారం పోసి, రాడ్లు, కత్తులతో దాడిచేసి అక్కడికక్కడే చంపేశారు. మరో 12 మంది తలలు పగలగొట్టారు. కాళ్ళూ, చేతులూ విరగ్గొట్టారు. దళిత మహిళల చీరలు లాగి చింపేశారు. ఆటోలు, మంచినీటి చేతి పంపులు, సైకిళ్ళు విరగొట్టారు. ఇళ్ళలోని మంచాలు, వంట పాత్రలు ధ్వంసం చేసారు. రెండు గంటలపాటు సాగిన యీ దాడిలో భయపడిన దళితులు వూరి పొలిమేరల్లోకి పారిపోయి రాత్రంతా గడిపారు. కొనవూపిరితో వున్న పల్లి వీరపండును, గాయపడిన వారిని సమీపంలోనే వున్న పోలీసులు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరపండు మార్గమధ్యలో చనిపోయాడు.

బాధితుల ఆందోళన:

దళితపేటపై దాడి, దళితుడి హత్య గురించి తెలిసిన వెంటనే వివిధ ప్రాంతాల నుంచీ దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు 22వ తేది ఉదయం పొట్టిలంక చేరుకున్నారు. ఎపిసిఎల్‌సి, ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియూ, పీడీయస్‌యూ నాయకులు భయబ్రాంతులయిన బాధితులకు అండగా నిలిచారు. దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని చైతన్య పరిచారు. 300 మందితో జాతీయ రహదారి మీద రాస్తారోకో చేశారు. దోషుల అరెస్టు, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరు, ఏలూరు రేంజి డిఐజీ, జిల్లా ఎస్.పి, మంత్రి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎం.పి. హర్షకుమార్, రాజ్యసభ సభ్యురాలు రత్నాబాయి బాధితులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి 5 లక్షల రూ॥లు నష్టపరిహారం, భార్యకు ఉద్యోగం, 1 ఎకరం భూమి, పిల్లలకు రెసిడెన్షియల్ విద్య గురించి అధికారులు హామీ ఇవ్వపడంతో రాస్తారోకో విరమించడం జరిగింది. యీ హామీలు పూర్తిస్థాయిలో అమలు జరిపేవరకూ ఆందోళన కొనసాగించవలసివుంది.

పోలీసుల పక్షపాత వైఖరి, ప్రేక్షక పాత్ర:

రాజరత్నం మీద దాడిచేసిన అగ్రకులాల వాళ్ళను తక్షణం అరెస్టు చేసివుంటే మరోసారి దళితపేట మీద దాడి జరగేది కాదు. దోషులను అరెస్టు చేయడానికి బదులు దళితులు ఇళ్ళలోంచి బైటకు రాకుండా పోలీసుల పహరా కాశారు. అగ్రకులాలకు పోలీసులు పరోక్షంగా సహకారం అందించడం వల్లే దళితపేట మీద దాడి జరిగింది. అగ్రకులాల మీద దళితులు దాడి చేసివుంటే పోలీసులు ఇంత ఉదాసీనంగా వుండేవారా?

కొత్త 'పవర్' రాజకీయాలు:

పొట్టిలంక గ్రామంలోని దళితులందరూ కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల వెంటే వున్నారు. యీ పార్టీలకే ఓట్లు వేశారు. రిజర్వేషన్ల ద్వారా వచ్చిన పదువులు కూడా అగ్రకులాలు ఎంపిక చేసిన దళితులే తీసుకున్నారు. దాడిచేసిన అగ్రకులాలూ, దాడికి గురయిన దళితులూ యీ పార్టీల్లో వున్నవాళ్ళే. అయితే ఇటీవల కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీల్లోని అగ్రకులాలు 'చిరు పవర్ యూత్'గా ఏర్పడ్డారు. వీళ్ళే దళితపేట మీద దాడిచేసి పల్లి వీరపండును హత్యచేసి, 12 మందిని గాయపరిచారు.

దళితుల మీద దాడులను ప్రతిఘటించాలి:

పొట్టిలంక దళిత పేట మీద జరిగిన దాడి కేవలం అగ్రకులాలది మాత్రమేకాదు, శ్రమజీవులైన దళితులకు భూమి, తదితర ఉత్పత్తి సాధనాలు లేకుండా చేసి అణిచివుంచుతూ, కుల వ్యత్యాసాలు, ఆర్థిక అసమానతలు పెంచిపోషిస్తున్న రాజకీయ, సామాజిక వ్యవస్థల పాత్ర వుంది. కుల వ్యవస్థను బ్రిటీషు వలస వాదులేకాదు, నేటి భారత పాలకులూ పెంచి పోషిస్తున్నారు. పొట్టిలంక దళితులకు, సాగుభూమి లేకపోవడం వల్లనే అగ్రకులాల వద్ద కూలీలుగా బ్రతుకుతున్నారు. దాడులకు గురవుతున్నారు. 30 ఏళ్ళ క్రితం సాగుకోసం, శ్మశానం కోసం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన 12 ఎకరాల భూమి దక్కకుండా చేయడానికి అగ్రకులాలు దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. దళితులు ప్రతిఘటించి యీ భూమి దక్కించుకున్నప్పటికీ, ఆ తర్వాత కాలంలో అసైన్డు భూములు అన్యాక్రాంత మయ్యాయి. 500 మంది వున్న దళితపేటలో ఉద్యోగాలు చేస్తున్నది 8 మందే. అక్షరాస్యులు 20 శాతమే. పక్కా యిళ్ళు వున్నది నాల్గోవంతు మందికే. దళితులకు స్వయం వుపాధి లేదు. దళిత మహిళల మీద లైంగిక అకృత్యాలు సర్వసాధారణం. యీ స్థితిని మార్చుకోవాలంటే భూమికోసం, ఉపాధికోసం, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలనీ, పొట్టిలంక దళిత బాధితులకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కోసం ఉద్యమించాలనీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తూర్పుగోదావరి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

కాకినాడలో బహిరంగ సభ

పొట్టిలంక దళితపేటపై అగ్రకుల దురహంకారుల దాడి, హత్యాకాండను ఖండిస్తూ సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యాన జూలై 12న జిల్లా కేంద్రమైన కాకినాడలో బహిరంగసభ జరిగింది. పార్టీ జిల్లా నాయకుడు కా॥ జె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించిన ఈ బహిరంగసభలో మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥ కె. బాలగోపాల్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు క్రింద దాడికి పాల్పడ్డ వారందరినీ అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. రాష్ట్రంలో ఈ చట్టం వినియోగం చాలా తక్కువగా ఉందనీ, దీన్ని ఉద్యమకారులు, ప్రజలు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. దళితులు ఆత్మగౌరవంతో తలెత్తిన చోటల్లా ఇలాంటి దాడులు, హత్యలు జరగడం సర్వసాధారణవిధానంగా కొనసాగుతుందన్నారు. దళితులపై దాడులు చేసే వారిని శిక్షించడానికుద్దేశించి వచ్చిన చట్టాల సైతం వారికి రక్షణగా నిలబడకపోవడానికి ప్రధాన బాధ్యత పాలకులదేనన్నారు.

సభలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు కా॥ పి. టాన్యా మాట్లాడుతూ, దళితుల్ని దేశంలోని కులవ్యవస్థ నేటికి కాల్చుకుతింటున్న వైనాన్ని వివరించారు. దళితులు, ఇతర కులాల పేదలు భూమి కోసం ఉద్యమిస్తున్నప్పుడు, వారిని అణచివేయడంలో నిన్నటి తెలుగుదేశం ప్రభుత్వమూ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలదీ ఒకే విధంగా ఉందన్నారు. తమ ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవడానికి దళితులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

"ప్రజాపంథా" వర్కింగ్ ఎడిటర్ కా॥ కె. గోవర్ధన్ మాట్లాడుతూ, దళితులు తలెత్తి ఆత్మ గౌరవంతో నిలబడితే వారి తలల్ని తెగనరకాలనే అగ్రవర్ణ దురహంకారాన్ని తుదముట్టించాలన్నారు. కారంచేడు, చుండూరులు మొదలుకొని నేటి పొట్టిలంక దాకా దళితులపై జరిగిన దాడుల్ని ఏ చట్టాలూ, ఏ ప్రభుత్వాలూ నిరోధించలేక పోయాయని

(మిగతా 15వ పేజీలో)

ఆర్మూరు డివిజను

ఉపాధి హామీ కార్యక్రమం అమల్లో అవకతవకలు - పోరాటానికి నడుం కట్టిన కార్మికులు

భారత దేశంలో రైతాంగ వుద్యమం, కమ్యూనిస్టు పార్టీలు సాగించిన సుదీర్ఘ పోరాట ఫలితమే 2005 గ్రామీణఉపాధి హామీ చట్టం. ఈ చట్టం మొట్ట మొదటిసారిగా వ్యవసాయ కార్మికులకు కుటుంబానికి ఒక్కరికి సంవత్సరంలో 100 రోజుల పనిని గ్యారంటీ చేసింది. ఈ పనికి కూడా కనీస వేతనాన్ని గ్యారంటీ చేసింది. గ్రామీణప్రాంతాలలో కమ్ముకొస్తున్న వ్యవసాయ సంక్షోభ నుడిగుండంలో కొట్టుకుపోకుండా తమను తాము రక్షించుకోవటానికి పాలకవర్గాలు ఈ కనీస చర్యకు పూనుకోవలసి వచ్చింది. మొదట దేశంలోని కొన్ని రాష్ట్రాలకు, ఆ రాష్ట్రాలలోని కొన్ని జిల్లాలకే వర్తింపచేయబడిన ఈ పథకం, ఈ ఏప్రిల్ ఒకటి నుండి దేశంలోని అన్ని రాష్ట్రాలకు, అన్ని జిల్లాలకు విస్తరింపచేయబడింది. అన్ని యితర ప్రభుత్వ పథకాల లాగానే ఈ పథకంలోనూ అనేక అవకతవకలూ, అడుగడుగునా అవినీతీ రాజ్యమేలుతున్నాయి. వ్యవసాయ కార్మికులు సంఘటిత పడి సమరశీల పోరాటం చేయటం ద్వారానే దీనిని సక్రమంగా అమలు జరిపించుకోగల్గుతారు. ఈ పథకంలో, చట్టంలో మరిన్ని మెరుగైన మార్పులు సాధించుకోగల్గుతారు. అయితే, ఎన్ని లోటుపాట్లున్నా, ఈ పథకం గ్రామీణప్రాంతాల్లో కార్మికుల బేరసారాలాడే శక్తిని ఎంతో కొంత మేరకు పెంచింది. ఇతర పనుల్లో వారి వేతనాల పెరుగుదలకు దారి తీసింది. అంతకన్నా ఈ చట్టం, పథకం ప్రాముఖ్యత ఏమిటంటే - గ్రామీణవ్యవసాయ కార్మికులు రాష్ట్ర వ్యాపితంగా, దేశ వ్యాపితంగా సంఘటిత పడటానికి అది కల్పిస్తున్న సువర్ణావకాశం! కోట్లాది వ్యవసాయ కార్మికులందరికీ ఒకే యజమానిని - రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఈ చట్టం ముందుకు తెచ్చింది. చట్ట విస్తరణకోసం, మెరుగుదల కోసం అనేక సామాజిక భద్రతా సౌకర్యాలను యిందులో చేర్చటం కోసం దేశంలోని వ్యవసాయ కార్మికవర్గ మంతా సమైక్యంగా పోరాడటానికి అవధులు లేని అవకాశాల గేట్లను ఈ చట్టం తెరిచింది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం కమ్యూనిస్టు విప్లవకారుల కర్తవ్యం. ఈ నేపథ్యంలో ఎ.ఐ.కె.ఎం.ఎస్ ఆర్మూరు డివిజను కమిటీ చేపట్టిన సర్వే కార్యక్రమం, వ్యవసాయ కార్మికులను నిర్మాణం చేయటానికి చేపట్టిన ప్రయత్నం అభినందనీయం.

ఉపాధి హామీ పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని, ఈ పథకం క్రింద గ్రామాలలో పనిచేస్తున్న వేలాది వ్యవసాయ కార్మికులను సంఘటిత పరచాలని ఏప్రిల్‌లో జరిగిన ఏఐకెయంయస్ ఆర్మూరు డివిజను కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ నిర్ణయం మేరకు కార్యకర్తలను 5 బృందాలుగా విభజించింది. వీరు 7 మండలాలలోని 78 గ్రామాలలో వేలాది మంది కార్మికులను ప్రత్యక్షంగా కలుసుకుని విచారణజరిపారు. ఒక్కొక్క చోట 150 నుండి 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరితో విచారణబృందం సభ్యులు ఒక్కొక్క చోట గంటకు తక్కువ కాకుండా గడిపి వివరాలు సేకరించారు. ఉపాధి హామీ పథకంలోని అంశాలను 23 ప్రశ్నలుగా రూపొందించుకొని కార్మికుల నుండి సమాచారం సేకరించారు. ఈ పరిశీలన, ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు అంతకు ముందు లేని లోతైన పరిజ్ఞానాన్ని కల్గించింది. ఉపాధి హామీ పథకం అమల్లో జరుగుతున్న అవకతవకలను ఆశ్చర్యకరంగా బహిర్గతం చేసింది. కార్మికులతో సంబంధాలు పెంచుకోవటానికి, వారిని సంఘటిత పరచటానికి అవకాశం కల్పించింది. పరస్పర సంబంధాన్ని పెంచుకునే ఈ కార్యక్రమం వ్యవసాయ కార్మికుల నుండి అనూహ్య స్పందనను ముందుకు తెచ్చింది. తమ సమస్యల గురించి పట్టించుకునే వారున్నారని, తాము సంఘటిత పడి పోరాడేటట్లయితే, తమ సమస్యలను పరిష్కరించుకోగల్గుతామని వారికి విశ్వాసాన్ని కల్గించింది. ఈ పరిశీలనా కార్యక్రమం ఏప్రిల్ 2వ వారం నుండి మే చివరి వరకు కొనసాగింది.

కామ్రేడ్ కె. రాజేశ్వర్ నాయకత్వంలో 3 సభ్యుల బృందం భీంగల్ మండలంలోని 20 గ్రామాలలో 50 పనులను పరిశీలించింది. కామ్రేడ్ బి. భాస్కర్, రామకృష్ణల నాయకత్వంలోని 4 గురు సభ్యుల బృందం సిరికొండ మండలంలోని 20 గ్రామాలలో 50 పనులను పరిశీలించింది. కామ్రేడ్స్ సత్యనారాయణ, ఎస్. సురేశ్‌ల నాయకత్వంలోని 4 సభ్యుల బృందం కమ్మర్‌పల్లి మండలంలోని 10 గ్రామాలలో సాగుతున్న 15 పనులను పరిశీలించింది. కామ్రేడ్ కిషన్ నాయకత్వంలోని ఇద్దరు సభ్యుల బృందం మోర్తాడ్ మండలంలోని 18 గ్రామాలలో సాగుతున్న 40 పనులను పరిశీలించింది. బి. దేవారాం, రాజన్నల నాయకత్వంలోని 4 సభ్యుల బృందం ఆర్మూరు, జక్రాన్‌పల్లి మండలాలలోని 10 గ్రామాలలో సాగుతున్న 16 పనులను పరిశీలించింది. కా॥ గౌతం నాయకత్వంలోని 10 మంది సభ్యుల బృందం బాన్సువాడా డివిజన్‌లోని చిచ్కుంద మండలానికి చెందిన 6 గ్రామాలను పరిశీలించారు.

పై విస్తృత పరిశీలనా కార్యక్రమం ఫలితంగా ఆర్మూరు బాన్సువాడ డివిజను గ్రామాలలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ కార్యక్రమాలలో కొనసాగుతున్న ఈ క్రింది అవకతవకలు వెల్లడయ్యాయి.

1) జాబ్ కార్డులు పొందే అర్హత వున్న వారిలో చాలా మందికి జాబ్ కార్డులు జారీ చేయబడలేదు.

2) కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్, బషీరాబాద్, భీంగల్ మండలంలోని బడా భీంగల్, బాబాపూర్, గోనుగొప్పుల, సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామాలలో కూలీరేటు రోజుకు 30 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. (ఈ చట్టం క్రింద చెల్లించవలసిన కనీస కూలిరేటు 80 నుండి 100 రు.లు వుంది.)

3) వారానికొకసారి కూలి పైకం చెల్లించబడవలసి వుండగా, కొన్ని గ్రామాలలో 1-2 నెలల వరకు, మరికొన్ని గ్రామాలలో 3-4 నెలల వరకు కూలి చెల్లించటం లేదు. కొన్ని చోట్ల సం॥రం నుండి చెల్లించటం లేదు. సిరికొండ మండలంలోని గడ్కోలు గ్రామంలో జట్రోఫా మొక్కలు నాటిన, నీళ్లు పోసిన కూలీ, అమాన్‌కుంట గ్రామంలో మట్టి తీసిన కూలి పైసలు, రావుట్ల గ్రామంలో పాత తండా రోడ్డుకు పని చేసిన కూలీ, ఎదుల చెరువులో పనిచేసిన కూలీ యింత వరకు కార్మికులకు ముట్టలేదు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో వారం రోజుల కూలి, కమ్మర్‌పల్లి మండలం హాసా కొత్తూరు గ్రామంలో జట్రోఫా మొక్కలకు నీళ్లు పోసిన, ఇంకుడు గుంతలు తీసిన కూలి కార్మికులకు ముట్టలేదు.

4) కూలీలు చేసిన పనిని కంప్యూటర్లతో తక్కువగా నమోదు చేస్తున్నారు. ఈ పథకం క్రింద పని చేసే సిబ్బంది బంధువులకు, సర్పంచి బంధువులకు, వారు అసలు పనిచేయకుండానే పనిచేసినట్లుగా నమోదు చేసి కార్మికుల కష్టార్జితాన్ని ధారాదత్తం చేస్తున్నారు.

5) చనిపోయిన వారి పేర్లపైన, అరబ్బు దేశాలలో వున్న వారి పేర్లపైన పనిని నమోదు చేసి, ఈ పైకాన్ని సిబ్బంది, గ్రామ పెత్తందారులు కుమ్మక్కై కాజేస్తున్నారు.

6) పనులు జరుగుతున్న స్థలంలో కార్మికులకు నీడ కల్పించటానికి ప్రభుత్వం టెంట్లు సరఫరా చేస్తున్నది. ఈ టెంట్లన్నిటినీ అధికారులూ, గ్రామ సర్పంచులూ వుపయోగించుకుంటున్నారు. ఒక్క గ్రామంలో కూడా కార్మికులకు నీడ కల్పించటానికి వుపయోగించటంలేదు.

7) కార్మికులకు త్రాగునీటి యేర్పాట్లు సక్రమంగా లేవు. ప్రాథమిక చికిత్సా యేర్పాట్లూ సరిగ్గా లేవు. కేవలం అయోడిన్, దూది మాత్రమే అందుబాటులో వున్నాయి.

8) 40 మంది కార్మికులకు ఒక మేట్ వుండవలసింది, 150 నుండి 200 మందికి ఒక మేటును మాత్రమే నియమించారు.

9) ఫీల్డు అసిస్టెంట్లు కూలీలను అదిరింపులు, బెదిరింపులకు గురిచేస్తున్నారు. అంతేకాకుండా, గ్రామాల్లో పెద్దల పనులు చేసి పెట్టటానికి ఉపాధి హామీ కూలీలను 10-15 మంది చొప్పున పంపిస్తున్నారు.

10) ఉపాధి హామీ పనుల నిర్ణయంలో కార్మికుల అభిప్రాయాలకు యెలాంటి ప్రాముఖ్యత యివ్వటం లేదు.

11) పనిచేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తూ గాయాలు తగిలి కార్మికులు పనిచేయలేని స్థితి యేర్పడితే, అలాంటి రోజులకు కార్మికులకు సగం వేతనం చెల్లించాలి. కాని, అధికారులు యిలా చెల్లించటం లేదు. పైగా, కనీసం మందులు కూడా యిప్పించటం లేదు.

12) పని స్థలం 5 కిలో మీటర్లకు మించిన దూరంలో వుంటే కూలిలో 10 శాతాన్ని రవాణా చార్జి క్రింద చెల్లించాలి. కాని, యిలా యెక్కడా చెల్లించటం లేదు.

13) గ్రామాలలో కార్మికులకు పనిముట్లు యివ్వటం లేదు. ప్రభుత్వం నుండి వచ్చిన పనిముట్లు (గడ్డపార, పావడా, అంచెలు) సర్పంచుల, వారి బంధువుల కుటుంబాలకు యిస్తున్నారు. జక్రాన్‌పల్లిలో యీ పనిముట్లు సర్పంచి యింట్లోనే వుంటున్నాయి.

14) పనిముట్లను సాన పెట్టించుకోవటానికి చార్జీలను కూలీలకు యివ్వటం లేదు. ఈ పని కూడా నమోదు కావటం లేదు.

15) చేసిన పని కొలతలు ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా వున్నాయి.

16) వికలాంగులకు ప్రత్యేకంగా పని కల్పించే విషయం ఎవరూ పట్టించుకోవటం లేదు.

17) ఎండ దెబ్బలకు పని చేస్తూ కార్మికులు చనిపోయినా, యితర ప్రమాదాల కారణంగా చనిపోయినా అధికారులు కార్మికుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించటం లేదు. సిరికొండ మండలంలోని తాటిపల్లి గ్రామంలో అడవి పంది కార్మికుడి మీద పడి చంపింది. భీంగల్ మండలంలోని గోనుగొప్పుల గ్రామంలో బర్ల నడిపి, గంగారాం అనే కార్మికుడు పనిచేస్తుండగా కందిరీగలు కుట్టి చనిపోయాడు. సిరికొండ మండలంలోని గడికోలు గ్రామంలో గాండ్ల నారాయణపనిచేస్తూ చనిపోయాడు. వీరికి అధికారులు యెలాంటి నష్టపరిహారం చెల్లించకపోగా, వారికి రావలసిన కూలి పైసలను కూడా వారి కుటుంబ సభ్యులకు చెల్లించ లేదు.

18) పోస్టాఫీసులో అకౌంట్లు తెరవటం కార్మికులకు నరకంగా మారింది. పోస్టాఫీసు నుండి తమ కూలిపైకం విత్‌డ్రా చేసుకోవటానికి అవసరమయ్యే ఫారానికి పోస్టల్ డిపార్టుమెంటు వాళ్ళు 2 రు.ల చొ॥న తీసుకుంటున్నారు.

19) ఫీల్డు అసిస్టెంట్లపై ప్రాజెక్టు ఆఫీసరు, అసిస్టెంటు ప్రాజెక్టు ఆఫీసర్ల నిగరానీ వుండటం లేదు. ప్రాజెక్టు ఆఫీసరు, అసిస్టెంటు ప్రాజెక్టు ఆఫీసర్లు స్థానికులైన చోట, వీరు సర్పంచులతో, స్థానిక పెత్తందారులతో మిలాఖతై కార్మికులకు అన్యాయం చేస్తున్నారు.

20) ఆమ్ ఆద్మీ భీమా యోజన పథకం గ్రామాలలోని కూలీలందరికీ వర్తించవలసి వుండగా, ఒక్కొక్క గ్రామంలో 10 శాతం మందికి మాత్రమే వర్తింప చేస్తున్నారు. తమ టార్గెట్ పూర్తయిందనే పేరుతో మిగతా కార్మికుల పేర్లను అధికారులు రాసుకోవటం లేదు.

ఉపాధి హామీ పథకం అమల్లో జరుగుతున్న పై అవకతవకల గురించి చర్చించి, తగిన పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవటానికి ఆర్మూరు డివిజను స్థాయి ఉపాధి హామీ కార్మికుల సదస్సు సిరికొండలో ఏఐకెయంయస్ ఆధ్వర్యంలో జూన్ 12న జరిగింది. ఈ సదస్సులో 32 గ్రామాల నుండి వచ్చిన 2 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. ఏఐకెఎంఎస్ డివిజను అధ్యక్షుడు కామ్రేడ్ బి. భాస్కర్ ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఏఐకెయంయస్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వి. ప్రభాకర్ ఈ సదస్సులో ప్రధాన వుపన్యాసం చేశారు. ఆయన తన వుపన్యాసంలో 2005 వుపాధి హామీ చట్టం అనేక పోరాటాల ఫలితంగా రూపొందిందని, అయినా యిందులో అనేక లొసుగులున్నాయని, వీటిని తొలగించి పటిష్టం చేయటానికి పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ చట్ట నిబంధనలు కార్మికులకు తెలియవని, వారిలోకి తీసుకుపోవలసిన అవసరముందని అన్నారు. పేదల కోసం రూపొందిన ఏ చట్టాలూ పోరాటం లేకుండా అమలు జరగవని, కార్మికులు చైతన్యవంతులై పోరాటం సాగించటం ద్వారానే వుపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు జరిపించుకోగల్గుతామన్నారు. ఉపాధి హామీ కార్మికులు డివిజను స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ సంఘటితం కావాలని ఆయన పిలుపిచ్చారు. ఈ సదస్సులో ఏ.ఐ.కె.యం.యస్. జిల్లా, డివిజను నాయకులు కామ్రేడ్స్ బి. దేవరాం, సత్యనారాయణ, ఆర్. రామకృష్ణ, కె. రాజేశ్వర్, కిషన్, సత్తెక్క వుపన్యసించారు. యం.పి.డి.ఓ, జిల్లా సహాయక ప్రాజెక్టు ఆఫీసర్లు కూడా సదస్సు నుద్దేశించి మాట్లాడారు.

ఈ సదస్సులో అన్ని మండలాలలోనూ, అన్ని గ్రామాలలోనూ ఉపాధి హామీ పని సంరక్షణకమిటీలను యెన్నుకోవాలని తీర్మానించారు. సిరికొండ, భీంగల్ మండల కమిటీలను సదస్సులో ప్రకటించారు. మిగతా మండల కమిటీల ఎన్నికకు, గ్రామ కమిటీల ఎన్నికకు వెంటనే కార్యక్రమం తీసుకోవాలని నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం అమలులో జరుగుతున్న అవకతవకలను యెత్తి చూపుతూ, వీటిని సవరించటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 20 అంశాల కోర్కెల పత్రాన్ని ఏఐకెయంయస్ ఆధ్వర్యంలో జూన్ 12న జిల్లా కలెక్టరుకు సమర్పించారు. జిల్లా కలెక్టరు స్పందనను బట్టి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని సదస్సు తీర్మానించింది. ఏది ఏమైనా, ఈ సదస్సు గ్రామీణవ్యవసాయ కార్మికులను సంఘటిత పరచటంలో, పోరాటానికి సన్నద్ధం చేయటంలో ఒక ముందడుగు.

పెరిగిన నిత్యావసర వస్తువుల, పెట్రో వుత్పత్తుల ధరలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన

(15.6.08 సంచిక తరువాయి)

గతంలో ఎన్నడూ లేనంతగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా నిత్యావసర వస్తువులకు తోడు పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు కూడా పెరిగాయి. పెరిగిన ధరలను తగ్గించాలనీ డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ), ఎంసీపీఐ (యు), సీపీఐ (ఎం-ఎల్), ఎస్‌యూసీఐ, సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్, యం.యల్ కమిటీ పార్టీలు జూన్ 5 రాస్తారోకోలను, 6న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆ పిలుపులో భాగంగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి.

ఖమ్మం జిల్లా ఇల్లందులో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో పెరిగిన ధరలను నిరసిస్తూ జూన్ 5న రాస్తారోకో, 6న ఇల్లందు పట్టణబంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడారు. జూన్ 7న ఇఫ్టూ ఇల్లందు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆటోల బంద్ జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో న్యూడెమోక్రసీ పట్టణకమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన, యూపీఏ ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది. జిల్లాలో బంద్ నిర్వహిస్తుండగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కా॥ కె.జి. రాంచందర్, నాయకులు వెంకటేశ్, అంబదాస్, శ్రీనివాస్ తదితరులను అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో జరిగింది. న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు కా॥ నరసింహులు మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పట్టణంలో పెరిగిన ధరలను తగ్గించాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రదర్శన, యూపీఏ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కా॥ తాండ్ర ప్రకాశ్ మాట్లాడారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో 5వ నెంబర్ జాతీయ రహదారిపై న్యూడెమోక్రసీ, లిబరేషన్, సీపీఐ (ఎం-ఎల్) పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. 500 మంది పాల్గొన్న ఈ రాస్తారోకో సందర్భంగా వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా కా॥ ఎస్. రాజారావు (న్యూడెమోక్రసీ), పి. సహదేవుడు (సీపీఐ ఎం-ఎల్), అర్జున్‌రావు (లిబరేషన్) తదితర నాయకులు మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో న్యూడెమోక్రసీ, యం.సి.పి.ఐ (యు) ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో జరిగింది. వందలాది వాహనాలు ఎక్కడి కక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ అనంతరం కార్యక్రమాన్ని వుద్దేశించి కా॥ కె. పోలారి (న్యూడెమోక్రసీ), యస్. నాగరాజు (యంసీపీఐ(యు) మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రెండు పార్టీల స్థానిక నాయకులు కామ్రేడ్స్ కాకర్ల అప్పారావు, యు.వి., దొర సాంబశివరావు, రమణ, రెడ్డి రఘు, బి.వి. వసంతరాములు, శ్రీనివాస్ తదితరులు నాయకత్వం వహించారు. అదే విధంగా జిల్లాలోని పెద్దాపురం, జంగారెడ్డి గూడెం, కోయ్యలగూడెం, గోపాలపురం మండల కేంద్రాలలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకోలు జరిగాయి. రాష్ట్ర బంద్ సందర్భంగా జంగారెడ్డి గూడెం, బుట్టాయి గూడెం, కోయ్యలగూడెం, గోపాలపురం, జీలుగుమిల్లి, కామరరపు కోట, జె. నర్సాపురం, మండల కేంద్రాలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బంద్ విజయవంతంగా జరిగింది. పార్టీ స్థానిక నాయకులు బంద్‌కు నాయకత్వం వహించారు. నిజామాబాదు జిల్లా నందిపేట్‌లో న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. స్థానిక నాయకులు కామ్రేడ్స్ బాగులు, మల్లిక్, అబ్దుల్ తదితరులు మాట్లాడారు. ఆదిలాబాదు జిల్లా ఉట్నూర్, భైంసా, లోకేశ్వరం, నిర్మల్, ఖానాపూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జిన్నారం తదితర మండల కేంద్రాలలో పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు, రాస్తారోకోలు, దిష్టి బొమ్మ దగ్ధం కార్యక్రమాలు జరిగాయి. స్థానిక నాయకులు కామ్రేడ్స్ యం. తిరుపతి, శంకర్, రాజన్న, రామలక్ష్మణ్, నంది రామయ్య, దేవన్న, కేశవ్, యస్. వెంకటేశ్వర్లు, రాజు, సుధాకర్, సుబ్రమణ్యం, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా గురజాల, రెంట చింతలలలో పెంచిన పెట్రో వుత్పత్తుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, బంద్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కా॥ ఎన్. విష్ణు, అన్నపూర్ణ, గోపయ్య, శివమ్మ తదితరులుతోపాటు వంద మంది పాల్గొన్నారు.

(13వ పేజీ తరువాయి)

గుర్తుచేసారు. దళితులకు ఆకలిని తీర్చడంతోపాటు ఆత్మగౌరవాన్ని కల్పించే భూమి కోసం ఇతర పేదలతో కలిసి వారు పోరాడాలన్నారు.

ఇంకా ఈ బహిరంగ సభలో ఎ.ఐ.కె.యం.యస్. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి, సహాయ కార్యదర్శులైన కామ్రేడ్ ఎస్. రాజారావు, ఎం. దుర్గాప్రసాద్, కె. వెంకటేశ్వర్లు, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ ప్రదీప్ మాట్లాడుతూ, జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడుల్ని, అత్యాచారాల్ని నిలువరించగలిగేది బలమైన ప్రజాప్రతిఘటనా పోరాటాలేఅన్నారు. "అరుణోదయ" కళాకారులు పాటలు పాడారు.

రాజమండ్రిలో సభ

పొట్టిలంక దళితపేటపై అగ్రవర్ణ అహంకారుల దాడిని, హత్యను ఖండిస్తూ జూన్ 26న రాజమండ్రిలో సభ జరిగింది. సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) రాజమండ్రి నగర కార్యదర్శి కా॥ జోజి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు కా॥ పి. టాన్యా మాట్లాడుతూ, దళితులపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. పొట్టిలంక దళితుల ఆత్మగౌరవ పోరాటానికి న్యూడెమోక్రసీ క్రియాశీలక మద్దతునిస్తుందని ప్రకటించారు.

ఇంకా ఈ సభలో ఎ.ఐ.కె.యం.యస్. జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ యం. దుర్గాప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కా॥ యం. రామకృష్ణ, పీవోడబ్ల్యూ నగర కార్యదర్శి కా॥ పి. [illegible], ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కా॥ కొండా దుర్గారావు మాట్లాడారు.

వివిధ ప్రజా సంఘాలతో కలసి "పొట్టిలంక దళితుల ఆత్మగౌరవ [illegible] పోరాట కమిటీ" ఏర్పడింది. ఈ కమిటీ ఆధ్వర్యాన జూన్ 30న "చలో పొట్టిలంక" కార్య[illegible] జరిగింది.

ఏలూరులో మెరుగైన వేతన ఒప్పందాన్ని సాధించుకున్న చుట్టల కార్మికులు

ఏలూరులో గతంలో ఎన్నడూ లేనంత పెరుగుదలతో చుట్టల కార్మికులు ఇఫ్టూ ఆధ్వర్యంలో మంచి వేతన ఒప్పందాన్ని సాధించుకున్నారు. వేతనం పెంపుదల, బోనస్ పెంపుదలతోపాటు కొత్తగా ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా సాధించుకున్నారు. కార్మికుల ఐక్యతకు, సంఘటిత శక్తికి ఇది నిదర్శనం. కార్మికుల పట్టుదలకు ఇది తార్కాణం. పరిశ్రమ సంక్షోభాన్ని అడ్డం పెట్టుకొని యజమానులు కార్మికులకు రావలసిన సౌకర్యాలను ఒక్కటొక్కటిగా తగ్గిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత ఐదారు సంవత్సరాలుగా పరిశ్రమ ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నది. అననుకూల పరిస్థితి వల్ల కార్మికవర్గం కూడా ఒకడుగు వెనక్కు తగ్గి, ఉన్న పనిని నిలబెట్టుకునే వైపుగా కృషిని సాగించింది. అయితే ఇటీవల కాలంలో పరిస్థితి మెరుగుపడింది. చుట్టకు డిమాండ్ పెరిగింది. పరిశ్రమ పుంజుకున్నది. ఈ సానుకూల పరిస్థితిని గమనించిన ఇఫ్టూ కార్మికులను చైతన్య పరచింది. జనరల్ బాడీ మీటింగులు, గ్రూపు మీటింగుల ద్వారా కార్మికుల్లో కదిలకలను తీసుకువచ్చింది. ప్రస్తుతం పరిశ్రమలో వచ్చిన అనుకూల పరిస్థితితోపాటు, కనీస వేతనాల ప్రభుత్వ జీవో కూడా వెలువడింది. ఈ పరిస్థితులను ఆసరా చేసుకొని చుట్టల యజమానుల సంఘానికి ఇఫ్టూ డిమాండ్ నోటీసు యిచ్చింది. యజమానుల నుండి సానుకూల స్పందన రాకపోతే సమ్మె పోరాటం చేపట్టాలని కూడా నిర్ణయించింది. కేవలం కూలిరేటు పెంచుకోవడమే కాకుండా అదనపు సౌకర్యాలు సాధించుకోవాలనే పట్టుదలను కార్మికవర్గం ప్రదర్శించింది. ఇందుకు సమ్మెకైనా సిద్ధమని ప్రకటించింది. మొదటకొంత నిర్లక్ష్యం చేసిన యజమానులు కార్మికుల పట్టుదలను గమనించి వెంటనే చర్చలకు ముందుకు వచ్చారు. మూడు సార్లు చర్చలు జరిగాయి. చర్చల సందర్భంగా సుమారు 600 మంది కార్మికులకు పైగా హాజరయ్యారు. చివరకు ది. 15.6.2008న చుట్టు యజమానుల సంఘానికి ఇఫ్టూ అనుబంధ చుట్టల కార్మిక సంఘానికి మధ్య ఒప్పందం కుదిరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం యిస్తున్న కూలిపై 47 శాతం పెంపుదల జరిగింది. ఇది కార్మికులకు సంతోషాన్ని కలిగించింది. గతంలో చేసిన పోరాటాలు, సమ్మెలు నేడు పెట్టుబడిగా ఉపయోగపడ్డాయి. ఈ ఒప్పందం ప్రకారం 4 అంగుళాల సైజుకు 1000 చుట్టలకు ప్రస్తుతం యిస్తున్న 85 రూ. పై 40 రూ. పెంచి 125 రూ॥లు యిచ్చుటకు ఒప్పందం కుదిరింది. ఇదే దామాషాలో మిగతా సైజులకు కూడా పెరిగింది. 3 అంగుళాల సైజు 66 రూ॥ నుండి 100 రూ॥లకు, 3 1/2 సైజుకు 75 రూ॥ నుండి 110 రూ॥లకు, 4 1/2 సైజుకు 90 రూ॥ నుండి 132 రూ॥లకు, 5 అం॥ సైజుకు 95 రూ॥ నుండి 140 రూ॥లకు 5 1/2 సైజుకు 108 రూ॥ నుండి 159 రూ॥, డబుల్ రెక్కకు 105 రూ॥ నుండి 155 రూ॥లకు వేతనాలు పెరిగాయి. అదే విధంగా పండుగ బహుమతి కనీసం 500 రూ॥లకు తక్కువ గాకుండా యివ్వడానికి అంగీకారం కుదిరింది. వీటితోపాటు కొత్తగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడానికి కూడా ఒప్పందం కుదిరింది. ఇది కార్మికులకు మరింత ఆనందాన్ని కలిగించింది. అగ్రిమెంటు చర్చలు బహిరంగంగా వందలాది కార్మికుల సమక్షంలో జరిగాయి. కార్మికులు ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా అగ్రిమెంటు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం వల్ల సుమారు 1500 మంది కార్మికులకు మేలు చేకూరుతుంది.

విజయోత్సవ ర్యాలీ

అత్యంత మెరుగైన వేతన ఒప్పందం సాధించుకున్న సందర్భంగా 15.6.08న ఏలూరులో భారీ విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం స్థానిక 12 పంపుల హైస్కూలు గ్రౌండ్ నందు బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి కె. పోలారి, నగర ప్రధాన కార్యదర్శి యు.వి., వెంకటాపురం సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, పి.ఓ.డబ్ల్యూ నాయకురాలు కె. ఉమ తదితరులు ప్రసంగించారు. పట్టుదలగా అగ్రిమెంటు సాధించుకున్న కార్మికులను అభినందించారు. భవిష్యత్తులో ఇదే ఐక్యతను ప్రదర్శించాలనీ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఇఫ్టూ రాజకీయాలను అర్థం చేసుకొని సంఘ నిర్మాణాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అరుణోదయ నాయకులు దోర సాంబశివరావు విప్లవ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి చుట్టల కార్మిక సంఘం నాయకులు వి. చంటి, యస్. రాము, పి. రమణ, మహాలింగం, సత్యన్నారాయణ, తాయారు, గౌరి, దాలమ్మ, మణి, సోమమ్మ, హైమ, బీబీ తదితరులు నాయకత్వం వహించారు.

ఈ ఒప్పందం ది. 20.6.08 నుండి 19.06.2010 వరకూ రెండు సం॥రాలు అమలులో వుంటుంది.

న్యూడెమోక్రసీ నాయకుడు కా॥ తుమ్మలపల్లి వీర్రాజు మృతి

సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి డివిజన్ కమిటీ సభ్యుడు, రైతు-కూలీ ఉద్యమ నేత కా॥ తుమ్మలపల్లి వీర్రాజు జూన్ 11న మృతి చెందారు. ఆయన వయస్సు 75 సం॥లు. ఆయన మృతికి న్యూడెమోక్రసీ, ఎఐకెఎంఎస్ ప్రగాఢ సంతాపం తెలియజేసినది. మృతిపట్ల ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి కామ్రేడ్స్ యస్. రాజారావు, యం. దుర్గా ప్రసాద్‌లు విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. డివిజన్ రైతు-కూలీ ఉద్యమ నిర్మాణానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆ ప్రాంత వుద్యమానికి ఆయన మరణం తీరని లోటన్నారు.

అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పై నాయకులతోపాటు పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్స్ జె. వెంకటేశ్వర్లు, కె. వెంకటేశ్వర్లు, ప్రదీప్, ఎఐకెఎంఎస్ నాయకులు లక్ష్మి, ఆదినారాయణ, దుర్గారావు, జయరాం, లక్ష్మి, వెంకటేశ్వర్లు, నాగరత్నం పాల్గొని సంతాపాన్ని తెలిపారు.

KLVA 10 2 M 365

నెల్లూరులో కా॥ పెరుమాళ్ళు ప్రథమ వర్ధంతి సభ

నెల్లూరు పట్టణంలో టైలర్స్ కాలనీ ఏర్పాటుకై అహర్నిశలు కృషి చేసిన సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) నెల్లూరు జిల్లా నాయకులు, అమరుడు కా॥ పెరుమాళ్ళు ప్రథమ వర్ధంతి సభ టైలర్స్ కాలనీలో జూన్ 6న జరిగింది. పార్టీ జిల్లా నాయకులు కా॥ సి. హెచ్. కొండయ్య అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ కేంద్ర నాయకులు కా॥ వై. సాంబశివరావు, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. వెంకటేశ్వరరావు, జవహార్ భారతి కళాశాల లెక్చరర్ టి. పోతురాజు తదితరులు మాట్లాడారు.

కా॥ వై. సాంబశివరావు తన ప్రసంగంలో కా॥ పెరుమాళ్ళు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన అలుపెరుగని నాయకుడన్నారు. వృత్తి రీత్యా టైలర్ అయినా పూర్తి కాలం పార్టీ కోసం కృషిచేస్తూ, తన కుటుంబాన్ని కూడా పార్టీ కోసం అంకితం చేయాలని ప్రయత్నించిన త్యాగజీవి అన్నారు. పాలకులు ప్రజావ్యతిరేక విధానాలను అమలుపరుస్తూ ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారనీ, ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే కా॥ పెరుమాళ్ళుకు మనం అందించే నిజమైన నివాళి అనీ కా॥ సాంబశివరావు అన్నారు.

పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఇళ్ళ స్థలాలు సాధించే వరకు పోరాడిన కా॥ పెరుమాళ్ళు పేదల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాడని టి. పోతురాజు అన్నారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో వై.యస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రైతుల భూముల్ని బలవంతంగా లాక్కుంటుందనీ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు వ్యతిరేకంగా పోరాడాలని కా॥ ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. సభలో నల్లగొండ, నెల్లూరు జిల్లా అరుణోదయ కళాకారులు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి.

సభకు ముందు న్యూడెమోక్రసీ ప్రకాశం జిల్లా కార్యదర్శి కా॥ చిట్టిపాటి వెంకటేశ్వర్లు, టైలర్స్ అసోసియేషన్ నాయకులు బి. శ్రీనివాసులు, స్థూప నిర్మాణకమిటీ కన్వీనర్ షేక్ ఖాదర్ బాషా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు, కాలనీవాసులు కా॥ పెరుమాళ్ళు స్థూపం వరకు ప్రదర్శనగా వెళ్ళి జోహార్లు అర్పించారు.

వరికి మద్దతు ధరకై కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా

వరికి మద్దతు ధర వెయ్యి రూపాయలు ఇవ్వాలనీ, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణాలను, విత్తనాలను ప్రభుత్వమే ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో జూన్ 19న కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ పి. గోకారి మాట్లాడుతూ, వరి ధాన్యానికి కనీస మద్దతు ధర వెయ్యి రూపాయలు ఇవ్వాలనీ, అదే విధంగా వ్యవసాయ కూలీలకు కనీస వేతనం వంద రూపాయలు చెల్లించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలుదారులతో సహా రైతాంగానికి సకాలంలో విత్తనాలు, ఎరువులు, రుణాలు కూడా ప్రభుత్వమే అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ ఉరుకుందరావు, రాజు, శ్రీనివాసులు, లింగన్న, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులకై ఇల్లందులో ప్రదర్శన

ఖమ్మం జిల్లా ఇల్లందు మండల కేంద్రంలో అన్ని రకాల విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలనీ, బ్యాంకు రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ జూన్ 12న ఎఐకెఎంఎస్ ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన, తహశీల్దారు ఆఫీస్ వద్ద ధర్నా జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) కొత్తగూడెం డివిజన్ నాయకుడు కా॥ జె. సీతారామయ్య, ఎఐకెఎంఎస్ మండల కార్యదర్శి కా॥ ఎన్. రాజు మాట్లాడారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలను ఆసరా చేసుకుని వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి నకిలీ విత్తనాలు, ఎరువులను రైతులకు అమ్ముతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం కల్తీ విత్తనాలు, ఎరువుల వ్యాపారులపై చర్య తీసుకొని నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందజేయాలనీ, అన్ని రకాల రైతాంగ రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలనీ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రసాద్, నాగేశ్వరరావు, నర్సయ్య, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీలో సౌకర్యాలను మెరుగు పర్చాలని ఐటీడీఏ వద్ద ధర్నా

జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం తదితర మండలాల్లో త్రాగునీరు, వైద్యం, కరెంట్, రోడ్లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మే 28న సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) జంగారెడ్డి గూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోట రామచంద్రపురం ఐటీడీఏ వద్ద ధర్నా జరిగింది. ఐటీడీఏ పి.ఓ వచ్చేంత వరకు మూడున్నర గంటలు ధర్నా కొనసాగింది. అనంతరం పి.ఓ.కు డిమాండ్స్‌తో కూడిన వినతపత్రాన్ని ప్రతినిధి బృందం అందజేసింది. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కా॥ ధర్ముల సురేష్ మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజనుల కోసం ఏర్పాటు అయిన ఐటీడీఏలు వారి సమస్యలను పరిష్కరించటంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. సెలబ్రల్ మలేరియా, పచ్చకామెర్లుకు, సరియైన వైద్య సౌకర్యం లేక, పౌష్టికాహారం లోపం వల్ల అనేక మంది గిరిజనులు పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. నేటికి సరియైన త్రాగు నీరు, కరెంట్, రోడ్డు సౌకర్యాలు లేవని, వెంటనే ఏజెన్సీలో మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గిరిజన, పేద రైతు-కూలీల సమస్యలపై శ్రీకాకుళం జిల్లాలో సదస్సు

గిరిజన, పేద రైతు-కూలీల సమస్యలపై శ్రీకాకుళం జిల్లా టెక్కలి డివిజన్ కేంద్రంలో జూన్ 13న ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కా॥ పైల చంద్రమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ పి. టాన్యా మాట్లాడుతూ, అడవిని నమ్ముకొని దానిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివాసులను పాలకులు అడవుల నుండి గెంటివేస్తున్నారన్నారు. అదే విధంగా కోస్టల్ కారిడార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీరంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది మత్స్యకారుల కుటుంబాలను నిర్వాసితులను చేస్తున్నాయనీ ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో వున్న 21 మండలాల్లో ఒక్క సీతంపేట మండలాన్ని ఏజెన్సీ ప్రాంతంగా గుర్తించటం వల్ల, 1/70 చట్టం అమలుగాక ఈనాటికి భూములు పెత్తందార్ల, భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయనీ, ఫలితంగా అనేక సౌకర్యాలను, ఉద్యోగాలను, ఉపాధి, తదితర వాటిని గిరిజనులు కోల్పోతున్నారన్నారు. ఐటీడీఏ పరిధిలోని మండలాలను ఏజెన్సీ మండలాలుగా గుర్తించాలనీ, జీడి, కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనీ, పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలనీ ఆమె డిమాండ్ చేశారు.

ఇంకా ఈ సదస్సులో ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ పోలా ఈశ్వరరావు, విజయనగరం జిల్లా నాయకులు కా॥ సత్యనారాయణ, నీలంరాజు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కా॥ తాండ్ర ప్రకాశ్, తదితరులు మాట్లాడారు. జిల్లాలో రైతాంగం, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం సదస్సు పలు తీర్మానాలను చేసింది. శ్రీకాకుళం జిల్లాలో మెజారిటీ గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను ఐదవ షెడ్యూల్‌లో చేర్చాలనీ, తీరప్రాంత మత్స్యకారుల జీవితాలను నాశనం చేసే కోస్టల్ కారిడార్ ప్రతిపాదనను విరమించుకోవాలనీ, సెజ్‌లను రద్దు చేయాలనీ, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలనీ, జిందాల్ కంపెనీకి బలవంతంగా భూమిని సేకరించే పనిని నిలుపు చేయాలనే తదితర తీర్మానాలను సదస్సు ఆమోదించింది.

మీకు తెలుసా?

2007లో ప్రపంచ సైనిక ఖర్చు 1 లక్షా 34 వేల కోట్ల డాలర్లని (1.34 ట్రిలియన్లు) అంచనా. (మన రూపాయిలలోనైతే ఈ సైనిక ఖర్చు 53 లక్షల 60 వేల కోట్లు ఉంటుంది) గత సంవత్సరంతో పోల్చితే 6% పెరిగింది. ఈ మొత్తం సైనిక ఖర్చులో దాదాపు సగం అమెరికాదే ఉంటుంది. వివిధ ప్రపంచ దేశాల సైనిక ఖర్చు శాతాలలో ఈ విధంగా ఉంది.

అమెరికా - 45%, బ్రిటన్ - 5%, చైనా - 5%, ఫ్రాన్సు - 4%, జపాను - 4%, జర్మనీ - 3%, రష్యా - 3%, సౌదీ అరేబియా - 3%, ఇటలీ - 3%, ఇండియా - 2%, దక్షిణకొరియా - 2%, మిగతా దేశాలన్నీ కలిసి - 21%.

- 1998 - 2007 మధ్య కాలంల్లో ప్రాంతాల వారీగా సైనిక ఖర్చు పెరుగుదల ఈ విధంగా ఉంది.

యూరోపు - 16%, ఆఫ్రికా - 51%, ఆసియా, ఓసియానియా - 52%, మధ్య ప్రాచ్యం - 62%, ఉత్తర, దక్షిణఅమెరికాలు - 63%.

స్టాక్ హోంలోని అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ వెల్లడించిన వివరాలివి.

గత రెండు మూడు దశాబ్దాల నుండి ప్రపంచంలో నిరాయుధీకరణగురించి, వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు గురించి, అణ్వస్త్ర ఆయుధాల విస్తరణనిరోధం గురించి, రకరకాల రసాయనిక, తదితర ఆయుధాల నిరోధం గురించీ అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాద దేశాలు చర్చల మీద చర్చలు సాగిస్తూనే ఉన్నాయి. మరొకవైపు వీరు ఆయుధాలపై ఖర్చును విపరీతంగా పెంచుతూ పోతున్నారు. ముఖ్యంగా అమెరికా ప్రపంచంపై పెత్తనం కోసమూ, ఆయుధాల వ్యాపారంలో ఆధిపత్యం కోసమూ సైనిక ఖర్చును విపరీతంగా పెంచుతోంది. ప్రపంచ ప్రజలను మోసం చేయడానికి, ప్రపంచంలో తన దగ్గర తప్ప మరెవ్వరి దగ్గర ఆధునాతన ఆయుధాలు లేకుండా జాగ్రత్త పడడానికే అమెరికా ఈ నిరాయుధీకరణచర్చల కపటనాటకాన్ని కొనసాగిస్తున్నది.

మరొకవైపు ప్రపంచంలోని అతి పేద దేశాలలో ఆహార, వైద్య, విద్యారంగాల అభివృద్ధికి తోడ్పడుతామని కోతలు కోస్తున్నాయి. ఇందు కోసం ధనిక దేశాల స్థూల దేశీయోత్పత్తిలో 1 లేదా 2 శాతం నిధులు కేటాయిస్తామని పేద దేశాలను ఊరిస్తున్నాయి. కానీ ఆచరణలో ఏ మాత్రం నిధులు కేటాయించడం లేదు.

సామ్రాజ్యవాద దేశాలు తమ సైనిక ఖర్చులో కొంత భాగాన్నైనా తగ్గించుకుని ప్రపంచంలో పేదల కోసం కేటాయించినా ప్రపంచంలో దారిద్ర్య నిర్మూలన చేయడం సాధ్యమవుతుంది. శాశ్వతంగా ఆహార భద్రత సాధించటం సాధ్యమవుతుంది. విద్య, వైద్య రంగాలను అన్ని దేశాలలో అభివృద్ధి చేయడానికి తోడ్పడుతుంది. కానీ, పెద్ద పులి శాఖాహారిగా మారటం యెంత అసాధ్యమో, సామ్రాజ్యవాదం శాంతి కాముకురాలిగా, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే దానిగా మారుతుందని ఆశించటం అత్యాస మాత్రమే. సామ్రాజ్యవాదమంటేనే యుద్ధమని కామ్రేడ్ లెనిన్ చెప్పాడు. ఆయుధాల మీద వృథా ఖర్చు చేయటం, విధ్వంసాలను సృష్టించటం పెట్టుబడిదారీ విధానాలు సహజ లక్షణం.

If undelivered please return to: Manager

PRAJAPANDHA
MARX BHAVAN
H.No.1-9-295/11/4
7th Line,
Vidyanagar,
Hyderabad.
500 044. A.P.

Regd. No. HSE-673

BOOK-POST

To

BOOK-POST
53. Complimentary 1-1-2001
COMRADE KOLLA VENKAIAH
MEMORIAL LIBRARY,
...NANDIPADU (PO & MDL)
...TUR (DIST) - 522 235.

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No.1-9-295/11/4, 7th Line, Maseedu Road, Vi... Hyderabad-44 and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P.) Editor : M. Narayana Swamy-Phone: 27607884, Fax : 27662518

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M306
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	17
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Priyanka
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	Naveen
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
సంస్థతి	Good